www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గుల్జార్, రామభద్రాచార్యకు జ్ఞానపీఠ్

2

ఉర్దూ, సంస్కృత సాహితీవేత్తలకు పురస్కారం

2023 ఏడాదికి ప్రకటించిన ఎంపిక కమిటీ

జ్యూరీలో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి, కవి కృష్ణారావు

పసితనంలోనే కంటిచూపు కోల్పోయినా

సాహితీ రంగంలో రామభద్రాచార్య అసాధారణ కృషి

ఉర్దూ సాహితీ జగత్తులో గుల్జార్ ధ్రువతార

బాలీవుడ్‌లో అనేక సూపర్‌హిట్ పాటలు ఆయన రాసినవే



గుల్జార్ | రామభద్రాచార్య

ఆదివారం | 18-2-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 304 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 8.17 తదుపరి దశమి; నక్షత్రం: రోహిణి ఉ. 9.24 తదుపరి మృగశిర; వర్జ్యం: మ. 3.16-4.57; దుర్ముహూర్తం: సా. 4.43-5.29; అమృతఘడియలు: శేషం 7.45, రా. 1.20-3.01; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలుగు రాష్ట్రాలతో బీజేపీ 'పొత్తులాట'

"సార్వత్రిక ఎన్నికల్లో మీరు తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నారా? ఇంత నమ్మకమైన మిత్రుడిని నేను ఉండగా తెలుగుదేశం పార్టీ అవసరమేముంది? తెలుగుదేశం పార్టీతో పొత్తు ఆలోచన చేయవద్దు ప్లీజ్!"... ఇది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిసి చేసిన విజ్ఞప్తి!

ప్రధానమంత్రి అనుమతితో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలుగుదేశం అధినేత చంద్రబాబును ఢిల్లీకి ఆహ్వానించి పొత్తు విషయం కదిపారు. దీంతో కలవరపాటుకు గురైన జగన్ ఆ వెంటనే ఢిల్లీకి పరిగెత్తి ప్రధాని మోదీని కలిశారు.



'తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోబోం అని ప్రధాని మా వాడికి హామీ ఇచ్చారట' అని జగన్ సన్నిహితులు కనిపించిన వారందరికీ చెబుతున్నారు. ప్రధాని ఏమి చెప్పారో, జగన్‌కు ఏమి అర్థమైందో తెలియదుగానీ ఆ తర్వాత కూడా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒక సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీయేలోకి పాత మిత్రులు వస్తున్నారని, అందులో తెలుగుదేశం పార్టీ కూడా ఉంటుందని చెప్పారు.

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సమయంలో చేసినటువంటి అరాచకాలను సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూడా తెరలేపి మళ్లీ అధికారంలోకి రావొచ్చునని జగన్మోహన్ రెడ్డి లెక్కలు వేసుకుంటున్నారు. తన ఆటలు సాగాలంటే ఎన్నికల కమిషన్ సహకారం అవసరం. తెలుగుదేశం-బీజేపీ మధ్య పొత్తు కుదిరితే ఎన్నికల కమిషన్ నుంచి సహకారం లభించదు.

ముప్పై ఏళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి, పార్టీ తరఫున పోటీ చేసే వారికోసం ఐదేళ్లకే కాగడా పెట్టి వెతుక్కొనే పరిస్థితి రావడం, పార్టీ టికెట్ పొందిన వారు సైతం పారిపోయే పరిస్థితి రావడం స్వయంకృతాపరాధమే.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..

ఇప్పటికే పలు నియోజకవర్గాలలో కనీసం ఐదారు వేల వరకు దొంగ ఓట్లు ఉన్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో మూడు నాలుగు దశల్లో ఎన్నికలు జరిపించగలిగితే దొంగ ఓటర్లను వాడుకోవచ్చునని జగన్ శిబిరం భావిస్తోంది. తెలుగుదేశం-బీజేపీ మధ్య పొత్తు కుదిరితే వారు ఆశిస్తున్నట్టు జరగదు.

జగన్ కోసం అన్ని నిబంధనలనూ అతిక్రమించి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న ఐపీఎస్ అధికారులు కూడా పొత్తు కుదిరితే భయపడతారు. ఈ పరిస్థితి ఏర్పడుతుందని జగన్ రెడ్డికి తెలుసు. ఎంతటి పాలెగాడైనా పోలీసుల సహకారం లేకపోతే పిల్లికంటే అధ్వానంగా వ్యవహరిస్తారు. జగన్ ఇందుకు అతీతుడుకారు.

గఘన విజయం!



నింగిలోకి దూసుకెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్

నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్

18.46 నిమిషాల్లో కక్ష్యలోకి ఇన్‌శాట్-3డీఎస్

ఇస్రోకు ఈ ఏడాది వరుసగా రెండో విజయం

భూ, సముద్ర ఉపరితలాల పర్యవేక్షణ సులభతరం

వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం

జూన్‌లో 'నిసార్' ప్రయోగం: ఇస్రో చైర్మన్ సోమనాథ్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17: అంతరిక్ష రంగంలో మన శాస్త్రవేత్తలు సత్తా చాటారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. వాతావరణ పరిస్థితులపై అధ్యయనం కోసం చేపట్టిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతం అయింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 ఉపగ్రహ వాహక నౌక శనివారం సాయంత్రం 5.35 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం

మిగతా 2వ పేజీలో...



పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న చంద్రబాబు



వైసీపీ పని ఫినిష్

జగన్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది

ఎన్నికల్లో రామరాజ్య స్థాపనకు, రావణాసుర వధకు ప్రజలు సిద్ధం కావాలి

54 రోజుల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం

అడ్డొస్తే తొక్కుకుంటూ పోతాం

అమరావతిని నాశనం చేశారు

సిగ్గులేకుండా నాలుగో రాజధాని పాట

జగన్‌కు ఇసుక, మైన్స్, జేబ్రాండే ఆహారం

కప్పం కట్టని గ్రానైట్ వ్యాపారులపై కేసులు

నేనొచ్చాక గ్రానైట్ రంగాన్ని ఆదుకుంటా

ఊళ్లమీద పడే ఆంబోతులకు కళ్లెం వేస్తా

వలంటీర్ వ్యవస్థకు నేను వ్యతిరేకం కాదు

పోలీసులూ.. వైసీపీని మోస్తే మీకూ కష్టాలే

ఇంకొల్లు 'రా..కదలిరా' సభలో చంద్రబాబు

రాష్ట్ర విభజన తర్వాత అనేక అడ్డంకులు, సవాళ్లు అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాం. అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా మార్చాను.

వైసీపీ పాలనలో జగన్ ధనవంతుడయ్యాడు. ప్రజలు పేదలయ్యారు. రాష్ట్రంలో అభివృద్ధి లేక ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి. జగన్ పాలన వల్ల రాష్ట్ర ప్రజలు ఒక్కొక్కరు 88 వేల మేర ఆదాయం కోల్పోయారు.

- చంద్రబాబు

బాపట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దుర్మార్గ జగన్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఆయన పని, వైసీపీ పని ఫినిష్ అని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. మరో 54 రోజుల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమని, అడ్డొస్తే తొక్కుకుంటూ పోతామని అన్నారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపిచ్చారు. అభ్యర్థులు కూడా దొరకని దుస్థితిలో వైసీపీ ఉందని, 'వైనాట్ పులివెందుల' అనేదే తమ నినాదమని అన్నారు. శనివారం బాపట్ల జిల్లా ఇంకొల్లులో నిర్వహించిన 'రా... కదలిరా' బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. జగన్ అన్నం తినడం లేదని, అల్పాహారం కింద ఇసుక, భోజనంలో మైన్స్, డిన్నర్‌కు జే బ్రాండ్ మద్యంతో కడుపు నింపుకొంటూ దోపిడీ బకాసురుడుగా మారిపోయారని విమర్శించారు. రాష్ట్రాన్ని చెరబట్టి వ్యవస్థలన్నింటినీ నాశనం చేశారని, ఊళ్లమీద పడి ఆంబోతుల్లాగా సహజ వనరులను దోచేస్తున్నారని ఆరోపించారు. అధికారం ఉంది కదా అని

మిగతా 11వ పేజీలో...

'సంఘం' చేయని సంతకం!

ఇరుక్కుపోయిన ఐపీఎస్ కాంతి రాణా



'జగన్ భక్త ఐపీఎస్'లపై ఖండన

ఐపీఎస్ అధికారుల సంఘం పేరిట జారీ

కార్యదర్శి అనుమతి లేకుండా, తెలియకుండానే ఆయన తరఫున విజయవాడ సీపీ సంతకం

అది తెలిసి మండిపడిన కార్యదర్శి ఆర్‌కే మీనా

మీ పరిధిలోనే మీపై కేసు పెడతానని హెచ్చరిక

ఐపీఎస్ వర్గాల్లో తీవ్ర చర్చ



Commissioner of Police and Addl. Dist. Magistrate, Vijayawada Metropolitan Area.

పోలీసు కమిషనర్ హోదాలో కాంతి రాణా సంతకం



Secretary, 12/2/2024
AP IPS Officers Association.

'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఖండిస్తూ జారీ చేసిన ప్రకటనపై ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి తరఫున టాటా చేసిన సంతకం.

ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను అడ్డగోలుగా వాడుకుంటున్న అధికార వైసీపీ... వారి సంఘాలతోనూ ఆటలాడుతోంది. నిజాలు నిక్కచ్చిగా రాసే 'ఆంధ్రజ్యోతి'ని బెదిరించేందుకు ఐపీఎస్ అధికారుల సంఘాన్ని ప్రయోగించింది. అయితే... ఈ ప్రయోగం కాస్తా వికటించింది. వైసీపీ సర్కారు దివాలాకోరుతనం బయటపడింది. సూత్రధారులు ఎవరైనప్పటికీ... ఇందులో పాత్రధారిగా మారి అడ్డంగా బుక్కైపోయింది మాత్రం విజయవాడ నగర పోలీసు కమిషనర్, ఐజీ కాంతి రాణా టాటా!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని... విపక్షాలపై విరుచుకుపడే అస్మదీయ ఐపీఎస్‌లకు కీలక పోస్టింగులు ఇవ్వడం అక్షరాలా నిజం! దీనిపై ఈనెల 12న 'జగన్ భక్త ఐపీఎస్‌లు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో తాడేపల్లి శిబిరం ఉలిక్కి పడింది. ఈ కథనాన్ని ఖండించేందుకు ఒక భారీ హైడ్రామా నడిపింది. 'తప్పులు రాస్తే ఊరుకోం. శిక్షిస్తాం. కేసులు పెడతాం' అని హెచ్చరిస్తున్నట్లుగా ఐపీఎస్ అధికారుల సంఘం లెటర్ హెడ్‌తో ఒక ప్రకటన వెలువడింది. ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి, అదనపు డీజీ ఆర్కే మీనా తరఫున విజయవాడ నగర కమిషనర్ కాంతిరాణా టాటా 'ఫార్' సంతకం చేశారు. నిజానికి... ఆయన ఐపీఎస్ సంఘంలో సభ్యుడు

మిగతా 11వ పేజీలో...



మన్యంలోని బలిజిపేట పోలీస్‌స్టేషన్‌లో ఉద్యోగులతో మాట్లాడుతున్న పోలీసులు

సీపీఎస్ పోరుపై సర్కారీ నిర్బంధం

పోలీస్ దమనకాండతో 'చలో విజయవాడ'కు బ్రేకులు

కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసిన ఏపీసీపీఎస్ఈఏ

పోలీసులతో బెదిరింపులు, వేధింపులు, నోటీసుల ఫలితం

ముందు రోజు నుంచే ఉక్కుపాదం మోపిన ప్రభుత్వం

ఉద్యోగులను నీడలా వెంటాడిన పోలీసులు

స్కూళ్లు, కార్యాలయాల వద్ద సివిల్ డ్రస్సుల్లో మోహరింపు

నేడు జిల్లా కేంద్రాల్లో ఆందోళనలకు సంఘం పిలుపు

అమరావతి, విజయవాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలనే డిమాండ్‌తో సీపీఎస్ ఉద్యోగులు ఆదివారం తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమం.. వైసీపీ ప్రభుత్వ నిర్బంధకాండతో తాత్కాలికంగా నిలిచిపోయింది. ఒక రోజు ముందునుంచే సీపీఎస్ ఉద్యోగులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. నోటీసులు, బెదిరింపులు, వేధింపులతో ఎక్కడికక్కడ నిర్బంధాన్ని అమలు చేసి, అడుగడుగునా ఆటంకాలు కలిగించడంతో 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని సీపీఎస్ ఉద్యోగులు తాత్కాలికంగా విరమించుకున్నారు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తానని గత ఎన్నికల సమయంలో

మిగతా 12వ పేజీలో...

370 నంబరు కాదు.. సెంటిమెంట్!

శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నివాళిగా 370 సీట్లు సాధిద్దాం

ఆర్టికల్ 370 రద్దు కోసం ఆయన జీవితాన్నే త్యాగం చేశారు

వచ్చే వంద రోజులపాటు పోలింగ్ బూత్‌లపైనే కార్యకర్తలు దృష్టి పెట్టాలి

ప్రతి బూత్ నుంచి గతంలోకన్నా 370 ఓట్లు ఎక్కువ వచ్చేలా చూడాలి

బీజేపీ జాతీయ సదస్సులో పార్టీ శ్రేణులకు ప్రధాని మోదీ పిలుపు

11,500 మంది ప్రతినిధులు హాజరు

మోదీ సర్కార్ హ్యాట్రిక్ పక్కా: నడ్డా



శనివారం భారత్ మండపం వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న మోదీ, నడ్డా, రాజ్‌నాథ్, అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని నిర్దేశించుకున్న 370 సీట్లు.. ఒక సంఖ్య మాత్రమే కాదని, అదొక సెంటిమెంటు కూడా అని ప్రధాని మోదీ చెప్పారు. దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడే లక్ష్యంతో ఆర్టికల్ 370 రద్దు కోసం (జనసంఘ్ వ్యవస్థాపకుడు) శ్యామ ప్రసాద్ ముఖర్జీ తన జీవితాన్నే త్యాగం చేశారని, ఆయనకు నివాళిగా 370 సీట్లు గెలవాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీలో బీజేపీ జాతీయ సదస్సు ప్రారంభానికి ముందు సమావేశమైన పార్టీ ఆఫీస్ బేరర్లను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. పార్టీ గుర్తయిన కమలం పువ్వే వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ పడుతుందని, దాని కోసం శక్తివంచన లేకుండా పని చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే 100 రోజుల్లో ప్రతి కార్యకర్త పోలింగ్ బూత్‌లపైనే దృష్టి పెట్టాలని, 2019లో వచ్చినదానికన్నా ఈసారి ప్రతి పోలింగ్ బూత్‌లో 370 ఓట్లు

మిగతా 2వ పేజీలో...

3 రాజధానులంటూ 3 ముక్కలాట

రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడు

ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం ఆయనే

రూ.10 ఇచ్చి 100 లాక్కుంటున్నాడు

విశాఖకు ఒక్క పరిశ్రమా తీసుకురాలేదు

కానీ 500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడు

మేమొచ్చాక ప్రజలకు అంకితమిస్తాం

100 రోజుల్లో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

విశాఖ, విజయనగరం సభల్లో లోకేశ్

విశాఖకు ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని జగన్ రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడు. ఒక వ్యక్తి ఉండడానికి కోట్లాది రూపాయలు విలువచేసే ప్యాలెస్ ఎందుకు? మేం అధికారంలోకి వచ్చాక ఆ ప్యాలెస్‌ను ప్రజలకు అంకితమిస్తాం.

11

ఉత్తరాంధ్రను దోచుకునేందుకు బొత్స, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబాలకు లైసెన్స్ ఇచ్చారు. వీరంతా పందికొక్కుల్లా దోచుకున్నారు. జగన్ పాలనలో విశాఖపట్నం విషాదపట్టణంగా మారిపోయింది. భూకబ్జాలు, కిడ్నాప్‌లు, దోపిడీలు, చెరువుల ఆక్రమణలు జరుగుతున్నాయి. - లోకేశ్



రుషికొండపై ముఖ్యమంత్రి కోసం నిర్మించిన ప్యాలెస్ ముందు లోకేశ్ సెల్ఫీ



12

పీచు మిఠాయిపై నిషేధం

తమిళనాడు సర్కారు సంచలన నిర్ణయం

క్యాన్సర్ కారకాలు ఉన్నట్లు నిర్ధారణ

బీజేపీలోకి కమల్‌నాథ్?

2

తనయుడితో ఢిల్లీ చేరిన కాంగ్రెస్ ముఖ్యనేత

రాజ్యసభ సీటు ఇవ్వకపోవడంపై తీవ్ర ఆగ్రహం

బీజేపీలో చేరితే మీడియాకు చెబుతానని వ్యాఖ్య

నకుల్‌నాథ్ ఎక్స్ ఖాతాలో 'కాంగ్రెస్' తొలగింపు

బాణసంచా కర్మాగారంలో పేలుడు
పది మంది మృతి

2

మృతుల్లో నలుగురు మహిళలు

మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

తమిళనాడులో ఘోర ప్రమాదం

బీజేపీలోకి కమల్‌నాథ్ జంప్?

» తనయుడితో ఢిల్లీ చేరిన కాంగ్రెస్ ముఖ్యనేత

» నకుల్‌నాథ్ ట్విటర్ ఖాతాలో 'కాంగ్రెస్' తొలగింపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కాంగ్రెస్ ముఖ్యనేత కమల్‌నాథ్ బీజేపీలో చేరే అవకాశం ఉంది. ఆయనతో పాటు తనయుడు, చింద్వారా ఎంపీ నకుల్‌నాథ్, మరో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరతారని సమాచారం. ప్రస్తుతం వీరంతా భోపాల్ నుంచి ఢిల్లీకి వచ్చారు. బీజేపీలో చేరే అవకాశాలను కమల్‌నాథ్ తోసిపుచ్చడం లేదు. అదే సమయంలో తాను మోదీని కానీ అమిత్‌షాను కానీ కలవలేదని స్పష్టం చేస్తున్నారు. విలేకరులు ఊహాగానాలు చేస్తున్నారని, చేరేది ఉంటే తప్పకుండా చెబుతానని కమల్‌నాథ్ స్పందించారు. నకుల్‌నాథ్ ఇప్పటికే తన ట్విటర్ ఖాతాలో కాంగ్రెస్ గుర్తును తొలగించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తన ట్విటర్ ఖాతాలో కమల్‌నాథ్, నకుల్‌నాథ్‌ల ఫోటో పెట్టి జైశ్రీరామ్ అని రాశారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వకపోవడంపై కమల్‌నాథ్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.

చిన్నయ్య జంగంకు రామానుజన్ అవార్డు

» గుర్రం జాషువా 'గబ్బిలం' కావ్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన చిన్నయ్య



సీటెల్, ఫిబ్రవరి 17: గుర్రం జాషువా రచించిన ప్రసిద్ధ కావ్యం 'గబ్బిలం'ను ఇంగ్లీషులోకి అనువదించిన చిన్నయ్య జంగం.. ఏకే రామానుజన్ అవార్డుకు ఎంపికయ్యారు. అసోసియేషన్ ఫర్ ఏషియన్ స్టడీస్ ఏటా ప్రదానం చేసే ఈ అవార్డును 2024కు గాను చిన్నయ్యను ఎంపిక చేసింది. మార్చి 16న అమెరికాలోకి సీటెల్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డుతోపాటు వెయ్యి డాలర్ల(సుమారు రూ.83 వేల) నగదు పురస్కారం కూడా చిన్నయ్యకు అందజేయనున్నారు. సమాజంలో ఆనాడు దళితులు ఎదుర్కొంటున్న వివక్ష ప్రధానాంశంగా 1941లో గుర్రం జాషువా 'గబ్బిలం'ను రచించారు. ఆనాటి పరిస్థితులకు అద్దం పట్టే ఈ కావ్యాన్ని నేటి ఇంగ్లీష మీడియం తరం దరికి చేర్చేలా చిన్నయ్య ఇంగ్లీషులోకి అనువదించారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం: సీఈసీ రాజీవ్‌కుమార్

భువనేశ్వర్, ఫిబ్రవరి 17: దేశంలో లోక్‌సభ ఎన్నికలతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నామని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈసీ) రాజీవ్‌కుమార్ తెలిపారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోసం ఏర్పాట్లన్నీ దాదాపుగా పూర్తి చేశామని తెలిపారు. ఒడిశాలోని 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో మొత్తం 37,809 పోలింగ్ కేంద్రాలుండగా, 22,685 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కేరళ పాఠశాలల్లో ఇక నుంచి 'వాటర్ బ్రేక్'

తిరువనంతపురం, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో 'వాటర్ బ్రేక్' అమలు చేయాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పాఠశాలల్లో ఉదయం 10.30, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండుసార్లు వాటర్ బెల్ మోగించి, విద్యార్థులు నీరు తాగేందుకు 5 నిమిషాల చొప్పున విరామం ఇవ్వనున్నట్లు కేరళ విద్యాశాఖ తెలిపింది. ఈ నెల 20 నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. 2019లో మొదటిసారిగా కేరళలోని ఈ విధానాన్ని అమలు చేశారు.

'ఎమ్మెస్పీ'పై కమిటీ.. కేంద్రప్రభుత్వం యోచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు చట్టబద్ధత కల్పించాలంటూ రైతులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్చించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ప్రభుత్వ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన చేయనున్నట్లు తెలుస్తోంది. కమిటీలో సభ్యుల పేర్లను కూడా రైతు సంఘాలే సూచించాలని కేంద్రం కోరనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, ఆదివారం కేంద్ర మంత్రులు రైతు సంఘాల నేతలతో నాలుగో విడత చర్చలు జరపనున్నారు. రైతులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21న యూపీ, హరియాణా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ధర్నా చేయనున్నట్లు టికాయత్ చెప్పారు.

ఝార్ఖండ్ కాంగ్రెస్‌లో అసమ్మతి స్వరం

రాంచి, ఫిబ్రవరి 17: ఝార్ఖండ్ కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి జ్వాలలు రగులుకున్నాయి. సీఎం చంపయ్ సోరెన్ ప్రభుత్వంలో హేమంత్ సోరెన్ మంత్రివర్గంలో పనిచేసిన నలుగురికి మళ్లీ మంత్రి పదవులు ఇవ్వడంపై ఈ అసమ్మతి రగులుకుంది. వారిని తప్పించి కొత్తవారికి పదవులు ఇవ్వకపోతే ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు తాము హాజరుకాబోమని 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటించారు. ఆలంగీర్ ఆలం, రామేశ్వర్ ఓరాన్, బన్న గుప్తా, బాదల్ పత్రలేఖ్‌లకు మళ్లీ మంత్రి పదవులు ఇవ్వడం అసమ్మతి జ్వాలను రగిల్చింది. ఆ నలుగురిని పదవుల నుంచి తప్పించి కొత్తవారికి ఇవ్వాల్సిందేనని 12 మంది అసమ్మతి ఎమ్మెల్యేలు అల్టిమేటం జారీ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఐదు డివిజన్లకి డివిజన్‌కి ఒక మంత్రి పదవి చొప్పున ఇవ్వాలన్నారు.

సర్కారు, కోర్టుల మధ్య కాస్త ఘర్షణ మంచిదే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థల మధ్య కాస్త ఘర్షణ ఉండడం మంచిదేనని, అది ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కౌల్ అన్నారు. వివిధ వ్యవస్థల మధ్య సమతౌల్యం ఉండాలన్న రాజ్యాంగ లక్ష్య సాధనకు ఇలాంటి ఘర్షణ ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ఘర్షణ ముదిరితే మాత్రం ప్రమాదమని అన్నారు. 17వ లోక్‌సభ కాలంలో ఉత్తమ సేవలు అందించిన పార్లమెంటు సభ్యులకు సన్సద్ రత్న అవార్డులను శనివారం ఇక్కడ బహూకరించిన సందర్భంగా ఏర్పాటయిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. చెన్నైకు చెందిన ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ అవార్డులను నెలకొల్పింది. ఈ ఏడాదికి గాను మొత్తం 12 మందికి వీటిని ప్రకటించింది.

సుపీరియర్లకు నేరుగా విన్నవించారని సర్వీసు నుంచి తొలగించలేరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: తన సమస్యపై నేరుగా ఉన్నతాధికారులకు వినతి పత్రం పంపించారన్న కారణం చూపి ప్రభుత్వ ఉద్యోగిని విధుల నుంచి తొలగించలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్థికపరమైన ఇక్కట్లు ఎదురైనప్పుడు తొలుత తనపై ఉండే అధికారులకు కాకుండా నేరుగా సుపీరియర్ అధికారులకు వినతి పత్రం సమర్పించడం సహజమేనని తెలిపింది. దాన్ని క్రమశిక్షణ రాహిత్యంగా పరిగణించి ఉద్యోగం నుంచి తీసివేయలేరని పేర్కొంది. జిల్లా కోర్టులో పనిచేస్తున్న ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఛత్రపాల్ అనేవ్యక్తి శాశ్వత ప్రాతిపదికన ఆర్డర్లీగా నియమితులయ్యారు. తర్వాత నజరత్ విభాగానికి ప్రాసెస్ సర్వర్‌గా బదిలీ అయ్యారు. మొదటిదాని కన్నా ఇది పెద్ద పోస్టే అయినప్పటికీ అంతకుతగ్గ జీతం రాకపోవడంతో నేరుగా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు పంపించారు. ఇది క్రమశిక్షణరాహిత్యమేనని భావించి 2003లో సంబంధిత అధికారులు ఆయనను సస్పెండ్ చేశారు.

మెదడు కేన్సర్ మెడలు వంచాడు!

» చరిత్ర సృష్టించిన 13 ఏళ్ల బెల్జియం బాలుడు లూకాస్

» డీఐపీజీని జయించిన తొలి వ్యక్తిగా రికార్డు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: వైద్య చరిత్రలోనే అద్భుతం జరిగింది. బెల్జియం దేశానికి చెందిన 13ఏళ్ల చిన్నారి లూకాస్ అరుదైన బ్రెయిన్ కేన్సర్‌ను జయించాడు. ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన డిఫ్యూజ్ ఇంట్రిన్సిక్ పాంటిన్ గ్లియోమా(డీఐపీజీ) వ్యాధిని ఓడించిన మొట్టమొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. దాదాపు ఏడేళ్ల పాటు చికిత్స పొందిన తర్వాత లూకాస్ మెదడులో కేన్సర్ కణితి జాడ లేకుండా పోయింది. ఈ విషయాన్ని అతనికి చికిత్స అందించిన ప్యారిస్‌లోని గుస్టావ్ రూసీ కేన్సర్ సెంటర్‌కు చెందిన డాక్టర్ జాక్వెస్ గ్రిల్ నేతృత్వంలోని వైద్య నిపుణులు ధ్రువీకరించారు.

'గ'ఘన' విజయం



నింగిలోకి దూసుకెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం కావడంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న శాస్త్రవేత్తల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఈ ఏడాది ఇస్రో వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకొన్నట్లయింది. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు విలువైన సమాచారం అందించేందుకు ఉద్దేశించిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగాన్ని ఇస్రో చేపట్టింది. ఈ ఏడాది ఇది రెండో ప్రయోగం కాగా జీఎస్ఎల్వీ-మార్క్2 ప్రయోగాల్లో 16వది కావడం గమనార్హం. శుక్రవారం కౌంట్‌డౌన్ ప్రారంభించి శనివారం సాయంత్రం 5.35 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ నింగిలోకి పయనమైంది. 18.46 నిమిషాల పాటు సాగిన ప్రక్రియను మూడు దశల్లో పూర్తి చేశారు. రాకెట్ తన మూడు దశలను సునాయాసంగా పూర్తి చేసుకొన్న తరువాత శిఖర భాగాన ఉన్న 2,275 కిలోల బరువు గల ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రస్తుతం సేవలందిస్తున్న ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్‌లకు కొనసాగింపుగా ఇన్‌శాట్-3డీఎస్ వాతావరణ సేవలను మెరుగుపరచనుంది. ప్రయోగం విజయవంతమైన అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ మాట్లాడారు. ఇస్రోకు ఇది అద్భుత విజయమన్నారు. జూన్‌లో జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఇస్రో, నాసా సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని సోమనాథ్ తెలిపారు.

ఉపయోగాలు ఎన్నెన్నో...

ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగంతో మెరుగైన వాతావరణ సమాచారం అందుతుంది. ఇది భూమి, సముద్ర ఉపరితలాలను నిరంతరాయంగా పరిశీలిస్తుంది. ఈ ఉపగ్రహంలో పొందుపరిచిన అత్యాధునిక పేలోడ్ సాయంతో ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని వెంటనే తెలుసుకోవచ్చు. ఇన్‌శాట్-3డీఎస్ మూడో తరం వాతావరణ ఉపగ్రహానికి తదుపరి మిషన్‌గా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయడం
- విపత్తు హెచ్చరికలు నిమిషాల వ్యవధిలోనే అందుబాటులోకి రావడం
- భూమి, సముద్ర ఉపరితలాలను నిరంతరాయంగా పర్యవేక్షించడం
- వాతావరణంలోని వివిధ పరిస్థితుల ప్రొఫైల్‌ను అత్యంత వేగంగా అందించడం

ఇవీ ప్రత్యేకతలు...

జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ పొడవు 51.7 మీటర్లు
ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహం బరువు 2,275 కిలోలు
ప్రయోగానికి అయిన ఖర్చు రూ.500 కోట్లకు పైగా
దాదాపు పదేళ్ల పాటు సేవలు అందించేలా రూపకల్పన

సమష్టి విజయం: ఇస్రో చైర్మన్

ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగ విజయం శాస్త్రవేత్తల సమష్టి విజయమని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ అన్నారు. ప్రయోగానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది ఇస్రో వరుసగా రెండో విజయాన్ని అందుకోవడంలో శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందని చెప్పారు. ఈ విజయంతో దేశం నలుమూలల జరిగే వాతావరణ మార్పులపై కచ్చితమైన సమాచారాన్ని అందుకోవచ్చని వివరించారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు పవన్ అభినందనలు

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిశోధనలకు దోహదపడే ఆధునాతన ఉపగ్రహాన్ని విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ విజయం భారతదేశానికి మరో గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. అంతరిక్ష యవనికపై భారత జైత్రయాత్ర కొనసాగించాలని, మరిన్ని ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

లోకం తీరు



బాణసంచా పేలుడుకు పదిమంది బలి

తమిళనాడులోని విరుదునగర్‌లో ప్రమాదం

చెన్నై, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని విరుదునగర్ జిల్లా ఆలంకుళంలోని బాణసంచా కర్మాగారంలో శనివారం భారీ పేలుడు సంభవించి నలుగురు మహిళలు సహా పదిమంది కార్మికులు దుర్మరణం చెందారు. మరో ఎనిమిదిమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. శివకాశి కార్పొరేషన్ ప్రాంతానికి చెందిన విఘ్నేష్ అనే వ్యక్తి నడుపుతున్న ఆ కర్మాగారంలో రోజుకు 150 మందికి పైగా కార్మికులు చేస్తుంటారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఓ గదిలో ఫ్యాన్సీరకం టపాసులకు కార్మికులు పేలుడు మందును కలుపుతుండగా ఉన్నట్టుండి నిప్పురవ్వలు వెలువడి గదిలో ఉన్న టపాసులపై పడ్డాయి. దీంతో అక్కడున్న బాణసంచా మొత్తం పెద్ద శబ్దంతో పేలిపోవడంతో ఆ గదితో పాటు పక్కనే ఉన్న మరో మూడు గదులు కూడా కుప్పకూలాయి. దుర్ఘటనపై ప్రధాని మోదీ, తమిళనాడు సీఎం స్టాలిన్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులకు స్టాలిన్ రూ.3లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.లక్ష చొప్పున సాయం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు మోదీ రూ.2లక్షల చొప్పున సాయం ప్రకటించారు.

వృత్తి నిపుణులకు యూకే చాన్స్

లండన్, ఫిబ్రవరి 17: యూకే హోం కార్యాలయం భారతీయ యువ వృత్తి నిపుణుల పథకం కింద కొత్త బ్యాలెట్‌ను ప్రకటించింది. ఈ పథకం కింద మొత్తం 3వేల మందికి యూకే వెళ్లడానికి అవకాశం లభిస్తుంది. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈ పథకానికి అర్హులు. దరఖాస్తుదారులు తమ బ్యాంకు ఖాతాలో కనిష్ఠంగా 2,530 బ్రిటిష్ పౌండ్లు కలిగి ఉండాలి. వయస్సు 18-30 ఏళ్లలోపు ఉండాలి. ఆసక్తి కలవారు ఫిబ్రవరి 20వ తేదీ మధ్యాహ్నం 2.30 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 2.30 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

370 నంబరు కాదు.. సెంటిమెంట్!



(మొదటి పేజీ తరువాయి)

అధికంగా వచ్చేలా కృషి చేయాలన్నారు. బీజేపీ 370 సీట్లను, ఎన్డీఏ కూటమి 400 సీట్లను గెల్చుకుంటుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రతిపక్షాలు అనవసర, భావోద్వేగపూరిత అంశాలను లేవనెత్తుతాయని కానీ వాటి వలలో పడవద్దని బీజేపీ నేతలు, కార్యకర్తలకు ప్రధాని సూచించారు. దేశంలో జరిగిన అభివృద్ధి, ప్రజానుకూల విధానాలు, ప్రపంచంలో భారత్‌కు పెరుగుతున్న కీర్తి ప్రతిష్ఠలు.. ఈ అంశాల గురించే మాట్లాడాలని చెప్పారు. ఇప్పుడున్నదంతా 'ఆరోప్ ముక్త్, వికాస్ యుక్త్' (ఆరోపణలే లేని అభివృద్ధి విధానాల) కాలమని మోదీ పేర్కొన్నారు. ప్రధాని ప్రసంగం వివరాలను బీజేపీ నేత వినోద్ తావ్డే విలేకర్లకు వెల్లడించారు. భారత్ మండపంలో రెండు రోజులపాటు బీజేపీ జాతీయ సమావేశం జరగనుంది. 11,500 మంది పార్టీ ప్రతినిధులు పాల్గొంటున్నారు. సదస్సును ప్రారంభిస్తూ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రసంగిస్తూ.. వరుసగా మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రానుందన్నారు. దక్షిణాదిలో బీజేపీకి పట్టు లేదన్న వాదన వాస్తవం కాదని, ఆ ప్రాంతంలో కాంగ్రెస్‌కు 28 లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు ఉంటే బీజేపీకి 29 మంది లోక్‌సభ ఎంపీలు, 8 మంది రాజ్యసభ ఎంపీలున్నారన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయిన 161 సీట్లలో దాదాపు ఏడాదిన్నరగా పార్టీ నేతలు 430 సార్లు పర్యటించారని, ప్రతి కేంద్ర మంత్రీ ఒక్కో ఓడిపోయిన సీటులో 3 సార్లు పర్యటించారని.. ఈ సీట్లు కూడా గెలుచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. జాతీయ సమావేశంలో మొదటిరోజు వికసిత్ భారత్, మోదీకీగ్యారంటీ, ఫిర్ ఏక్ బార్ మోదీసర్కార్ అనే అంశాలపై చర్చలు జరిగాయి. ఈ మేరకు రాజకీయ తీర్మానాన్ని ఆమోదించారు. రామాలయ నిర్మాణం సాకారం కావడమే కాదు.. దేశంలో రామరాజ్యమే ఏర్పడిందని తీర్మానంలో పేర్కొనడం విశేషం.

ఒక్కో కార్యకర్తకు 20 లబ్ధిదారుల కుటుంబాల బాధ్యత

కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను బీజేపీ కార్యకర్తలు కలిసే కార్యక్రమం ఇప్పటికే కొనసాగుతుండగా.. ఎన్నికల దృష్ట్యా దీనిని మరింత వేగవంతం చేయాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు కార్యకర్తలకు ఈ నెల 24 వరకూ శిక్షణ ఇచ్చి దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల వివరాలు అందజేస్తారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 5వ తేదీ వరకూ ఒక్కో కార్యకర్త బూత్ స్థాయిలో 20 లబ్ధిదారుల కుటుంబాలను కలుస్తారు. పోలింగ్ జరిగే రోజు వరకూ వారితో నిత్యం అందుబాటులో ఉంటారు. లబ్ధిదారుల అభిప్రాయాలను కార్యకర్తలు సేకరించి పార్టీకి ఎప్పటికప్పుడు అందజేస్తారు. వీటి ఆధారంగా పార్టీ నాయకత్వం ఎన్నికల వ్యూహాలను రూపొందించుకుంటుంది. ఈ మొత్తం కార్యక్రమాన్ని బీజేపీ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ నేతృత్వంలోని 17 మంది సభ్యుల జాతీయ కమిటీ పర్యవేక్షిస్తుంది.

ఈసారి బీజేపీ ఓడిపోకపోవచ్చు! కానీ, 2029లో మాత్రం రానివ్వం

» వాళ్లకి మేమే పెద్ద సవాల్.. అందుకే అన్ని వైపుల నుంచీ దాడి: కేజ్రీవాల్

» రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస తీర్మానం.. మూజువాణి ఓటుతో నెగ్గిన సర్కార్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: "2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోకపోతే.. ఓడిపోక పోవచ్చు. కానీ, 2029లో మాత్రం ఆ పార్టీని అధికారంలోకి రాకుండా మేం అడ్డుకుంటాం" అని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విశ్వాస తీర్మానంపై శనివారం ఆయన మాట్లాడారు. బీజేపీకి తాము పెద్ద సవాల్‌గా మారామని, అందుకే అన్ని వైపుల నుంచి తమపై దాడి చేస్తోందని అన్నారు. "బీజేపీ ప్రస్తుతం ఎవరి గురించైనా భయపడుతోందంటే.. అది ఆప్ గురించే" అని వ్యాఖ్యానించారు. ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ వశపరుచుకుంటోందని, తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకే కమలనాథులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన, సభలో సంపూర్ణ మెజారిటీ ఉన్నప్పటికీ విశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. దీనిని మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. ఓటింగ్ నిర్వహించిన సమయంలో 62 మంది ఆప్ ఎమ్మెల్యేలో 54 మంది సభకు హాజరయ్యారు. దీంతో విశ్వాస తీర్మానం సునాయాసంగా విజయం సాధించింది. అనంతరం కేజ్రీవాల్ మాట్లాడుతూ.. "మాకు మెజారిటీ ఉంది. అయినా.. బీజేపీ కుయుక్తులను తిప్పికొట్టాలనే ఉద్దేశంతోనే విశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాల్సిన అవసరం వచ్చింది" అని తెలిపారు. ఆప్ ఎమ్మెల్యేలు ఎవరూ ఫిరాయించలేదన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు జైల్లో ఉన్నారని, మరికొందరికి ఆరోగ్యం బాగోలేదని, ఇంకొందరు ప్రస్తుతం ఢిల్లీలో అందుబాటులో లేరని సీఎం వెల్లడించారు. "వాళ్లు రామభక్తులమని ప్రకటించుకుంటారు. కానీ, పేదలకు ఉచితంగా ఇచ్చే మందులను అడ్డుకుంటున్నారు. పేదలకు మందులు పంపిణీ చేయకుండా అడ్డుకోవాలని ఆ రాముడు వీరిని కోరాడా?" అని ప్రశ్నించారు. కాగా, ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరయ్యారు. నిజానికి ఆయన స్వయంగా కోర్టుకు రావాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, విశ్వాస తీర్మానంపై చర్చను కారణాలుగా చూపించి కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కాలేనని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. దీంతో కోర్టు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు అనుమతి ఇచ్చింది.

ఔను.. రిగ్గింగ్ జరిగింది!

ఓడిపోవాల్సిన 13మందిని 'గెలిపించా..'

» రావల్పిండి చీఫ్ కమిషనర్ లియాఖత్ వెల్లడి



ఇస్లామాబాద్, లాహోర్, ఫిబ్రవరి 17: రాజకీయ అస్థిరతకు పేరుగాంచిన పాకిస్థాన్‌లో మరో కలకలం. ఇటీవలి ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ రావల్పిండి డివిజన్ చీఫ్ కమిషనర్ లియాఖత్ అలీ ఛత్తా బాంబు పేల్చారు. ఇందులో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ఖాజీ ఫయాజ్ ఐసా, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సికిందర్ రజా పూర్తిస్థాయి పాత్ర పోషించారని ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలకు నిరసనగా ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ ఆందోళనలకు పిలుపునిచ్చిన సమయంలోనే ఇలా జరగడం గమనార్హం. శనివారం ఉద్యోగానికి రాజీనామా అనంతరం రావల్పిండి క్రికెట్ స్టేడియంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ వివరాలు వెల్లడించారు. పాక్‌లో ఈ నెల 8న ఎన్నికల్లో లియాఖత్ పోలింగ్ అధికారిగా వ్యవహరించారు. కౌంటింగ్ సందర్భంగా.. తమ రీజియన్‌లో ఓటమి దిశగా ఉన్న 13 మంది అభ్యర్థులను ఒక్కొక్కరు 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినట్లు ప్రకటించామని తెలిపారు. దేశానికి ద్రోహం చేశానని.. మనశ్శాంతిగా ఉండలేనని వ్యాఖ్యానించారు. విధి నిర్వహణలో భరించలేనంత ఒత్తిడిని ఎదుర్కొన్నానని.. అక్రమాలకు బాధ్యతగా ఉద్యోగం నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ఆత్మహత్య ఆలోచన కూడా వచ్చిందని.. వాస్తవాలు తెలియజేయాలనే మీడియా ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం లియాఖత్‌ను పోలీసులు అరెస్టు చేసి గుర్తుతెలియని ప్రదేశానికి తరలించారు. ఛత్తా వ్యాఖ్యలను పాక్ ఎన్నికల సంఘం ఖండించింది. విచారణ జరుపుతామని తెలిపింది.


మా సీట్లు దోచుకున్నారు: ఇమ్రాన్

లియాఖత్ ఆరోపణలపై ఇమ్రాన్ ట్వీట్ చేశారు. తాము గెలవాల్సిన సీట్లను దోచుకున్నారని ఆరోపించారు. ఒక్క రావల్పిండిలోనే 13 సీట్లను కోల్పోయామన్నారు. దేశమంతా ఇంకెన్ని అక్రమాలు జరిగాయో అని పేర్కొన్నారు.

ఆంక్షలు.. అరెస్టులు

"రికార్డు స్థాయిలో రిగ్గింగ్" అంటూ ఎన్నికల ఫలితాలపై ఇమ్రాన్ పార్టీ ఆందోళనలకు పిలుపునివ్వడంతో శనివారం పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో కఠిన ఆంక్షలు విధించారు. దేశంలోనూ నిరసనలకు దిగిన నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. పార్లమెంటులో ప్రతిపక్షంలో కూర్చోవాలని పీటీఐ నిర్ణయించినా.. జైలులో ఉన్న ఇమ్రాన్‌ను పాక్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ప్రతినిధి కలిసినట్లుగా కథనాలు వస్తున్నాయి. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)తో కలిసి పీటీఐ సర్కారు ఏర్పాటు దీని వెనుక ఉద్దేశమని పేర్కొంటున్నారు. పీటీఐ నిరసనలను ఎదుర్కొంటూ అధికారంలో కొనసాగడం కష్టమనే భావనలో నవాజ్ ఉన్నట్లు చెబుతున్నారు. అంతర్జాతీయ ఒత్తిడిని తట్టుకోవడమూ అసాధ్యమని.. దీనికంటే ప్రతిపక్షంలో ఉండడమే మేలన్నది ఆయన ఆలోచనగా తెలుస్తోంది. కాగా, పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం మరింత పతనమైంది. ఆసియా, ఆస్ట్రేలియా ప్రాంతానికి సంబంధించి ఈఐయూ(ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్) రూపొందించిన ప్రజాస్వామ్య సూచీ-2023లో పాకిస్థాన్ 11 స్థానాలు దిగజారి 118వ స్థానానికి పడిపోయింది. ప్రజాస్వామ్య స్కోరు పరంగా 0.88 పాయింట్లు కోల్పోయి 3.25 పాయింట్లకు పాకిస్థాన్ పడిపోయింది.

గుల్జార్, రామభద్రాచార్యలకు జ్ఞానపీఠ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఉర్దూ కవి, పాటల రచయిత గుల్జార్, సంస్కృత పండితుడు, చిత్రకూట్‌లోని తులసీపీఠ్ వ్యవస్థాపకుడు జగద్గురు రామభద్రాచార్య 2023 సంవత్సరానికి జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రముఖ ఒడియా రచయిత్రి, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత ప్రతిభా రే అధ్యక్షతన 11 మంది సాహితీవేత్తలతో కూడిన ఎంపిక కమిటీ ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకొని శనివారం ప్రకటించింది. గుల్జార్, రామభద్రాచార్య.. తమ తమ రంగాల్లో అసాధారణమైన సాహితీ సేవ చేశారని ఎంపిక కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 'సినీరంగంలో సుదీర్ఘ ప్రయాణంతోపాటు, కవిత్వంలో మూడు లైన్లతో కూడిన త్రివేణి అనే కొత్త రూపాన్ని గుల్జార్ సృష్టించారు' అని పేర్కొంది.

శ్రోతలకు వీనులవిందు ఆయన పాటలు

గుల్జార్ అసలు పేరు సంపూరణ్ సింగ్ కల్రా. ఆయన వయసు 89 ఏళ్లు. సమకాలీన చరిత్రలో అత్యుత్తమ ఉర్దూ కవుల్లో ఆయన ఒకరు. హిందీ సినిమాల్లో ఆయన రాసిన పాటలు అనేకం విశేష ఆదరణ పొందాయి. పంజాబీతోపాటు పలు ఇతర భాషల్లోనూ ఆయన రచనలు చేశారు. 2002లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 2004లో పద్మభూషణ్, 2013లో దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాలు ఆయనకు లభించాయి. కనీసం ఐదు జాతీయ ఫిల్మ్ అవార్డులు గుల్జార్ రచనలకు దక్కాయి. 2009లో ఆస్కార్ పురస్కారం పొందిన స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలో జై హో అనే పాట గుల్జార్ కలం నుంచి జాలు వారిందే. కాగా, 1944లో జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ప్రకటించినది 58వ పురస్కారం. అవార్డు కింద గ్రహీతకు రూ.21 లక్షల నగదు, వాగ్దేవి విగ్రహం, సన్మానపత్రం అందజేస్తారు. సంస్కృత భాషకు జ్ఞానపీఠ్ లభించటం రెండోసారి కాగా, ఉర్దూకు ఇది ఐదోసారి.

గంటలో 100 సంస్కృత పద్యాలు

రామానంద సంప్రదాయానికి చెందిన నలుగురు జగద్గురు రామానందచార్యులలో రామభద్రాచార్య ఒకరు. 1982 నుంచి ఆయన జగద్గురుగా ఉన్నారు. ఆయన అసలు పేరు గిరిధర్ మిశ్రా. వయసు 74 ఏళ్లు. రెండు నెలల పసితనంలోనే అనారోగ్యంతో కంటి చూపు కోల్పోయినప్పటికీ సంస్కృతంలో అపారమైన పాండిత్యం సంపాదించారు. ఆయన 22 భాషల్లో మాట్లాడగలరు. సంస్కృతంతోపాటు హిందీ, అవధ్, మైథిలీ తదితర భాషల్లో అనేక కవితలు, రచనలు చేశారు. రామభద్రాచార్య గంటకు 100కు పైగా సంస్కృత పద్యాలను రచించగలరని, ప్రస్తుత కాలంలో సంస్కృత పాండిత్యానికి సంబంధించి ఆయనకు దరిదాపుల్లో ఎవరూ లేరని జ్ఞానపీఠ్ కోసం ఆయన పేరు ప్రతిపాదించిన న్యాయనిర్ణేతలు భావించారు.

జ్యూరీలో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి, కవి కృష్ణారావు

జ్ఞానపీఠ్ జ్యూరీలో ప్రతిభా రేతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, కొంకణి రచయిత దామోదర్ మౌజో, బెంగాలీ రచయిత సురంజన్ దాస్, కన్నడ రచయిత పురుషోత్తమ్ బిలిమలే, మరాఠీ కవి ప్రఫుల్ షిలేదార్, మలయాళీ రచయిత ప్రభావర్మ, హిందీ రచయితలు హరీశ్ త్రివేది, మధుసూధన్ ఆనంద్, జానకీ ప్రసాద్ శర్మతో పాటు తెలుగు కవి, ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో చీఫ్ ఎ.కృష్ణారావు ఉన్నారు.

3వేల కోట్ల ఫైన్

» ట్రంప్‌నకు విధించిన న్యూయార్క్ కోర్టు



న్యూయార్క్, ఫిబ్రవరి 17: రానున్న ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తన రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని మూసివేయాల్సి వస్తుందా అన్న పరిస్థితి ఎదురయింది. ఆస్తుల విషయంలో బ్యాంకులు, బీమా కంపెనీలు, ఇతరులతో అబద్ధం చెప్పినందుకు తప్పు పట్టి 355 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,000 కోట్లు) జరిమానా విధించింది. వడ్డీతో కలుపుకొంటే 450 మిలియన్ డాలర్లు (సుమారు 4,000 కోట్లు) చెల్లించాల్సి ఉంటుంది. చెల్లింపు ఆలస్యమయ్యే కొలది వడ్డీ భారం కూడా పెరగనుంది. ఆస్తుల విలువను ఎక్కువగా చూపించి ఏళ్ల తరబడి బ్యాంకుల నుంచి రుణాలు పొందారని ఆరోపిస్తూ న్యూయార్క్ కోర్టులో అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ కేసు పెట్టారు. దీనిపై జడ్జి ఆర్థర్ ఎన్‌గోరన్ విచారణ జరిపారు. ఆర్థిక సంస్థలను మోసగించే ప్రయత్నాలు చేశారంటూ ట్రంప్‌తో పాటు, ఆయన ఇద్దరు కుమారులు, కంపెనీ ఎగ్జిక్యూటివ్స్‌ను తప్పుపట్టింది. ట్రంప్ ఆర్గనైజేషన్‌లో సంపూర్ణంగా మార్పులు చేయాలని ఆదేశించింది. ఆ సంస్థ కార్యకలాపాలపై ఆంక్షలు విధించింది.

అయోధ్యలో సౌకర్యాల కల్పనకు టీటీడీ సహకారం



అయోధ్యలో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రతినిధులతో ధర్మారెడ్డి

తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరంలో భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ, సౌకర్యాల కల్పన తదితరాలపై శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు టీటీడీ సహకారం కోరింది. ఈ క్రమంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి, అధికారుల బృందం శనివారం అయోధ్యకు చేరుకుంది. ట్రస్టు ప్రతినిధులతో వారు సమావేశమయ్యారు. బాలరాముడి ఆలయానికి వచ్చే భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. మరోరెండు రోజుల పాటు టీటీడీ అధికారుల బృందం అయోధ్యలోనే ఉండనుంది.

నీటి ఎద్దడి నివారించకపోతే ఆత్మహత్యలే శరణ్యం

» కాకినాడ జిల్లాలో రహదారిపై రైతుల నిరసన



పురుగుమందు డబ్బాలతో వీకే రాయపురం రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

సామర్లకోట, ఫిబ్రవరి 17: పొలాలకు సకాలంలో సాగునీరు ఇవ్వకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ పురుగుమందు డబ్బాలతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వీకే రాయపురం, సత్యవరపుపేట, మామిళ్లదొడ్డి, బోయినపూడితోపాటు పక్క మండలంలోని అచ్యుతాపురం, రామేశ్వరం గ్రామాల్లో 5వేల ఎకరాలకు సాగునీటి ఎద్దడి కారణంగా వరి పంట ఎండిపోతోందని, ఈ దశలో సాగునీటి తడులు అందకపోతే పంటలు ఎండి తీవ్రంగా పెట్టుబడులు నష్టపోతామని రైతులు వాపోయారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం, వ్యవసాయాధికారుల బాధ్యతారాహిత్యం వల్ల వేల రూపాయల పెట్టుబడులు పెట్టి నష్టపోవాల్సి వస్తుందని, సకాలంలో సాగునీరు అందకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ సామర్లకోట మండలం వీకే రాయపురం లాకుల వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించిన రైతులు పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేపట్టారు. ఈ గ్రామాల్లోని ఐదువేల ఎకరాల్లోని పంట పొలాలకు సామర్లకోట కాలువ ద్వారా వంతులవారీ నీటి వినియోగం 15 రోజులకు ఒకసారి అనుమతిస్తున్నారు. నీటి విడుదల తక్కువగా ఉండడంతో శివారు ప్రాంత పొలాలకు సాగునీరు అందడంలేదని రైతులు వాపోతున్నారు. వంతులవారీ నీటి వినియోగం వారానికి ఒకసారి ఇచ్చేలా మార్పులు చేయకపోతే నీటి తడులు, ఎరువుల వినియోగానికి ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు. దాళ్వా సాగుకు సమృద్ధిగా సాగునీరందిస్తామని ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు పంట కాలానికి ముందే ప్రకటించినందున వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి నేడు సందిగ్ధ దశలో ఉన్నామన్నారు. సామర్లకోట ఎస్ఐ అక్కడకి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఇరిగేషన్, వ్యవసాయాధికారులకు రైతులు వినతిపత్రాలను అందించారు. గోదావరి ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వలు పూర్తిగా తగ్గడం, గోదావరి పరీవాహక ప్రాంతం వెంబడి ఎత్తిపోతల పథకాలు, సామర్లకోట ఎగువ పొలాలు, ఇక్కడి నుంచి పీబీసీ కెనాల్‌కు నీటి సరఫరా వంటి కారణాలతో వీకే రాయపురం లాకుల వద్దకు వచ్చేసరికి నీరు తగ్గుతోందని, అందువల్లే సాగునీటి సమస్య నెలకొందని ఇరిగేషన్ ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.

స్టీల్‌ప్లాంటులో అగ్నిప్రమాదం

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 17: విశాఖ ఉక్కు కర్మాగారం సీవోసీసీపీ (కోక్, కోల్ కెమికల్ ప్లాంటు)లోని ఎన్ఏఎఫ్‌సీ (నాఫ్తలీన్ అంత్రాసీన్ ఫ్రాక్షనల్ క్రిస్టలైజేషన్) విభాగంలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. వెల్డింగ్ పనుల కారణంగానే ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. కాగా.. ఎటువంటి నష్టం వాటిల్లలేదని యాజమాన్యం ప్రకటించింది.



ఆంధ్రా ఆసుపత్రి వైద్యులకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి

28 మంది పిల్లలకు ఉచిత గుండె సర్జరీలు

» ఆంధ్రా హాస్పిటల్స్‌లో విజయవంతంగా నిర్వహణ

విజయవాడ ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 17: ఆంధ్రా ఆసుపత్రి, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుకే చారిటీ సౌజన్యంతో 28 మంది పిల్లలకు ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఉచిత గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించారు. డాక్టర్ ప్రేమ్, డాక్టర్ సర్ఫరాజ్ రహిమాన్, డాక్టర్ ఆనంద్‌వాఘ్, డాక్టర్ దిలీప్ అత్యంత క్లిష్టమైన గుండె ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. ప్రతి మూడు నెలలకోసారి నిపుణులైన వైద్యులతో పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. నవ్యాంధ్రలో తొలిసారిగా పిల్లల గుండె ఆపరేషన్లు విజయవంతంగా చేయడానికి ఆంధ్రా ఆసుపత్రిలో డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో పిడియాట్రిక్ కార్డియాలజీ టీం, నవజాత శిశువుల, పిడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందం వల్లే సాధ్యపడిందని చీఫ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ డాక్టర్ పి.వి.రామారావు తెలియజేశారు. అమెరికాలో సీనియర్ కార్డియాలజిస్టుగా ఉన్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ఆపరేషన్లకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన్ను డాక్టర్ శ్రీమన్నారాయణ అభినందించారు.

నేడు విశాఖకు పవన్‌కల్యాణ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం విశాఖపట్నం రానున్నారు. ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం ఇక్కడకు చేరుకోనున్న ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమావేశం అవుతారని తెలిసింది.

రేపు టీటీడీ ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించిన మే నెల కోటాను టీటీడీ సోమవారం ఉ.10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం భక్తులు 21వ తేదీ ఉ. 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. 22న వర్చువల్ సేవల కోటా విడుదల చేస్తారు. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకారసేవ టికెట్ల కోటాను ఉదయం 10గంటలకు విడుదల చేయనున్నారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన మే నెల కోటాను 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే శ్రీవాణి ట్రస్టు టికెట్ల కోటాను 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగుల కోటాను విడుదల చేస్తారు. 24వ తేదీన ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను భక్తులకు కేటాయిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల కోటాను అందుబాటులో ఉంచనున్నారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

తెలుగు రాష్ట్రాలతో బీజేపీ 'పొత్తులాట'

"శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడును భరించలేకుండా ఉన్నాం. ఒక మెట్టుదిగైనా భారతీయ జనతా పార్టీతో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్ పార్టీని దెబ్బకొట్టకపోతే రేవంత్ రెడ్డికి అడ్డుకట్ట వేయలేం"... ఇది భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద పెట్టుకుంటున్న మొర!

"సార్వత్రిక ఎన్నికల్లో మీరు తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నారా? ఇంత నమ్మకమైన మిత్రుడిని నేను ఉండగా తెలుగుదేశం పార్టీ అవసరమేముంది? తెలుగుదేశం పార్టీతో పొత్తు ఆలోచన చేయవద్దు ప్లీజ్!"... ఇది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి చేసిన విజ్ఞప్తి!

తెలంగాణలో ప్రతిపక్షం, ఆంధ్రప్రదేశ్‌లో అధికారపక్షం బీజేపీ కరుణా కటాక్షాల కోసం ఈ విధంగా వెంపర్లాడడం ఒకింత వింతగా ఉంది. రెండు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో

> నిజానికి బీజేపీ కలవడం వల్ల ఓట్లపరంగా తెలుగుదేశం పార్టీకి పెద్దగా ఒనగూరే ప్రయోజనం ఉండదు. అయినా పొత్తు ప్రతిపాదనలపై జగన్ అండ్ కో ఉలికిపాటుకు గురవుతోందంటే అందుకు కారణం లేకపోలేదు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సమయంలో చేసినటువంటి అరాచకాలకు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూడా తెరలేపి మళ్లీ అధికారంలోకి రావొచ్చునని జగన్మోహన్ రెడ్డి లెక్కలు వేసుకుంటున్నారు. తన ఆటలు సాగాలంటే ఎన్నికల కమిషన్ సహకారం అవసరం. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కుదిరితే ఎన్నికల కమిషన్ నుంచి జగన్‌కు సహకారం లభించదు. అప్పుడు వచ్చే ఎన్నికల్లో తన ఆటలు సాగవని ముఖ్యమంత్రి జగన్ భయపడుతున్నారు. ఈ కారణంగానే ఢిల్లీకి పరుగులు తీసి ప్రధాని మోదీని కలిసి పొత్తు పెట్టుకోవద్దని వేడుకున్నారు.

బీజేపీ తెలంగాణలో ఎనిమిది సీట్లలో మాత్రమే నెగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ బలం నామమాత్రమే. అయినా తెలంగాణలో 39 సీట్లు గెలుచుకొని ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో 151 సీట్లు గెలుచుకున్న వైసీపీ కూడా బీజేపీ అండకోసం అల్లాడిపోవడం వర్తమాన రాజకీయాలను ఆశ్చర్యపరిచే పరిణామం.

వామ్మో... రేవంత్!

శనివారంతో ముగిసిన శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదునైన మాటలు, వ్యాఖ్యలతో నిన్నటి వరకూ అధికారం చెలాయించిన బీఆర్‌ఎస్‌పై దుమ్మెత్తి పోశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ వ్యంగ్యాస్త్రాలతో విరుచుకుపడుతున్నారు. ముఖ్యమంత్రి దాడిని ఎదుర్కోవడానికి హరీశ్ రావు, కేటీఆర్ తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. అయినా అధికార పార్టీ కావడంతో కాంగ్రెస్‌దే పైచేయిగా కనిపిస్తున్నది. ఈ పరిస్థితిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు భరించలేకపోతున్నారు. గత పదేళ్లుగా అధికారం చెలాయించడానికి అలవాటుపడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో ఇమడలేకపోతున్నారు. అదే సమయంలో, రెండు మాసాల తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికల్లో గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు గెలుచుకోలేని పక్షంలో తమ భవిష్యత్తు ఏమిటి? అన్న బెంగ కూడా వారిని పట్టి పీడిస్తున్నది. దీంతో బీజేపీతో చేతులు కలిపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కట్టడి చేయాలని వారు కేసీఆర్ వద్ద మొర పెట్టుకుంటున్నారు. దీంతో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్న ఆలోచనను ప్రారంభంలో తిరస్కరించిన కేసీఆర్ ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. అయితే... బీఆర్‌ఎస్‌తో చేతులు కలపడానికి బీజేపీ సిద్ధపడుతుందా, లేదా అన్నది ఇప్పుడు ప్రశ్నగా ఉంది. తాజా సమాచారం ప్రకారం పొత్తుకోసం బీఆర్‌ఎస్ నుంచి వస్తున్న ప్రతిపాదనను కేంద్రమంత్రి అమిత్ షా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వద్ద తోసిపుచ్చినట్టు తెలిసింది. అయితే, 'పొత్తులు ఉండబోవని ఇప్పుడే స్పష్టం చేయవద్దు–ఆలోచిస్తున్నాం' అని మాత్రమే చెబుదామని అమిత్ షా సూచించినట్టు తెలిసింది.

ఎన్నికల తర్వాత ఏమవుతుంది?

లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకొనే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాలని, కుదిరితే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోసి, తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని బీజేపీకి చెందిన కొందరు ఆలోచన చేస్తున్నారు. ఆ పార్టీ కేంద్ర నాయకత్వం కూడా తెలంగాణపై దృష్టి పెట్టింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో బీజేపీకి లభించే సీట్లు, ఎన్డీయే బలం ఏ మేరకు పెరగనున్నదన్న దానిపై స్పష్టత వచ్చాక బీజేపీ పెద్దలు తెలంగాణలో తమ వ్యూహాన్ని అమలుచేసే అవకాశం ఉంది. తమకు ఉత్తరాదిన తిరుగులేని పరిస్థితి ఉన్నప్పటికీ దక్షిణాదిన పరిస్థితులు అనుకూలంగా లేకపోవడాన్ని బీజేపీ అగ్ర నాయకత్వం జీర్ణించుకోలేకపోతున్నది. దీనికితోడు కర్ణాటకలో అధికారం కోల్పోవలసి రావడం, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా అధికారంలోకి రావడంతో దక్షిణాదిపై ఫోకస్ పెంచారు. కేరళ, తమిళనాడులో ఇప్పటికిప్పుడు చేయగలిగింది ఏమీ లేకపోయినప్పటికీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బలం పెంచుకోవడానికి పావులు కదుపుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ భారతీయ జనతా పార్టీ అనూహ్యంగా నాలుగు ఎంపీ స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ సహజంగానే కొంత బలహీన పడుతుంది. అదే సమయంలో, ఈ ఎన్నికల్లో మోదీ ప్రభావం కూడా ఉంటుంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్–బీజేపీ మధ్యనే ఉంటుందన్న అభిప్రాయం ఉంది. అదే జరిగితే లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ మనుగడ కష్టతరంగా ఉంటుంది. దీంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు కలవరం చెందుతున్నారు. అదే సమయంలో... తెలంగాణలో బీఆర్‌ఎస్ అస్తిత్వం పోవాలని బీజేపీ కోరుకుంటోంది. అప్పుడు రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్–బీజేపీ మధ్య కేంద్రీకృతం అవుతాయి. కేసీఆర్‌కు కూడా ఈ విషయం తెలుసు. తన పార్టీ పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని ఆయన గ్రహించారు. అందుకే బీజేపీతో పొత్తు గురించి మాట్లాడే వారిని గట్టిగా నిరోధించలేకపోతున్నారు. కాకపోతే పొత్తులకు సంబంధించిన చాయిస్ తన చేతుల్లో లేదని ఆయనకు తెలుసు. ఆ కారణంగానే గుంభనంగా ఉంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పనితీరుకు మంచి మార్కులే లభిస్తున్నప్పటికీ ఆయన ప్రభుత్వ స్థిరత్వంపై ఎవరి సందేహాలు వారికి ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత పరిస్థితి ఎలా ఉండబోతుందన్న దానిపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్–బీజేపీ–మజ్లిస్‌కు కలిపి 54 మంది శాసనసభ్యులు ఉన్నారు. ఆరుగురు కాంగ్రెస్ సభ్యులు పక్కచూపులు చూసినా ప్రభుత్వం పడిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి గ్రీన్ సిగ్నల్ లేనందున ఫిరాయింపులను ప్రోత్సహించడం లేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఇంకోవైపు... కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా తమతో టచ్‌లో ఉన్నారని, అదను చూసి దెబ్బకొడతామని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల వరకు ఇటువంటి ఊహాగానాలే సాగుతాయి. ఆ తర్వాత ఆయా పార్టీల గెలుపు ఓటములను బట్టి తెలంగాణ రాజకీయాల్లో ఎటువంటి మార్పులు జరుగుతాయో స్పష్టమవుతుంది. ఇక్కడ ఇంకా కొన్ని విషయాలు చెప్పుకోవాలి. బీఆర్‌ఎస్‌తో పొత్తు వద్దని ప్రస్తుతం భావిస్తున్న బీజేపీ కేంద్ర నాయకత్వం చివరి క్షణంలో మనసు మార్చుకుంటే మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కష్టాలు మొదలవుతాయి. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుచుకున్న మున్సిపాలిటీలలో ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా వాటిని హస్తగతం చేసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం దృష్టి సారించింది. అదే సమయంలో, శాసనసభ ఎన్నికల్లో తాము ప్రభావం చూపలేకపోయిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలపై కూడా దృష్టి కేంద్రీకరించింది. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులను ఆకర్షించడం ద్వారా పార్టీని పటిష్ఠం చేసుకోవడంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జోరందుకున్నాయి. అయితే జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలను హస్తగతం చేసుకోవడం వల్ల పార్టీ బలం నిజంగా పెరుగుతుందా? అంటే అనుమానమే. ఎందుకంటే శాసనసభ ఎన్నికలు జరిగే నాటికి రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు బీఆర్‌ఎస్ చేతిలోనే ఉన్నాయి. అయినా ఆ పార్టీ ఓడిపోయింది. స్థానిక సంస్థలు ఎవరి చేతిలో ఉన్నా సార్వత్రిక ఎన్నికల్లో వాటి ప్రభావం ఉండదని అనేక సందర్భాలలో రుజువైంది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో కూడా పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండే అవకాశం లేదు. ఉదాహరణకు తాండూరుకు చెందిన మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి శాసనసభ ఎన్నికల సమయంలో మంత్రిగా ఉన్నారు. అయినా తాండూరులోనే కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గాలలో కూడా బీఆర్‌ఎస్ ఓడిపోయింది. ఇప్పుడు ఆయనతో పాటు ఆయన భార్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడానికి వీరి చేరిక ఉపయోగపడుతుందో లేదో చూడాలి.



ఇరువురికీ అగ్నిపరీక్షే...

లోక్‌సభ ఎన్నికలు భారత రాష్ట్ర సమితికి మాత్రమే కాదు– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా పరీక్షగా నిలవబోతున్నాయి. సేఫ్ జోన్‌లో ఉన్నది భారతీయ జనతా పార్టీ మాత్రమే. గతంలో నాలుగు స్థానాలు గెలుచుకున్న ఆ పార్టీ ఇప్పుడు ఎనిమిది స్థానాలను గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉంది. నాలుగుకంటే ఎన్ని ఎక్కువ వచ్చినా ఆ పార్టీకి బోనస్‌గానే పరిగణించాలి. బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా కనిపిస్తున్నప్పటికీ ఎన్నికల అనంతరం కేంద్రంలో మళ్లీ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడితే ఎదురయ్యే సవాళ్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా కంటి మీద కునుకు లేకుండా చేస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో కొనసాగడం బీఆర్‌ఎస్‌కు మాత్రమే కాదు – బీజేపీకి కూడా ఇష్టం ఉండదు. ఈ కారణంగా గుర్రం ఎగరావచ్చు అన్నట్టు బీఆర్‌ఎస్–బీజేపీలు ఎన్నికల నాటికి చేతులు కలిపినా ఆశ్చర్యపోవాల్సింది లేదు. పొత్తు ప్రతిపాదనలను బీజేపీ కేంద్ర నాయకత్వం తిరస్కరిస్తున్నప్పటికీ బీఆర్‌ఎస్ మాత్రం తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. బీఆర్‌ఎస్–బీజేపీ మధ్య లోపాయికారీ అవగాహన ఉందని శాసనసభ ఎన్నికలకు ముందే ప్రజలు బలంగా నమ్మారు. బీఆర్‌ఎస్ ఓటమికి అది కూడా ఒక కారణం. ఈ కారణంగా బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల కొత్తగా వచ్చే నష్టం ఉండబోదని బీఆర్‌ఎస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. వారు ఆలోచిస్తున్నట్టు బీజేపీతో నిజంగా పొత్తు కుదిరితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇబ్బందే. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభావం కనీసం ఐదు శాతం ఉంటుంది. దీనికి బీఆర్‌ఎస్ బలం కూడా తోడైతే కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలపై ప్రభావం చూపకుండా ఉండదు. రాజకీయాలలో 2+2 నాలుగు కాకపోవచ్చునుగానీ ఆ రెండు పార్టీలూ కలిస్తే మాత్రం వారి బలాన్ని తేలికగా తీసిపారేయలేము. ఓటమి తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేసీఆర్ నిర్వహించిన తొలి బహిరంగ సభ సక్సెస్ అయిందనే చెప్పాలి. కేసీఆర్‌ను తెలంగాణ బాపుగా చిత్రీకరించడం ద్వారా తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ కదిలించి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నాలను బీఆర్‌ఎస్ చేస్తోంది. రాజకీయ పార్టీలకుగానీ, వాటి అధినేతలకు గానీ ఎన్నికల్లో ఓడిపోవడాన్ని మించిన శిక్ష ఉండదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత గత ప్రభుత్వాల వైఫల్యాల గురించి ఎంతగా చెప్పినా ప్రజల చెవికెక్కదు. అధికారంలో ఉన్న వారి పనితీరునే ప్రజలు గమనిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనేక విధాలుగా వేధించారు. అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని ఇప్పుడు రేవంత్ రెడ్డి భావిస్తే ఉపయోగం ఉండదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి ఎగబాకడానికి కేసీఆర్ అదేపనిగా వేధించడం కూడా ఒక కారణం. గత పాలకుల పాపాలను ప్రజలు ఇట్టే మరచిపోతారు. ఎమర్జెన్సీ అకృత్యాలను రెండేళ్లలోనే మరచిపోయిన ప్రజలు ఇందిరాగాంధీకే మళ్లీ పట్టం కట్టారు. 1989లో ఎన్టీఆర్‌ను ఓడించిన తెలుగు ప్రజలు 1994లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చారు. తుంటి ఎముక విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను పరామర్శించినప్పుడు రేవంత్ రెడ్డిని పలువురు అభినందించారు. కక్షలు, కార్పణ్యాలు అధికారంలో ఉన్న వారికి మేలు చేయవని ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు రుజువు చేస్తున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభకు రాకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఈ సమయంలో రేవంత్ రెడ్డి అండ్ కో దెప్పిపొడిచినంత మాత్రాన అదనంగా ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదు. అధికారం తలకెక్కడం వల్లే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి. ఈ నేపథ్యంలో కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్‌గా చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుందా? ఉండదా? అని ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచించుకోవాలి. పడ్డవాడు చెడ్డవాడు కాదు. అందుకే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ప్రస్తుతానికి లోక్‌సభ ఎన్నికల గండం దాటడంపైనే రేవంత్ రెడ్డి దృష్టి కేంద్రీకరించడం మంచిది. బీఆర్‌ఎస్–బీజేపీ ఏ కారణంవల్లనైనా చేతులు కలిపితే ఎదురయ్యే పరిస్థితులను అధిగమించడంపై ఆయన దృష్టి పెట్టాలి.

> 1989లో ఎన్టీఆర్‌ను ఓడించిన తెలుగు ప్రజలు 1994లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చారు. తుంటి ఎముక విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను పరామర్శించినప్పుడు రేవంత్ రెడ్డిని పలువురు అభినందించారు. కక్షలు, కార్పణ్యాలు అధికారంలో ఉన్న వారికి మేలు చేయవని ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

> బీఆర్‌ఎస్–బీజేపీ మధ్య లోపాయికారీ అవగాహన ఉందని శాసనసభ ఎన్నికలకు ముందే ప్రజలు బలంగా నమ్మారు. బీఆర్‌ఎస్ ఓటమికి అది కూడా ఒక కారణం. ఈ కారణంగా బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల కొత్తగా వచ్చే నష్టం ఉండబోదని బీఆర్‌ఎస్ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. వారు ఆలోచిస్తున్నట్టు బీజేపీతో నిజంగా పొత్తు కుదిరితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇబ్బందే. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభావం కనీసం ఐదు శాతం ఉంటుంది. దీనికి బీఆర్‌ఎస్ బలం కూడా తోడైతే కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలపై ప్రభావం చూపకుండా ఉండదు. రాజకీయాలలో 2+2 నాలుగు కాకపోవచ్చునుగానీ ఆ రెండు పార్టీలూ కలిస్తే మాత్రం వారి బలాన్ని తేలికగా తీసిపారేయలేము. ఓటమి తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేసీఆర్ నిర్వహించిన తొలి బహిరంగ సభ సక్సెస్ అయిందనే చెప్పాలి.

జగన్ మొర ఆలకించారా...

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధాని మోదీకి పెట్టుకుంటున్న మొర విషయానికి వద్దాం! ప్రధానమంత్రి అనుమతితో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలుగుదేశం అధినేత చంద్రబాబును ఢిల్లీకి ఆహ్వానించి పొత్తు విషయం కదిపారు. దీంతో కలవరపాటుకు గురైన జగన్ ఆ వెంటనే ఢిల్లీకి పరిగెత్తి ప్రధాని మోదీని కలిశారు. నమ్మకమైన మిత్రుడిని నేనుండగా ఆ తెలుగుదేశం అవసరం ఎందుకు? ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవద్దు ప్లీజ్ అని ప్రధానిని వేడుకున్నారు. ఈ విజ్ఞప్తికి ప్రధాని స్పందన ఏమిటో తెలియనప్పటికీ జగన్‌రెడ్డి మాత్రం ప్రధానితో సమావేశం తర్వాత తెలుగుదేశంతో పొత్తు ఉండదు, భయపడవద్దు అని తనకు అత్యంత సన్నిహితులైన వారి వద్ద చెప్పుకొన్నారు. దీంతో సదరు సన్నిహితులు ఊపిరి పీల్చుకున్నారు. 'తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోబోం అని ప్రధాని మా వాడికి హామీ ఇచ్చారట' అని కనిపించిన వారందరికీ వారు చెబుతున్నారు. ప్రధాని ఏమి చెప్పారో, జగన్‌కు ఏమి అర్థమైందో తెలియదుగానీ ఆ తర్వాత కూడా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒక సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీయేలోకి పాత మిత్రులు వస్తున్నారని, అందులో తెలుగుదేశం పార్టీ కూడా ఉంటుందని చెప్పారు. అయినా తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు ఉండబోదని జగన్ శిబిరం భరోసాగా ఉంది. నిజానికి బీజేపీ కలవడం వల్ల ఓట్లపరంగా తెలుగుదేశం పార్టీకి పెద్దగా ఒనగూరే ప్రయోజనం ఉండదు. అయినా పొత్తు ప్రతిపాదనలపై జగన్ అండ్ కో ఉలికిపాటుకు గురవుతోందంటే అందుకు కారణం లేకపోలేదు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సమయంలో చేసినటువంటి అరాచకాలకు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూడా తెరలేపి మళ్లీ అధికారంలోకి రావొచ్చునని జగన్మోహన్ రెడ్డి లెక్కలు వేసుకుంటున్నారు. తన ఆటలు సాగాలంటే ఎన్నికల కమిషన్ సహకారం అవసరం. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కుదిరితే ఎన్నికల కమిషన్ నుంచి జగన్‌కు సహకారం లభించదు. అప్పుడు వచ్చే ఎన్నికల్లో తన ఆటలు సాగవని ముఖ్యమంత్రి జగన్ భయపడుతున్నారు. ఈ కారణంగానే ఢిల్లీకి పరుగులు తీసి ప్రధాని మోదీని కలిసి పొత్తు పెట్టుకోవద్దని వేడుకున్నారు. రాజ్యసభలో బీజేపీకి ఇప్పటికీ మెజారిటీ లేదు. అందుకే కీలక సందర్భాలలో వైసీపీ సహకారం తీసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ అధికారం కోల్పోయినా రాజ్యసభలో వైసీపీ సహకారం బీజేపీకి అవసరం. ఈ కారణంగా తెలుగుదేశంతో పొత్తు ఉంటుందని ముఖం మీదే చెప్పకుండా దేఖేంగే అని ప్రధాని మోదీ చెప్పి ఉండవచ్చు. అమిత్ షా వ్యాఖ్యల తర్వాత ముఖ్యమంత్రి జగన్‌లో భయం మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఆ రెండు పార్టీల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే బాధ్యతను బీజేపీలోని తన రహస్య మిత్రులకు అప్పగించినట్టు ఉన్నారు. ఫలితంగానే బీజేపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారంనాడు మాట్లాడుతూ... పొత్తు కోసం తెలుగుదేశం పార్టీనే వెంటపడుతోందని, బీజేపీ నాయకుడే ముఖ్యమంత్రి అయ్యే పక్షంలోనే పొత్తు ఉంటుందని వాచాలత్వం ప్రదర్శించారు. ఆ వ్యాఖ్యలను పార్టీ అధికార ప్రతినిధి ఖండించడం కూడా జరిగింది.

వికటిస్తున్న జగన్ ప్రయోగాలు...

రాష్ట్రంలో పెద్దగా బలంలేని బీజేపీ గురించి జగన్మోహన్ రెడ్డి భయపడటానికి కారణం అందరికీ తెలిసిందే. రాష్ట్రంలో వైసీపీ పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. క్షేత్రస్థాయిలో ప్రజల నాడి పసిగట్టిన పార్టీకి చెందిన పలువురు ముఖ్యులు తెలుగుదేశం వైపు చూస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నుంచి టికెట్ హామీ పొందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా తెలుగుదేశం పార్టీ అవకాశం ఇస్తానంటే జంప్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నెల్లూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేయడానికి జగన్ వద్ద అంగీకరించిన వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఆ తర్వాత మనసు మార్చుకొని తెలుగుదేశం నుంచి పోటీ చేయబోతున్నారు. ఆయన సతీసమేతంగా వెళ్లి చంద్రబాబును కలుసుకున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు లోక్‌సభ అభ్యర్థుల కోసం వైసీపీ తంటాలు పడుతోంది. ముప్పై ఏళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి, పార్టీ తరఫున పోటీ చేసే వారికోసం ఐదేళ్లకే కాగడా పెట్టి వెతుక్కొనే పరిస్థితి రావడం, పార్టీ టికెట్ పొందిన వారు సైతం పారిపోయే పరిస్థితి రావడం స్వయంకృతాపరాధమే. సిట్టింగ్ ఎమ్మెల్యేలలో కొందరికి టికెట్ నిరాకరించడం, మరి కొందరిని వేరే నియోజకవర్గాలకు బదిలీ చేయడం వంటి చర్యలన్నీ వికటిస్తున్నాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ ప్రజాభిప్రాయం స్పష్టమవుతున్నందున వైసీపీ తరఫున పోటీ చేయడానికి పలువురు భయపడుతున్నారు. తాడేపల్లి ప్యాలెస్ బుజ్జగింపులు పనిచేయడం లేదు. అయినా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిలో ఇంకా ఎక్కడో ధీమా ఉంటోంది. ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలు చేయవచ్చునన్న ధీమాతోనే ఆయన భరోసాగా ఉండివుండవచ్చు. 'మా ఓటర్లు వేరు' అని సజ్జల వంటి వారు చేసిన ప్రకటనలు ఈ కోణంలోనే చూడాలి. ఇప్పటికే పలు నియోజకవర్గాలలో కనీసం ఐదారు వేల వరకు దొంగ ఓట్లు ఉన్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో మూడు నాలుగు దశల్లో ఎన్నికలు జరిపించగలిగితే దొంగ ఓటర్లను వాడుకోవచ్చునని జగన్ శిబిరం భావిస్తోంది. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కుదిరితే వారు ఆశిస్తున్నట్టు జరగదు. ఈ కారణంగానే పొత్తు అన్న మాట వినపడగానే వైసీపీ నాయకులు ఉలిక్కిపడుతున్నారు. ఏది ఏమైనా పొత్తుల వ్యవహారం మరికొద్ది రోజుల్లో తేలిపోతుంది. ఆ తర్వాత జగన్ శిబిరంలో వణుకు మొదలవుతుంది. ప్రస్తుతం జగన్ కోసం అన్ని నిబంధనలను అతిక్రమించి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న ఐపీఎస్ అధికారులు కూడా పొత్తు కుదిరితే భయపడతారు. ఈ పరిస్థితి ఏర్పడుతుందని జగన్‌రెడ్డికి తెలుసు. ఎంతటి పాలెగాడైనా పోలీసుల సహకారం లేకపోతే పిల్లికంటే అధ్వానంగా వ్యవహరిస్తారు. జగన్ ఇందుకు అతీతుడుకారు. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు చెడగొట్టడానికి జగన్ చివరి వరకు ప్రయత్నిస్తారు. ఆయన ప్రయత్నం ఫలిస్తుందో లేదో తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాలి. ఏది ఏమైనా ఒకప్పుడు 'ఎంత మంది కలిసినా నా వెంట్రుక కూడా పీకలేరు' అని ఘీంకరించిన జగన్ ఆ తర్వాత 'మిమ్మల్నే నమ్ముకున్నాను' అని వాలంటీర్లను వేడుకునే దాకా దిగజారారు. ఇప్పుడు మరింత దిగజారి కుట్రలు, కుయుక్తులకు పాల్పడైనా ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు. అహం తలకెక్కిన ఏ నాయకుడికైనా పతనం కాచుకొని ఉంటుంది. జగన్మోహన్ రెడ్డి కూడా ఇందుకు మినహాయింపు కాదు!

> రాష్ట్రంలో వైసీపీ పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. క్షేత్రస్థాయిలో ప్రజల నాడి పసిగట్టిన వైసీపీ ముఖ్యులు పలువురు తెలుగుదేశం వైపు చూస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నుంచి టికెట్ హామీ పొందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా తెలుగుదేశం పార్టీ అవకాశం ఇస్తానంటే జంప్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నెల్లూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేయడానికి జగన్ వద్ద అంగీకరించిన వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఆ తర్వాత మనసు మార్చుకొని తెలుగుదేశం నుంచి పోటీ చేయబోతున్నారు. ఆయన సతీసమేతంగా వెళ్లి చంద్రబాబును కలుసుకున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు లోక్‌సభ అభ్యర్థుల కోసం వైసీపీ తంటాలు పడుతోంది. ముప్పై ఏళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి, పార్టీ తరఫున పోటీ చేసే వారికోసం ఐదేళ్లకే కాగడా పెట్టి వెతుక్కొనే పరిస్థితి రావడం, పార్టీ టికెట్ పొందిన వారు సైతం పారిపోయే పరిస్థితి రావడం స్వయంకృతాపరాధమే.

ఫ్రెంచ్ పాత్రికేయురాలి కన్నీటి నిష్క్రమణ

భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండడమే ప్రజాస్వామ్యం. భారత ప్రభుత్వం ఒక ఫ్రెంచ్ పాత్రికేయురాలికి ఈ స్వేచ్ఛను నిరాకరించింది. ఈ దేశం నుంచి వెళ్లిపోవలసిన అగత్యాన్ని కల్పించింది. పలు ఫ్రెంచ్ మీడియా సంస్థల దక్షిణాసియా ప్రతినిధిగా మన దేశం నుంచి పనిచేస్తున్న వనెసా డౌనక్ శుక్రవారం స్వదేశానికి వెళ్లిపోయారు. తన ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం పత్రికాస్వేచ్ఛను అణచివేసేందుకు రాజ్య వ్యవస్థ కృతనిశ్చయంతో ఉన్నదని వనెసా ఉదంతం స్పష్టం చేసింది. ఆమె 25 సంవత్సరాల క్రితం ఒక విద్యార్థినిగా మన దేశానికి వచ్చి, భారతీయుడైన సహపాఠిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కుమారుడిని భారతీయ పౌరుడుగా తీర్చిదిద్దుతున్నారు. జీవనోపాధికి పాత్రికేయ వృత్తిని చేపట్టి స్వదేశానికి తిరిగి వెళ్లిపోయేంతవరకు అదే వృత్తిలో కొనసాగారు. సత్యనిష్ఠతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారు. ఆ నిబద్ధతవల్లే, ఇప్పుడు తాను ప్రేమించే దేశానికి, సొంత కుటుంబానికి దూరమవాల్సివచ్చింది.

తన వృత్తి నిర్వహణలో భాగంగా ఆమె మానవ హక్కులు, దేశీయ రాజకీయాలు, గ్రామీణ భారతంలో మావోయిస్టుల పార్టీ కార్యకలాపాల గురించి వివిధ ఫ్రెంచ్ పత్రికలకు వార్తా కథనాలు రాశారు. కరోనా మహమ్మారి దేశాన్ని కుదిపేస్తున్నప్పుడు ప్రభుత్వం తీరు, గంగానదిలో మృతదేహాలు ఇత్యాది పలు పరిణామాలను లోతుగా విశ్లేషించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు సంబంధించిన వివిధ హింసాత్మక ఘటనలను నివేదించారు. ఈ కథనాలు భారత్‌కు, హిందూ మతానికి వ్యతిరేకంగా ఉన్నాయని అధికార వర్గాలు అభిప్రాయపడ్డాయి.

ఒక భారతీయ పౌరుడి సతీమణిగా ఆమెకు భారత్‌లో శాశ్వత నివాసానికి హక్కునిచ్చే 'ఓవర్సీస్ సిటిజెన్‌షిప్ ఆఫ్ ఇండియా' (ఒసిఐ) కార్డు ఉన్నది. 2022 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వం వనెసాకు జర్నలిజం పర్మిట్ రద్దు చేసింది. ఒసిఐ కార్డు ఉపసంహరణకు నిర్ణయించినట్టు హోం మంత్రిత్వశాఖ జనవరి 24న నోటీస్ ఇచ్చింది. ఆమె పాత్రికేయ కార్యకలాపాలు 'ద్రోహ చింత'తో ప్రభావితమవుతున్నాయని, అవి భారత్ పట్ల వ్యతిరేక అభిప్రాయాన్ని కలిగించే విధంగా ఉంటున్నాయని హోం శాఖ ఆరోపించింది. ఈ ఆరోపణలకు సమాధానమిచ్చేందుకు ఫిబ్రవరి 2 వరకు గడువు ఇస్తున్నట్టు నోటీస్‌లో పేర్కొన్నారు. 1955 భారత పౌరసత్వ చట్టం నిర్దేశించిన విధంగా ప్రత్యేక అనుమతి తీసుకోకుండా పాత్రికేయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు, ఆ నిబంధనలను ఉల్లంఘించినట్టు ఆ నోటీస్ ఆరోపించింది. ఈ ఆరోపణలను వనెసా ఖండించారు. ఇవన్నీ ఎలాంటి రుజువులు లేని ఆరోపణలని శుక్రవారం నాడు స్వదేశానికి వెళ్లిపోతూ జారీ చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వృత్తిని మార్చుకోవాలని హోం శాఖ అధికారులు గతంలో ఇచ్చిన సలహా తనకు ఆమోదయోగ్యం కాదని, నిరూపించని ఆరోపణల కారణంగా తనకు ఇష్టపూర్వకమైన పాత్రికేయ వృత్తిని త్యజించేందుకు సిద్ధంగాలేనని, బలవంతంగా దేశాన్ని విడిచిపోవలసివస్తున్నదని ఆ సుదీర్ఘ వీడ్కోలు ప్రకటనలో ఆమె తెలిపారు. ●



బాధాతప్త హృదయంతో, కన్నీటితో ఈ మాటలు రాస్తున్నాను. ఈ రోజు భారత్ వదిలివెళ్లిపోతున్నాను. పాతికేళ్ల క్రితం ఒక విద్యార్థిగా ఈ దేశానికి వచ్చాను, 23 సంవత్సరాలు ఈ దేశంలోనే పాత్రికేయురాలుగా పని చేశాను. ఈ దేశ పౌరుడినే వివాహం చేసుకున్నాను. నా కుమారుడిని ఇక్కడే పెంచాను. నేను నా ఇల్లుగా భావించిన దేశమిది. అయినా ఈ దేశాన్ని విడిచి వెడుతున్నాను. ఈ నిష్క్రమణ నా నిర్ణయం కాదు.

ఈ దేశాన్ని వదిలిపోయేలా భారతప్రభుత్వం నన్ను బలవంతపెట్టింది. పాత్రికేయురాలుగా పనిచేసేందుకు నాకున్న హక్కును పదహారు నెలల క్రితం హోంమంత్రిత్వ శాఖ నిరాకరించింది. ఎందుకు నిరాకరిస్తున్నదీ కారణాలు తెలుపలేదు. న్యాయసమర్థనలను చూపలేదు. నా విన్నపాలను వినలేదు. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్హేతుక చర్యపై పునరాలోచించాలని, కనీసం వివరణ ఇవ్వాలని నేను పదే పదే చేసిన అభ్యర్థనలకు హోం మంత్రిత్వ శాఖ ఒక్కసారీ ప్రతిస్పందించలేదు. గత నెలలో నాకు ఒక నోటీస్ పంపారు. నా వ్యాసాలు 'ద్వేషపూరితం'గా ఉంటున్నాయని, భారత సార్వభౌమికతకు, సమగ్రతకు హాని చేస్తున్నాయని అందులో ఆరోపించారు. ఒక భారతీయ పౌరుడి సతీమణిగా నాకు గల 'ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా' (ఒసిఐ) కార్డు ఎందుకు రద్దు చేయకూడదో నిర్దిష్ట గడువులోగా తెలపాలని పేర్కొన్నారు. నా వ్యాసాలు ఉపద్రవం కలిగించేవిగాను, శాంతిని భగ్నం చేసేవిగాను ఉన్నాయని కూడా ఆ నోటీస్ ఆరోపించింది.

భారత ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఈ దేశంపై దురభిప్రాయాలు కలిగిస్తున్నానని నాపై అన్యాయంగా ఆరోపణలు చేశారు. భారత్‌లో ఇక నివసించలేనని,

> **భారత్ నా ఇల్లు**
>
> ఈ దేశాన్ని వదిలిపోయేలా భారత ప్రభుత్వం నన్ను బలవంతపెట్టింది. పాత్రికేయురాలుగా పనిచేసేందుకు నాకున్న హక్కును పదహారు నెలల క్రితం హోంమంత్రిత్వ శాఖ నిరాకరించింది.

నా జీవనభృతిని ఆర్జించుకోలేనని స్పష్టమయింది. ఈ ఆరోపణలకు వ్యతిరేకంగా శాసన విహితమైన సంస్థలలో నేను పోరాడుతున్నాను. న్యాయ ప్రక్రియలో నాకు సంపూర్ణ విశ్వాసమున్నది. అయితే ఆ ప్రక్రియ తుది ఫలితం వెలువడే దాకా నేను వేచివుండలేను. నా ఒసిఐ హోదామీద విచారణ కార్యకలాపాలు నన్ను కలవరపరుస్తున్నాయి. ఒసిఐ కార్డు ఉన్న పాత్రికేయుల్లో, ఇతరుల్లో 'అసమ్మతి'ని అణచివేసేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఈ విచారణ సాగుతోందని నేను భావిస్తున్నాను. అధికారులు గతంలో నా వృత్తిని మార్చుకోవాలని నాకు సూచించారు. అయితే నేను ఒక జర్నలిస్టును. ఇది నాకు ఎంతో ప్రియమైన వృత్తి. రుజువులు లేని ఆరోపణల కారణంగా ఈ వృత్తిని త్యజించేందుకు నేను అంగీకరించను. నాకు ఎదురైన సమస్యకు స్పందించి నాకు మద్దతు తెలిపిన పాత్రికేయ ప్రపంచ సహచరులు, స్నేహితులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

భారత్‌లో ఒక జర్నలిస్టుగా నేను గడిపిన అసాధారణ 23 సంవత్సరాలకు అమితంగా కృతజ్ఞురాలిని. సాహసాలు, సమున్నత పరస్పర సంబంధాలతో నిండిన జీవితాన్ని నేను భారత ఉపఖండమంతటా గడిపాను. రెండు దశాబ్దాల భారత చరిత్రకు సాక్షిగా ఉండే అవకాశం నాకు లభించింది. భారత్‌లో ఒక విదేశీ పాత్రికేయురాలుగా ఈ దేశ సంకీర్ణతను, సమున్నత సంస్కృతిని నా ఫ్రెంచ్ పాఠకులతో పంచుకోవడానికి ప్రయత్నించాను. ఇది నాకు సమకూరిన ఒక ప్రత్యేక హక్కు, గౌరవం. భారత ప్రజల ఆదరం, ఔదార్య స్మృతులను, ఈ భూమి నాలో కలిగించిన సౌందర్యానుభూతి స్మృతులను నా మనసులో భద్రంగా నిలుపుకుంటాను. ఢిల్లీ నాకు ప్రియాతి ప్రియమైన నగరం. ఇక్కడే నా జీవితంలో సింహభాగం గడిచింది. ఇప్పుడు దానికి వీడ్కోలు చెప్పవలసిరావడం నాకు అంతులేని విచారాన్ని కలిగిస్తోంది. ఏదో ఒక రోజు నేను మళ్లీ భారత్ తిరిగి రాగలుగుతాననే ఆశ నాకు ఉన్నది.

• వనెసా డౌనక్
దక్షిణాసియా మాజీ కరస్పాండెంట్
La Croix, Le Point, Le Temps, Le Soir



నిర్మానుష్యంగా మారిన ధర్నాచౌక్ వద్ద రహదారి

ధర్నాచౌక్‌లో ఉద్రిక్తత

సీపీఎస్ ఉద్యోగుల 'చలో విజయవాడ'కు పోలీసుల అడ్డు

రణరంగాన్ని తలపించిన ధర్నాచౌక్ ప్రాంతం

ఉదయం నుంచి సీపీఎస్ ఉద్యోగుల గృహ నిర్బంధాలు

తెల్లకాగితాలపై సంతకాలు తీసుకుని బెదిరింపులు

అగ్రనేతలనూ అదుపులోకి తీసుకోవటంతో నిరసన నిలుపుదల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'చలో విజయవాడ-ఓట్ ఫర్ ఓపీఎస్'కు పిలుపునిచ్చిన నేపథ్యంలో శనివారం నగరంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ధర్నాచౌక్ వద్ద యుద్ధ వాతావరణం కనిపించింది. బంద్ వాతావరణాన్ని తలపించేలా ధర్నాచౌక్ ప్రాంతాన్ని పోలీసులు తమ అదుపులోకి తీసు కున్నారు. వాహనాలే కాదు.. పాదచారులను సైతం వెళ్లనివ్వలేదు. ఆందోళనకారులు వస్తే వెంటనే అరెస్టు చేసేందుకు బస్సులను సైతం సిద్ధం చేశారు. కాగా, ఉమ్మడి జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పోలీసుల ద్వారా నోటీసులు ఇప్పించటంతో పాటు ఇళ్లకు వెళ్లి విచారణ చేయడం, పోలీసు స్టేషన్లకు పిలిపించటం వంటి సంఘటనలతో సీపీఎస్ ఉద్యోగులు ఒకింత వెనక్కి తగ్గారు. ఆందోళన కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. నగరంలో ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసును చర్చల కోసమని పిలిచి అదుపులోకి తీసుకున్నారు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేయించారు. ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌తో పాటు సీనియర్ నేతలందరినీ అదుపులోకి తీసుకోవటంతో 'చలో విజయవాడ'ను నిలుపుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



పల్లకీలు ముస్తాబు

జగ్గయ్యపేటలో రంగుల మహోత్సవానికి వెళ్లిన గోపయ్య సమేత తిరుపతమ్మ, పరివార దేవతలను తిరిగి పెనుగంచిప్రోలు తెచ్చేందుకు పల్లకీలు సిద్ధమయ్యాయి. జగ్గయ్యపేట నుంచి అమ్మవారి పరివార దేవతలను ఆదివారం ఉదయం 10 గంటలకు పల్లకీల్లో తీసుకురానున్నారు. ఇందుకోసం పల్లకీలను అందంగా ముస్తాబు చేసి సిద్ధం చేశారు. - పెనుగంచిప్రోలు

రేపటి నుంచి వీరమ్మ తిరునాళ్ల

• 15 రోజుల పాటు నిర్వహణకు ఉయ్యూరులో ఏర్పాట్లు

- 6లో..

ఇంద్రకీలాద్రిపై నేడు మల్లేశ్వరాలయం పునఃప్రారంభం

ఎవరా ఇద్దరు!

తెలుగుతమ్ముళ్లలో చిన్ని వ్యాఖ్యల కలకలం

• నాని కోవర్టులపై టీడీపీలో మరోసారి చర్చ

- 6లో..

కొలువుదీరిన కౌన్సిల్ (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న మేయర్



నిత్యం సభలు, సమావేశాల్లో సాగే అధికార పార్టీ వైసీపీ భజన.. కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలోనూ సాగింది. ఏ డివిజన్‌కు ఎన్ని నిధులు, ఏమేం సమస్యలు, పరిష్కార మార్గాలేంటి, కేటాయింపులెన్ని.. వంటి అంశాలను పక్కనపెట్టి ఆద్యంతం సీఎం జగన్‌కు తాళం వేస్తూ, సంక్షేమ పథకాలకు చప్పట్లు మోగించడంతోనే శనివారం నాటి కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ సమావేశం ముగిసింది. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోగా, తాము అనుకున్న రూ.1,460.82 కోట్ల బడ్జెట్‌ను అధికార పార్టీ ఏకపక్షంగా ఆమోదించుకుంది.

భజన బడ్జెట్

సమస్యలు పక్కనపెట్టి ఆద్యంతం జగన్ స్మరణే..

వీఎంసీ బడ్జెట్ లెక్క ఇదీ..

రూపాయి రాక	
రెవెన్యూ ఆదాయం	రూ. 820.90 కోట్లు
క్యాపిటల్ ఆదాయం	రూ. 501.42 కోట్లు
డిపాజిట్లు, అడ్వాన్సులు	రూ. 48.17 కోట్లు
రూపాయి పోక	
రెవెన్యూ ఖర్చులు	రూ. 614.60 కోట్లు
క్యాపిటల్ ఖర్చులు	రూ. 779.93 కోట్లు
రుణాల చెల్లింపులు	రూ. 18.12 కోట్లు
డిపాజిట్లు, అడ్వాన్సులు	రూ. 48.17 కోట్లు

ఏకపక్షంగా ముగిసిన కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

- ఆదాయం రూ.1370.49 కోట్లు, ఖర్చు రూ.1.460.82 కోట్లు
- ఏకపక్షంగా ఆమోదించుకున్న అధికార వైసీపీ
- మేయర్ ప్రసంగంలో వినిపించని బడ్జెట్ అంకెలు
- ప్రజా భారాలపై ప్రశ్నించిన ప్రతిపక్షాలతో వాగ్వాదం
- కాపు కల్యాణమండపాల అభివృద్ధిపై గొప్పలు

చిట్టినగర్, ఫిబ్రవరి 17 : విజయవాడ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ సమావేశం శనివారం ఏకపక్షంగానే ముగిసింది. టీడీపీ, సీపీఎం అభ్యంతరాల నడుమ అధి కార వైసీపీ రూ.1,460.82 కోట్లకు వీఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌ను ఆమోదించుకుంది. ప్రజలపై పన్నుల భారం లేదని, అభివృద్ధి, సుందరీకరణ, పచ్చదనం, పారిశుధ్యానికి ప్రాధాన్యమిచ్చామని వైసీపీ ఆమోదించుకోగా, అంకెల గారడీ అని, ప్రజలపై భారాల బడ్జెట్ అని ప్రతిపక్షాలు తిరస్కరించాయి. ఈ సమావేశానికి ముందు సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు 'బడ్జెట్‌లో భారాల మోత' అంటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కౌన్సిల్ ప్రారంభంలోనే ప్రతిపక్షాలు, అధికార పార్టీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. ప్రతిపక్షాల వాదనలను అడుగడుగునా అడ్డుకున్న స్వపక్షం చివరకు బడ్జెట్‌ను ఆమోదించుకుని సమావేశాన్ని మమ.. అనిపించింది.

ఆస్తి, చెత్త, నీటి పన్నుల భారాలొద్దు

ఆస్తి, చెత్త, నీటి పన్నుల భారాలు ప్రజలపై మోపొద్దని, వాటిని సవరించాలని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి.. మేయర్ రాయన భాగ్యలక్ష్మికి వివరిస్తుండగా, పలువురు అధికార పార్టీ కార్పొరేటర్లు అడ్డుతగిలారు. టీడీపీ హయాంలోనే భారాలని, వైసీపీ పాలనలోనే అభివృద్ధి జరిగిందని వాదించారు. దీంతో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.

కాపు కల్యాణమండపాల అభివృద్ధిపై రభస

కాపు కల్యాణమండపం అభివృద్ధికి గత సంవత్సరం కోటి రూపాయలు కేటాయించారని, ఈసారి బడ్జెట్ కేటాయింపులు లేవని టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో అధికార పార్టీ, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. టీడీపీ హయాంలో శంకుస్థాపనలు మినహా ఎటువంటి అభివృద్ధి జరగలేదని, వైసీపీ వచ్చాక కాపు కల్యాణ మండపాలకు రూ.కోటి కేటాయించిందని, పశ్చిమలో స్థలం కేటాయించిందన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలస్వామి

సమావేశమంతా భజనే..

బడ్జెట్ అంతా జగనన్న భజనగానే సాగింది. తమ డివిజన్ల పరిధిలో జరగాల్సిన అభివృద్ధి పనులు, జరిగిన అభివృద్ధి పనులకు కావాల్సిన కేటాయింపులపై ఎలాంటి స్పందన లేదు. సమావేశం ప్రారంభం నుంచి ముగిసే వరకు రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించే గొప్పలు చెప్పారు. 64 డివిజన్లకు ఏం కేటాయించారు.. ఎంత ఖర్చు చేయనున్నారు.. అనే అంశాల ప్రస్తావనే లేదు.

కేంద్ర, రాష్ట్రాల నుంచి నిధులేవి..?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నగరపాలక సంస్థకు రావాల్సిన నిధులను రాబట్టకుండా ప్రజలపై పన్నులు వేసి ఇబ్బందులు పెడుతున్నారని టీడీపీ, సీపీఎం కార్పొరేటర్లు సమావేశంలో నిలదీశారు. కుక్కలు, పందులు, కోతులు పట్టుకోవడానికి రూ.కోట్లలో కేటాయించి ప్రజల ఆరోగ్యానికి తక్కువ మొత్తంలో ఇవ్వడం దారుణమని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి నిలదీశారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని మేయర్‌ను కోరారు.

ఇక మాటల్లేవ్ చేతలే

- వేమవరం, కొత్తూరు తాడేపల్లిలో పర్యటన
- మైనింగ్ మాఫియా తవ్వకాలు చూసి ఆశ్చర్యం
- ఏం చేస్తున్నారంటూ అధికారులకు క్లాస్
- ఇకపై యంత్రాలు సీజ్ చేయాలని ఆదేశాలు
- ఒక్క ఫిర్యాదు వచ్చినా ఊరుకునేది లేదని హెచ్చరిక

'ఆంధ్రజ్యోతి' కథనాలపై అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'మీకిదే లాస్ట్ వార్నింగ్. ఇకపై చేతలే ఉంటాయి. మరోమారు విజయవాడ రూరల్ మండల పరిధిలో అక్రమ క్వారీయింగ్ జరుగుతుందని ఫిర్యాదు వస్తే మీ అందరిపై తక్షణం చర్యలు తీసుకుంటా. ఇంత దారుణంగా తవ్వుకుపోతుంటే మీరంతా ఏం చేస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోరా. అక్రమ క్వారీయింగ్‌ను ఎందుకు ఆపట్లేదు. ఎక్కడెక్కడ అక్రమ మైనింగ్ జరిగిందో లెక్కలు తీయండి. నిర్ధారణ చేయండి. జరిగిన వ్యవహారాలపై ఏం చేయాలో అది చేస్తాం.' అంటూ కలెక్టర్ దిల్లీరావు రెవెన్యూ, మైనింగ్ , పోలీసు అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, వేమవరం కొండ తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన ప్రత్యేక కథనాల నేపథ్యంలో కలెక్టర్ శనివారం రంగంలోకి దిగారు. అంతకుముందు స్పందనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయన సుడిగాలి పర్యటన చేశారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఇతర అధికారులు కూడా ఆయన వెంట వచ్చారు. దీంతో రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖల అధికారులు హడలెత్తిపోయారు. విజయవాడ రూరల్ మండల తహసీల్దార్, మైనింగ్ ఏడీ, ఇరిగేషన్ అధికారులు, స్థానిక పోలీసులు హాజరయ్యారు.



అక్రమ క్వారీయింగ్ ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, ఇతర అధికారులు

అక్రమ తవ్వకాలను చూసి ఆశ్చర్యం

జక్కంపూడి, వేమవరం కొండ ప్రాంతాల్లో జరిగిన అక్రమ మైనింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఆ తర్వాత కొత్తూరు తాడేపల్లిలో సర్వే నెంబర్ 244లో వాగు పోరంబోకు ప్రభుత్వ భూమిలో జరిపిన తవ్వకాలను చూశారు. ఎగువన ఉన్న వసంతరాయల తిప్పను తొలిచేయడాన్ని గమనించారు. కొత్తూరు తాడేపల్లిలో జరిగిన అక్రమ తవ్వకాలను పరిశీలించారు. సొరంగాల మాదిరిగా తవ్వేయడాన్ని చూసి నివ్వెరపోయారు. ఇంత భారీ ఎత్తున అక్రమ మైనింగ్ జరుగుతుంటే, ఎందుకు చర్యలు తీసుకోలేదని రెవెన్యూ, మైనింగ్ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. స్థానిక గ్రామస్థులు కలెక్టర్ దిల్లీరావును కలిశారు. స్థానికుడు మెండెం జమలయ్య కలెక్టర్‌కు తన వద్ద ఉన్న ఆధారాలను చూపించారు. కొత్తూరు తాడేపల్లి, పాతపాడు, జక్కంపూడి, వేమవరం, పోలవరం గట్ల వెంబడి పెద్ద ఎత్తున అక్రమ క్వారీయింగ్ జరిగిన ఉదంతాలను, తాము డ్రోన్లతో చిత్రీకరించిన దృశ్యాలను చూపించారు. అక్రమ క్వారీయింగ్ జరుగుతున్న సందర్భంలో తాను డిప్యుటేషన్‌పై వేరేచోట ఉన్నానని, ఇటీవలే ఇక్కడికి వచ్చానని తహసీల్దార్ తెలిపారు. తన దృష్టికి వచ్చిన వాటిపై చర్యలు తీసుకుంటానన్నారు. మెండెం శ్రీనివాసరావు అనే వ్యక్తి మైనింగ్ అధికారులపై ఫిర్యాదు చేశారు. తాము ఎన్నోసార్లు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టిస్తామన్నా అధికారులు కనీసం చర్యలు తీసుకోలేదన్నారు. ఎందుకు చర్యలు తీసుకోలేదని కలెక్టర్ మైనింగ్ అధికారులను నిలదీశారు. ఎన్నో జరిమానాలు విధించామని లెక్కలు చెబుతుండగా, కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇప్పటి వరకు జరిగిన అక్రమ క్వారీయింగ్ లెక్కలు తీయాలని, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇకపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తక్షణం అన్ని శాఖలు స్పందించి ముందు మెషీన్లను సీజ్ చేయాలని, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకరిపై ఒకరు చెప్పుకొంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



దుర్గమ్మ సేవలో గోపీచంద్

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శనివారం నటుడు గోపీచంద్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

అద్దెల దరువు

విజయవాడ జోన్ ఆర్టీసీ పరిధిలో 168 అద్దె బస్సులకు టెండర్లు

- ఇప్పటికే 25 శాతానికి పెరిగిన అద్దె బస్సులు
- తాజాగా మళ్లీ టెండర్లకు ఆహ్వానం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీలో మళ్లీ అద్దె బస్సుల గోల మొదలైంది. అద్దె బస్సులు ఇప్పటికే 10 శాతం దాటి 25 శాతానికి చేరిపోయినా ఇంకా పెంచాలని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ జోన్ పరిధిలో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 168 బస్సులకు టెండర్లను పిలిచారు. ఆర్టీసీకి భారీగా మార్జిన్ మిగిల్చే ఏసీ, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించి అద్దె బస్సులు ఎక్కువగా తీసుకునేందుకు నిర్ణయించారు. వీటితో పాటు అల్ట్రా పల్లెవెలుగు, పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లకు కూడా టెండర్లు పిలిచారు. ఎన్టీఆర్ జిల్లాకు 24 బస్సులు, కృష్ణాజిల్లాకు 15, గుంటూరు జిల్లాకు 54, పల్నాడు జిల్లాకు 36, బాపట్ల జిల్లాకు 13 బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోనున్నారు. ఈనెల 21వ తేదీ నుంచి బిడ్లను దాఖలు చేయనున్నారు. మార్చి 6వ తేదీతో టెండర్ల ప్రక్రియ ముగుస్తుంది. 14వ తేదీన వేలం నిర్వహిస్తామని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు.

అవినీతికి ఆస్కారం

అద్దె బస్సుల పేరుతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోంది. ఇంతకుముందు పిలిచిన టెండర్లను ఆధారం చేసుకుని కొంతమంది వివిధ కార్పొరేషన్లతో కలిసి సబ్సిడీల కోసం బస్సుల కొనుగోలు డ్రామాకు తెరతీశారు. బస్సులు కొనకుండానే సబ్సిడీలు మింగేశారు. డ్రైవర్లు దూరప్రాంత రూట్లకు వెళ్లిన సందర్భంలో డబ్బు వసూలు చేసుకుని ఉడాయించిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ప్రతి అద్దె బస్సు యజమాని ఆర్టీసీ అధికారులకు రూ.3 వేల నజరానా చెల్లించుకోవాల్సి ఉంది. అలా చెల్లిస్తేనే డీజిల్ బిల్లులు పెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అద్దె బస్సుల విధానం వల్ల సంస్థకు ఖర్చు తగ్గుతుందన్న ఆలోచనే తప్పు. ప్రయాణికులకు మెరుగైన ప్రయాణం కల్పించాలనే అంశాలను గాలికొదిలేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశాక సంస్థను ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయించడం దారుణమని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిని భర్తీ చేయాల్సిన ఈ పరిస్థితుల్లో ఆ పని చేయకుండా అద్దె బస్సులను తీసుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. అద్దె బస్సులను తీసుకుంటే డ్రైవర్ల అవసరముండదని, ఆ బస్సులను పంపేవారే డ్రైవర్లను నియమించుకుంటారని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఆర్టీసీలో అద్దె బస్సులను తీసుకునే విషయంలో ఒక ఒప్పందం ఉంది. దాని ప్రకారం 10 శాతం అద్దె బస్సులను మించి తీసుకోవటానికి వీల్లేదు. నాలుగేళ్లలో ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే అర డజనుకుపైగా టెండర్లు పిలిచారు. దీంతో సంస్థలో అద్దె బస్సుల శాతం ఇప్పటికే 25 శాతం దాటిపోయింది. తాజాగా పిలిచిన టెండర్ల ద్వారా ఇది 30 శాతానికి చేరింది.

కాంగ్రెస్ నుంచి

పోటీకి సై

- పెరుగుతున్న ఆశావహులు..షర్మిల రాకతో కేడర్‌లో ఉత్సాహం
- ఎన్టీఆర్, కృష్ణాలో అసెంబ్లీకి పోటీకి 112 దరఖాస్తులు
- 2 లోక్‌సభ స్థానాలకు 8 దరఖాస్తులు..సంఖ్య పెరిగే అవకాశం
- 23న కాంగ్రెస్, వామపక్షాల భేటీ..పోటీ చేసే స్థానాలపై చర్చ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయడానికి ఆశావహులు ఉవ్విళ్లూరుతున్నారు. పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి తాము బరిలోకి దిగుతామని అభ్యర్థులు ఒక్కొక్కరుగా ముందుకొస్తున్నారు. పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సుమారు 8మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడ, మచిలీపట్నం లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేయడానికి ఒక్కోస్థానానికి నలుగురు చొప్పున దరఖాస్తులు చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య కంటే ఈ ఏడాది జరగబోయే ఎన్నికలకు దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య పెరి గిందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 29వ తేదీ వరకు సమయం ఉన్నందున అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ దరఖాస్తులన్నీ విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ పై అంతస్తులో ఉన్న వార్‌రూమ్‌కు చేరుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిశాక నియోజకవర్గాలు, సామాజికవర్గాల వారీగా వాటిని వడబోస్తారు. ఆ తర్వాత జాబితాను పీసీసీలోని ఎన్నికల కమిటీకి పంపుతారు. ఆ తర్వాత అభ్యర్థులను ఖరారుచేస్తారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహ రిస్తున్న వారితో పాటు నాడు వైఎస్‌కు సన్నిహితంగా మెలిగి తర్వాత తటస్థంగా ఉన్నవారు ఎమ్మెల్యే టికెట్లను ఆశిస్తున్నారు. గెలుపు అవకాశాలను పక్కన పెడితే ఈసారి కాంగ్రెస్‌కు ఓటు శాతం పెరుగుతుందన్న భావనను పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం వైసీపీపై అన్ని వర్గాల్లోనూ తీవ్రమైన అసంతృప్తి కనిపిస్తోంది. అధికార పార్టీలో అసంతృప్తిగా ఉన్న పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు కాంగ్రెస్ జెండా పట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో దరఖాస్తుల సంఖ్య 150 వరకు పెరుగుతుందని పార్టీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి. లోక్‌సభ స్థానాలకు మరో పది దరఖాస్తులు వరకు రావచ్చంటున్నారు.

23న సీట్లు ఖరారు!

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ భావించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి పోటీ చేయడానికి అభ్యర్థులు ముందుకొచ్చారు. ఈ ఎన్నికల్లో వామపక్షాలు కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవాలని నిర్ణయించుకున్నాయి. ఎవరెవరు ఏయే నియోజకవర్గాల్లో పోటీ చేయాలన్న దానిపై చర్చించడానికి విజయవాడలో ఈనెల 23న కాంగ్రెస్, వామపక్షాలు భేటీ కావాలని నిర్ణయించుకున్నాయి. సీపీఎం, సీపీఐకి ఎన్ని సీట్లివ్వాలి. కాంగ్రెస్ ఏయే స్థానాల్లో పోటీ చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

- 3,472 కేంద్రాల్లో పరీక్షలు .. ప్రశ్నపత్రాలకు ప్రత్యేక కోడ్
- ఎవరు లీక్ చేసినా గుర్తించేలా సాంకేతిక పరిజ్ఞానం
- మార్చి 31 నుంచి మూల్యాంకనం: ప్రభుత్వ పరీక్షల వి భాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి

పెడన, ఫిబ్రవరి 17: "పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 6,23,000 మంది రెగ్యులర్, 1,02,000 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. వీరికోసం 3,472 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం." అని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి అన్నారు. శనివారం పల్లోటి హైస్కూల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని, 8.45 గంటలకల్లా హాలులోకి అనుమతిస్తామని తెలిపారు. ప్రశ్నపత్రాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రత్యేక కోడ్‌తో రూపొందించామని, ఈ కోడ్ ఆధారంగా ప్రశ్నపత్రాన్ని ఎవరైనా లీక్ చేస్తే అది ఎక్కడ నుంచి వచ్చింది, ఏ జిల్లా, ఏ ఊరు, ఏ సెంటర్, పరీక్ష హాలు, ఏ విద్యార్థి నుంచి వచ్చిందీ తెలిసిపోతుందన్నారు. ఆ పరీక్ష గదిలో ఇన్విజిలేటర్, ఆ సెంటర్‌కు సంబంధించిన సీఎస్, డీవోలతోపాటు ఆ విద్యార్థిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి జిల్లాలో నాలుగు సెంటర్ల చొప్పున సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ఆ జిల్లా కేంద్రానికి అనుసంధానం చేశామని డీఈవోలు పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ విద్యార్థులు 3800 మంది ఉన్నారని, వీరు స్థానిక పరీక్షా కేంద్రంలోని 9వ తరగతి విద్యార్థుల సాయంతో పరీక్ష రాస్తారని తెలిపారు. అనివార్య కారణాల వల్ల అరగంట ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతిస్తామన్నారు. మొత్తం ఏడు పరీక్షలు ఉంటాయని, పీఎస్, ఎన్ఎస్ పరీక్షలు వేరు వేరుగా ఉంటాయని ఆయన తెలిపారు. పరీక్షలు ముగియగానే మార్చి 31 నుంచి జిల్లా కేంద్రాలలో మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో పల్లోటి హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో దేవానందరెడ్డిని అప్సా నాయకులు సన్మానించారు.

గేట్లు వేసి బంధించి ఆసరా సభ

- బయటకు వెళ్లనీయాలంటూ డ్వాక్రా మహిళల ఆగ్రహం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17: ఆసరా చెక్కుల పంపిణీ పేర అధికార పార్టీ నాయకులు నిర్వహించే సభలను విజయవంతం చేసేందుకు క్రాంతిపథం సిబ్బంది చేస్తున్న చర్యలతో మహిళలు అనేక అవస్థలు పడుతున్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక విధాలుగా బెదిరించి మహిళలను సభకు రప్పించారు. సభలో తాగునీరు సరఫరా చేయలేదని,



ఇబ్రహీంపట్నం మండల కార్యాలయంలో బుక్‌కీపర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

కాలకృత్యాలు తీర్చుకునే అవకాశం లేదని మహి ళలు వాపోయారు. మూడురోజుల క్రితం రెడ్డిగూడెంలో, రెండ్రోజుల క్రితం మైలవ రంలో, శనివారం జి.కొండూరులో నిర్వహించిన చెక్కుల పంపిణీలో ముఖ్య అతి థిగా వచ్చిన ఎంపీ మాట్లాడుతుండగానే సగానికిపైగా మహిళలు సభ నుంచి వెళ్లి పోవడాన్ని గమనించిన అధికార పార్టీ నాయకులు, క్రాంతి పథం సిబ్బంది ఇబ్ర హీంపట్నం సభలో మహిళలను లోనికి పోనిచ్చి బయటకు రాకుండా గేట్లకు తాళా లేసి బంధించారు. దీంతో మూడు గంటలపాటు మంటుటెండలో నిలువ నీడలేక, కూర్చునేందుకు సరిపడా కుర్చీలు లేక ఇబ్బందిపడ్డారు. దీంతో బయటకు వెళ్లేందుకు మహిళలు ప్రయత్నించారు. కార్యాలయం గేట్లు మూసి మహిళలను బంధించడంతో మండుటెండలో మహిళలు మగ్గిపోయారు. ఎందుకమ్మా ఇలాంటి సభలు పెట్టి మాప్రాణాలు తీస్తారు. తాగేందుకు మంచినీరు లేదు. బీపీలు, మధుమేహాలు ఉన్నవాళ్లం ఎందుకు ఇంతసేపు మమ్మల్ని బంధించారు అని మహిళలు బుక్ కీపర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

గొర్రెలపైకి దూసుకెళ్లిన టిప్పర్

- ఏడు గొర్రెలు మృతి..మరో నాలిగింటికి విరిగిన కాళ్లు

చల్లపల్లి, ఫిబ్రవరి 17: చల్లపల్లి-మచిలీపట్నం ప్రధాన రహదారిపై టిప్పర్ వేగానికి గొర్రెలు బలయ్యాయి. సాలిపేట వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు అక్కడిక్కడే మృతిచెందాయి. మరో నాలుగు గొర్రెలకు కాళ్లు విరిగాయి. శనివారం సాయంత్రం సాలిపేట వద్ద శ్మశానవాటిక నుంచీ గొర్రెలమంద మేతమేసి బయటకువస్తుండగా, మచిలీపట్నం వైపు నుంచి వస్తున్న టిప్పర్ గొర్రెలపైగా దూసుకువెళ్లింది. పుచ్చగడ్డ గ్రామానికి చెందిన డొక్కు కృష్ణ అనే గొర్రెల కాపరికి చెందిన ఏడు గొర్రెలు మృతిచెందాయి. మరో నాలుగు గొర్రెలకు కాళ్లు విరిగాయి. పెద్ద సైజు గొర్రెలు చనిపోవడం, నాలుగు జీవాలకు కాళ్లు విరగటంతో గొర్రెల కాపరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంత ఘోర ప్రమాదం జరిగినా టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడని, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చల్లపల్లి ఎస్ఐ సీహెచ్ చిన్నబాబు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.



డిమాండ్లు ఆమోదించేంత వరకు..

మచిలీపట్నం ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న ఏపీ జేఏసీ నాయకులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు కృష్ణాజిల్లా వ్యాప్తంగా శనివారం ఉద్యమబాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమబాటను వీడేదిలేదని ఉద్యోగులు నినదించారు. సర్వీసు సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, మధ్యంతర భృతిని విడుదల చేయాలని ఉద్యోగులు నినాదాలు చేశారు. పామర్రు, గుడివాడ మొవ్వ, అవనిగడ్డ, పెనుమలూరు తదితర ప్రాంతాల్లో జేఏసీ నాయకులు ధర్నాలు చేశారు.

ఉద్యమబాటే

కృష్ణా కలెక్టరేట్‌లోని ధర్నాచౌక్ వద్ద ధర్నాలో ఏపీ జేఏసీ నాయకులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: తమ న్యాయమైన డిమాండ్లు ఆమోదించేంత వరకు ఉద్యమబాట వీడబోమని ఏపీ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. కృష్ణా కలెక్టరేట్ ధర్నాచౌక్‌వద్ద ఏపీ జేఏసీ నాయకులు ధర్నా చేశారు. 11, 12వ పీఆర్సీలను అమలు చేయాలని ఏపీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మూడురోజులుగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నా, మధ్యాహ్న భోజనవిరామ సమయంలో ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

చలో విజయవాడకు వెళ్లకుండా

సీపీఎస్ ఉద్యోగులకు పోలీసుల నోటీసులు

వైసీపీ పాలనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు గతంలో ఎన్నడూ లేనంతగా ఇబ్బంది పడుతున్నారని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లెనిన్‌బాబు, ఏపీ జేఏసీ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018 నుంచి 2022 వరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. అధికారం చేపట్టిన వారం వ్యవధిలో సీపీఎస్‌ను రద్దుచేస్తామని చెప్పినా, ఇంతవరకు అమలు చేయకపోగా, సీపీఎస్ ఉద్యోగులు ఆదివారం చలో విజయవాడ కార్యక్రమం తల పెడితే పోలీసుల ద్వారా నోటీసులు జారీచేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మధ్యంతర భృతిని 30శాతం పెంచి 1జూలై 2023నుంచి మంజూరు చేయాల్సి ఉన్నా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని జేఏసీ రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ రమాదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు.



గుడివాడలో..

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

పెండింగ్‌లో ఉన్న డీఎలను విడుదల చేయాలని ఉద్యోగులు ఎంతోకాలంగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఏపీ జేఏసీ కృష్ణా విభాగం నాయకుడు హేమప్రకాష్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ నాయకుడు వి.ఆంజనేయులు అన్నారు. 2023 జనవరి 1, 2023 జూలై 1లవి రెండు డీఏలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబరు 1 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి పాతపెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, వారి సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంటాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు ఆదేశాలు ఇచ్చినా ఇంత వరకు ఈ ప్రక్రియను పూర్తిచేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. ఉద్యోగులు అలవికాని డిమాండ్లు చేయడం లేదని వారన్నారు.



మాట్లాడుతున్న ఎ.విద్యాసాగర్

ప్రభుత్వ నిర్బంధాలను దాటి

ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం

- ఉద్యోగులారా సిద్ధం కండి
- ఏపీజేఏసీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ ఎ.విద్యాసాగర్ పిలుపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): "ఐదేళ్లవుతున్నా ఉద్యోగులకు ఈ ప్రభుత్వం మేలు చేయలేదు. ఇకపై చేస్తుందన్న ఆశలు లేవు. ఉద్యమంలోకి దిగాం కాబట్టి దీనిని మరింత ఉధృతం చేద్దాం. ఇప్పటి వరకు చేస్తున్న ఉద్యమాలను మించి రానున్న రోజులలో గట్టిగా ఆందోళనలు చేద్దాం. ఉద్యమాలను అణిచివేసేందుకు ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలను ప్రయోగించినా, ఈ ప్రభుత్వానికి ఉద్యోగుల ఉద్యమ సత్తాను చాటుదాం. సమస్యలను పరిష్కరించుకునేదాకా పోరాడదాం.. సిద్ధంగా ఉండండి" అని ఉద్యోగులకు ఏపీజేఏసీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ ఎ.విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఈనెల 20న విజయ వాడలో తలపెట్టిన మహా నిరసన కార్యక్రమంపై జిల్లా నాయకత్వంతో శనివారం ఆయన గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. శనివారం ధర్నాచౌక్‌లో తలపెట్టిన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకునేందుకు యత్నించడం దారుణమన్నారు. ప్రభుత్వ అణచివేత విధానాలను ఎదుర్కొనేలా ఏపీజేఏసీలోని ఉద్యోగ సంఘాలన్నీ నిరంతరం చర్చించుకుని ప్రణాళికలు రూపొందించుకో వాలని, ఇకపై పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయాలని సూచించారు.

మునుపెన్నడూ చూడని నిర్బంధాలు, కుట్రలు

"34 ఏళ్లగా ఎంతోమంది ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలను చూశాం. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని గుర్తించి సమస్యలను చర్చించి పరిష్కరించేవారు. ఉద్యోగులపై కక్షగట్టి కుట్రలు, నిర్బంధాలు ప్రయోగించటం ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నాం. ఈ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తోంది." అని ఏపీ జేఏసీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్ అన్నారు. సమావేశంలో ఏపీజేఏసీ విజయవాడ నగర అధ్యక్షుడు సీహెచ్ శ్రీరామ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వీఎస్ సాయిరాం, పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ చైర్మన్ ఎ.సాంబశివరావు, రవాణా శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజబాబు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీలు చించివేత



జుజ్జూరులో వేర్వేరు చోట్ల గుర్తు తెలియని వ్యక్తులు చించేసిన ఫ్లెక్సీలు

వీరులపాడు, ఫిబ్రవరి 17: జుజ్జూరు గ్రామంలో వారం క్రితం టీడీపీ కార్యాలయాన్ని పార్టీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని), నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈసందర్భంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. వాటిని గుర్తుతెలియని వ్యక్తులు చించేయడం ప్రారంభించారు. ఒకటి కాదు రెండు కాదు, టీడీపీ ఫ్లెక్సీ కనబడితే కట్ చేస్తున్నారు. రెండ్రోజుల క్రితం టీడీపీ నాయకుడు కొమ్మూరు శేషు కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఆయన వీరులపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అయినా ఫ్లెక్సీలు ధ్వంసం చేయడం ఆపలేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఫ్లెక్సీలు చించేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోరుతున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని కేసు నమోదు చేస్తామని ఎస్సై మహాలక్ష్మడు చెప్పారు.

ఇంద్రకీలాద్రిపై నేడు

మల్లేశ్వరాలయ పునఃప్రారంభం

వన్‌టౌన్, ఫిబ్రవరి 17: ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం పునః ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటల 45 నిమిషాలకు స్వర్ణ శిఖరానికి కుంభాభిషేకం చేస్తారు. పంచాహ్నిక దీక్షతో ఈనెల 14 నుంచి హోమాలు, పూజలు నిర్వహించారు. యంత్రాలకు కళాపకర్షణ, యంత్రశుద్ధి చేశారు. చివరిగా ధాన్యాదివాసం, వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఉదయం శాంతి పఠనంతో కార్యక్రమాలు మొదలయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటపపూజలు, మంటపహోమాలు, అంగహోమం, ధాన్యాదివాసం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో కేఎస్ రామారావు, స్థానాచార్యుడు శివప్రసాద్‌శర్మ, ఉపప్రధాన అర్చకుడు కోటప్రసాద్, వైదిక కమిటీ సభ్యుడు యజ్ఞనారాయణ శర్మ పాల్గొన్నారు. ఆలయ పునరుద్ధరణకు తలపెట్టినప్పుడు మూలవిరాట్టుకు బదులుగా ఆలయంలోని నటరాజస్వామి గుడి వెనుక బాలాలయం ఏర్పాటు చేసి అక్కడ శివలింగానికి మూలవిరాట్టుకు ఉన్న శక్తులన్నీ ఆపాదింపచేస్తూ కళాపకర్షణ చేశారు. ఆదివారం బాలాలయంలోని శివలింగానికి ఉన్న శక్తులన్నీ మూలావిరాట్టుకు అనుసంధానం చేస్తారు. మల్లేశ్వరస్వామివారికి కళాపకర్షణ చేస్తారు. గోపురంపై స్వర్ణ శిఖరాన్ని ప్రతిష్ఠించి కుంభాభిషేకం చేస్తారు. కుంభాభిషేకానికి పైకి ఎక్కేందుకు కర్రలతో నిచ్చెనలను నిర్మించారు. పరిమిత సంఖ్యలోనే శిఖరం వద్దకు చేరుకు నేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి కంటే ముందుగానే మల్లేశ్వరుడి దర్శనాన్ని భక్తులకు అందించాలని ప్రత్యేక కార్యక్రమంగా పంచాహ్నిక దీక్షతో కార్యక్రమాన్ని తలపెట్టారు. తొలిరోజు దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దీక్ష కార్యక్రమాన్ని, హోమాలను, క్రతువులను ప్రారంభించారు.



అసంపూర్తిగా పనులు

ఆలయ పునరుద్ధరుణ పనులు సంపూర్తి కాలేదు. ఇంకా కొన్ని పనులు మిగిలే ఉన్నాయి. మహాశివరాత్రికి భక్తులకు స్వామివారి దర్శనం అందించాలని ప్రధానమైన పనులను ముగించి కార్యక్రమాన్ని చేపట్టారు.

రేపటి నుంచి

వీరమ్మ తిరునాళ్ల

ఉయ్యూరు, ఫిబ్రవరి 17: వీరమ్మ తిరునాళ్ల సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఏటా భీష్మ ఏకాదశి రోజున ప్రారంభమై 15 రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకుంటారు. సోమవారం రాత్రి రావిచెట్టు సెంటర్ సమీపాన ఉన్న మెట్టినింటి నుంచి అమ్మవారు బయలుదేరతారు. వేలాది మంది భక్తుల గండదీపాలు అందుకుంటూ తిరుగు గండ దీపాల భక్తులు వెంటరాగా ఊరంతా ఊరేగి మరుసటిరోజు సెంటర్ సమీపాన ఉన్న ఊయల స్తంభాల వద్ద ఊయలలూగి సాయంత్రం ప్రధాన రహదారి పక్కన ఉన్న ఆలయానికి చేరుకుని భక్తులకు దర్శనమిస్తారు. తిరునాళ్లలో ప్రధానమైన శిడిబండి వేడుక 11వ రోజు నిర్వహిస్తారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారులు, ఉయ్యూరు నగర పంచాయతీ, పోలీసు శాఖ పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది.



భక్తులకు అసౌకర్యం కలగనీయొద్దు: జోగి

పదిహేను రోజులపాటు వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు, ఆలయ కమిటీని మంత్రి జోగి రమేశ్ ఆదేశించారు. తిరునాళ్ల ఏర్పాట్లపై రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, విద్యుత్ అధికారులు, ఆలయ కమిటీతో శని వారం నగరపంచాయతీ కార్యాలయంలో అయన సమీ క్షించారు. చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ సురేశ్, హర్షదునీసా, నగరపంచాయతీ కమిషనర్ వెంక టేశ్వరరావు, గన్నవరం డీఎస్పీ జయ సూర్య పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యహవనం

మోపిదేవి, ఫిబ్రవరి 17: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా సుబ్రహ్మణ్యహవనం నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు స్వామికి ప్రత్యేక పూజలుచేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన దంపతులు హోమంలో పాల్గొనగా, వేదపండితులు కొమ్మూరి ఫణి కుమార్‌శర్మ, ప్రధాన అర్చకుడు బుద్ధు పవన్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో అర్చక బృందం హవనమును వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. వేదమంత్రోచ్చరణలతో మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ పండితులు

జగన్ కంటే

పెద్ద సైకో కేశినేని నాని

- ఆయనో పెద్ద అవినీతిపరుడు, వసూల్ రాజా
- ఎమ్మెల్యే టికెట్లు ఇప్పిస్తానని ఒకరి వద్ద రూ.కోటి, మరొకరి వద్ద రూ.4 కోట్లు వసూలు చేశారు
- సోదరుడిపై కేశినేని చిన్ని ఆరోపణలు

విద్యాధరపురం, ఫిబ్రవరి 17: సీఎం జగన్ కంటే పెద్ద సైకో ఎంపీ కేశినేని నాని అని టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) విమర్శించారు. మొగల్రాజపురంలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో నానిపై సోదరుడు చిన్ని విమర్శనాస్త్రాలు సంధించారు. నమ్మిన వారిని నానీ నట్టేట ముంచేస్తాడని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యే టిక్కెట్లు ఇప్పిస్తానని కొందరికి ఆశచూపి నానీ డబ్బులు వసూలు చేశాడన్నారు. వాటిని తిరిగి ఇవ్వకుంటే ఆధారాలతో సహా తాను నిరూపిస్తానని చిన్ని తెలిపారు. టీడీపీలో ఉన్నప్పుడు కోవర్టుగా నానీ వ్యవహరించేవాడని అన్ని విషయాలు జగన్‌కు చేర వేసేవాడని ఆరోపించారు. విజయవాడ పశ్చిమ, మైలవరం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే టికెట్లు ఇప్పిస్తానని కొందరి వద్ద నాని డబ్బులు వసూలు చేశారన్నారు. ఒకరు కోటి రూపాయలు ఇవ్వగా, మరొ కరు నాలుగు కోట్లు ఇచ్చారన్నారు. ఈ ఆరాచకాలన్ని త్వరలోనే బయటకు వస్తాయన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వకుంటే మీడియా ముందుకు వారం దరు వస్తారని హెచ్చరించారు. తన కుటుంబంలో శుభకార్యానికి తన స్నేహితుని వద్ద డబ్బులు తీసుకుని ఇవ్వకుండా అతనిని నానీ రోడ్డున పడేశాడని ఆరోపించారు. నానీ నటన, ఆటలు ఇక సాగవన్నారు. ఇవే చివరి ఎన్నికలని గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో కోవర్ట్ ఆపరేషన్ చేసి నానీ నటించారని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు టికెట్లు అమ్ముకుంటున్నాడంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడన్నారు. సీఎం జగన్‌కు దోచుకోవడం-దాచుకోవడం, సామాన్యులను పీడించడం బాగా తెలుసునని, తాను సిద్ధమని పోస్టర్లు వేయించుకుంటే టీడీపీలోకి వెళ్లడానికి తాము సిద్ధమని వైసీపీ నాయకులు చెబుతున్నారన్నారు. కేశినేని నాని వెంట క్యాడర్ ఎవ్వరూ వెళ్లలేదన్నారు. కేశినేని నాని కార్యాలయం ఇప్పుడు జనం లేక వెలవెలబోతుందన్నారు. ప్రజలు నానీని వ్యతిరేకిస్తున్నారని, ప్రజా బలం లేని అతనికి టికెట్ ఇవ్వడం జగన్‌కు కూడా ఇష్టం లేదన్నారు. తంగిరాల సౌమ్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని నానీ తక్కువ చదువుకున్నాడని ఆమెను విమర్శించే స్థాయి నానికి లేదన్నారు. తండ్రి చనిపోతే ప్రజాసేవ చేయడానికి ఉద్యోగాన్ని వదిలి సౌమ్య ప్రజా జీవితంలోకి వచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికా రంలోకి వస్తుందని తాడేపల్లి ప్యాలెస్ నుంచి జగన్మోహన్‌రెడ్డి, కేశినేని భవన్ నుంచి కేశినేని నాని పారిపోయి తెలంగాణకు వెళతారన్నారు.

ఎవరా ఇద్దరు!

- తెలుగు తమ్ముళ్లలో చిన్ని వ్యాఖ్యల కలకలం
- నాని కోవర్టులపై టీడీపీలో మరోసారి చర్చ

(విజయవాడ - ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద ఎంపీ కేశినేని నాని టికెట్లు ఇప్పిస్తానని కోట్లు దండుకున్నారంటూ టీడీపీ విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పర్యవేక్షకుడు కేశినేని చిన్ని చేసిన వ్యాఖ్యలు తెలుగు తమ్ముళ్లలో కలకలం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలు మరోసారి నాని కోవర్టులపై టీడీపీలో చర్చకు దారితీశాయి. కేశినేని నాని టీడీపీ నుంచి వైసీపీలోకి జంప్ అయ్యాక ఆయనతోపాటు విజయవాడ పార్లమెంటు పరిధిలో పేరున్న టీడీపీ నాయకులు ఎవ్వరూ వెళ్లలేదు. కానీ కొందరు నాని కోవర్టులుగా టీడీపీలో కొనసాగుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడ పశ్చిమానికి చెందిన ఇద్దరు టికెట్ల కోసం నానికి డబ్బులు ఇచ్చారంటూ చిన్ని చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ఎవరా ఇద్దరు అన్న చర్చ టీడీపీలో జోరుగా సాగుతోంది. వీరిలో ఒకరు మైనారిటీవర్గానికి చెందిన వారని, మరొకరు మార్వాడీ సామాజికవర్గానికి చెందిన వారని టీడీపీ వర్గాలు చెబుతున్న మాట. ఈ ఇద్దరిలో ఒకరు సుమారు కోటి రూపాయల వరకు సమర్పించుకోగా, మరొకరు రూ.4 కోట్లు వరకు నానికి ఇచ్చినట్లు చెబుతున్నారు. విజయవాడ పశ్చిమలోనే కాకుండా మైలవరం నియోజకవర్గంలోనూ పలువురి వద్ద టికెట్ల పేరుతో నాని డబ్బులు తీసుకున్నాడని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. చిన్ని వ్యాఖ్యల నేపథ్యంలో నాని కోవర్టులు ఎవరు, నాని బాధితులు ఎవరు అన్న దానిపై టీడీపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. నాని బాధితులు త్వరలోనే మీడియా ముందుకు వస్తారని చిన్ని పేర్కొన్నారు. ఇక కోవర్టులుగా ఉన్న వారి సంగతి పార్టీ అధిష్టానం చూసుకుంటుందని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	288
చికెన్ స్కిన్‌లెస్	298

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

200 మంది టీడీపీలో చేరిక

పాయకాపురం, ఫిబ్రవరి 17 : స్థానిక 62వ డివిజన్ వైసీపీకి చెందిన 200 మంది శనివారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు దగా పడ్డారని, విజన్ ఉన్న చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో టీడీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పైడి శ్రీను, నాగేశ్వరరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



భయంతోనే రాజధాని ఫైల్స్‌పై కోర్టులో కేసులు

బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

లబ్బీపేట, ఫిబ్రవరి 17 : జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత చేసిన విధ్వంస పాలన గురించి రాజధాని ఫైల్స్ సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాణిగారితోట 18వ డివిజన్‌లో శనివారం బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి భయపడ్డారని అందుకే సినిమా నిలుపుదల చేయాడానికి తన అనుచరులతో కోర్టులో కేసులు వేయించాడని, వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ సంపదను ఒక సైకో ఎలా నాశనం చేశాడనే విషయంతో పాటు రైతులు, మహిళలు పట్ల ప్రభుత్వం ఎంత దారుణంగా వ్యవహరించిందో స్పష్టంగా సినిమాలో చూపించారని తెలిపారు. నిజం ఎప్పటికైనా గెలుస్తుందని జగన్‌మోహన్‌రెడ్డి తెల్సుకోవాలని, ప్రతిపక్షాలపై, మీడియా, సోషల్ మీడియాతో పాటుగా సినిమాలను ఉపయోగించుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి తనను తాను హీరోగా ప్రొజెక్టు చేయించుకుంటున్నారని, ఇతర పక్షాలను విలన్లుగా చూపిస్తూ సినిమాలు తీస్తున్నాడని అన్నారు. అమరావతి విధ్వంసం వలన రాష్ట్రంలో లక్షల కోట్ల సంపద నష్టపోయామని, ఇప్పుడు హైదారాబాద్ క్యాపిటల్ అంటున్నాడని దీంతో జగన్ ఒక నిజమైన విధ్వంసకారుడుగా చరిత్రలో నిలుస్తాడని అన్నారు.వేములు దుర్గారావు, పీరుబాబు, దుర్గ పాల్గొన్నారు.



డివిజన్‌లో పర్యటిస్తున్న గద్దె రామ్మోహన్

25న తలపెట్టిన నిరసన జయప్రదం చేయండి

● టీడీపీ నాగవంశం సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 17 : టీడీపీ బీసీ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న ధర్నాచౌక్‌లో తలపెట్టిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బీసీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ నాగవంశం సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ జగన్ బీసీలకు ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్లు నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా నాగవంశం కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించకుండా వారిని ఆర్థిక ఎదుగుదలకు దెబ్బతీశారని, కానీ నాగవంశ కార్పొరేషన్ ఛైర్మన్‌కు నెలకు రూ. 75 వేలు, డైరెక్టర్లకు రూ. 15 వేలు చొప్పున జీతాలు చెల్లించి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బీసీ కార్పొరేషన్లకు విడుదల చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో టీడీపీ నేతలు బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని చిన్ని, బుద్దా వెంకన్న, గద్దె రామ్మోహన్, కొల్లు రవీంద్రలతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా బీసీ నేతలు పాల్గొంటారని చెప్పారు. మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి, మొకర ఆదిబాబు, ఎచ్చెర్ల అనిల్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు కామా దేవరాజ్‌కు సత్కారం

వన్‌టౌన్, ఫిబ్రవరి 17: రెండు విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న టీడీపీ సీనియర్ నాయకులు, లారీ సప్లయర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కామా దేవరాజ్‌ను టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్(చిన్ని) శనివారం మొగల్రాజపురంలోని తన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభినందనలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ దేవరాజ్ చేస్తున్న సేవలు గుర్తించి సెంట్రల్ క్రిష్టియన్ యూనివర్సిటీ, రవాణా రంగంలో చేసిన సేవలు గుర్తించి అమెరికాలోని యూరో ఏషియన్ యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్‌లు పొందడం ఎంతో అభినందనీయమన్నారు. షేక్ ఆషా, ఎండీ ఫతావుల్లా, సయ్యద్ ఇమ్రాన్, ఎంఎస్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



దేవరాజ్‌ను సన్మానిస్తున్న కేశినేని చిన్ని, ఎంఎస్ బేగ్

పీబీ సిద్ధార్థలో ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 17: పీబీ సిద్ధార్థ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు పీబీ సిద్ధార్థ, మహిళా సిద్ధార్థ, స్టెల్లా, ట్రిపుల్ ఐటీ, ఎల్‌బీఆర్, సీపీవీసీ, వీఆర్, డీఏఆర్, నలందా, ఎస్‌జీఎస్ కళాశాలల నుంచి 4 ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్, 17 ఆంధ్ర, 8 ఆంధ్ర ఎయిర్ ఫోర్స్, 1 ఆంధ్రా ఈఎంఈ బెటాలియన్ కేడెట్‌లు హాజరయ్యారు. ఈ పరీక్షలలో డ్రిల్‌టెస్ట్, కమ్యూనికేషన్ మ్యాప్ రీడింగ్, వెపన్ టెస్ట్ ఎఫ్‌సీ, బీసీ, ఇతర పరీక్షలు జరిగాయి. సీవో కల్నల్ బలీందర్ సింగ్, సీవో సౌరభ్ ముఖర్జీ పర్యవేక్షించారు. ఏఎన్‌వో లెఫ్టినెంట్ డాక్టర్ రోహిణి కుసుమ, లెఫ్టినెంట్ దుర్గావతి, శైలజ, ఎండీ నాయక్, కెప్టెన్ సుదర్శన్, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



మెస్సియా ఫెలోషిప్ వైద్యశిబిరానికి విశేష ఆదరణ

ఆటోనగర్(పెనమలూరు), ఫిబ్రవరి 17: ఆటోనగర్ వందడుగుల రోడ్డులోని మెస్సియా ఫెలోషిప్ చర్చి ఆవరణలో శనివారం జరిగిన మెగా వైద్యశిబిరానికి విశేష ఆదరణ వచ్చింది. సుమారు ఏడువందల మంది ప్రజలు హాజరయ్యారు. ఈ వైద్య శిబిరంలో రమేష్ ఆసుపత్రి, టాప్‌స్టార్ ఆసుపత్రి, అంకుర ఆసుపత్రుల నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు బీపీ, షుగర్, ఈసీజీ, వినికిడి పరీక్షలు, గుండె, గ్యాస్ట్రో, ఆర్థో, గైనిక్, ఈఎన్టీ, దంత, న్యూరో తదితర వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెస్సియా ఫెలోషిప్ నిర్వాహకులు ఫాదర్ సజ్జా రత్నకుమార్, జ్యోతి దంపతులు మాట్లాడుతూ ప్రతిఏటా తాము మెస్సీయ ఫెలోషిప్ తరపున వేల మందికి సేవ చేయడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని పేర్కొన్నారు.



ఉచిత వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఫాదర్ సజ్జా రత్నకుమార్ జ్యోతి దంపతులు

పీబీ సిద్ధార్థలో పద్యాలాపన పోటీలు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 17: విద్యార్థుల్లో తెలుగుభాషమీద మమకారం కలిగించాలని, తెలుగు పద్యంలోని మాధుర్యం, కమనీయతను అందించాలనే ఉద్దేశ్యంతో సిద్ధార్థ కళాపీఠం పద్యాలాపన పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ కళాపీఠం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 21న మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ప్రాంగణంలో జరిగే ఈ పోటీల్లో 5 నుంచి 10 తరగతుల వరకు ఒక విభాగంగా, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీలు ఒక విభాగంగా పోటీలు నిర్వహిస్తారని తెలిపింది. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్స్ నుంచి అనుమతి పత్రంతో పాటు పేరు, తరగతి, ఫోన్ నెంబరు, పాఠశాల/ కళాశాల సంబంధ ఉపాధ్యాయుల ఫోన్ నెంబరుతో, ఒక పాఠశాల/ కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు రావాలి. ప్రాచీన పద్యకవులు, శతక కవులు రాసిన రెండు పద్యాలు ఉచ్చారణ దోషాలు లేకుండా రాగయుక్తంగా పాడి భావాన్ని తెలపాలి. పద్యాలాపనకు నిర్దిష్ట సమయం లేదు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 లోగా హెచ్‌టీటీపీఎస్://ఎఫ్‌వోఆర్‌ఎంఎస్.జీఎల్‌ఈ/ఈ ఎక్స్/312క్యూఎస్‌టీ7జె6జెడ్‌క్యూజే(క్యాపిటల్)వై ఎక్స్‌పె లింక్‌లో నమోదు చేసుకోవాలని తెలిపింది.

నిత్యావసర సరుకులు అందజేత

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 17 : జనసేన పార్టీ పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్ కుమార్తె పోతిన చంద్రకీర్తి శనివారం 55వ డివిజన్‌లో పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ మేరకు కాలేజీ ఫీజు నిమిత్తం పిళ్లా అచ్యుతరావుకు రూ.7,000 అందజేశారు. కంసాలిపేటలో అకాల మరణం చెందిన కుటుంబానికి రూ.4,000 అందజేశారు. కంసాలిపేటలోని నాలుగు కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్‌లను అందజేశారు.

రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పోతిన చంద్రకీర్తి తెలియజేశారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు సోమీ గోవింద్, నాయకులు సలాం, నోచర్ల పవన్ కల్యాణ్, సోమీ మహేష్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం మతతత్వ పార్టీలను ఓడించాలి

● బహుజన పార్టీల జేఏసీ

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 17: బహుజనులకు రాజ్యాధికారం కావాలంటే మతతత్వ పార్టీలను ఓడించాలని బహుజన పార్టీల జేఏసీ కన్వీనర్ జైభీమ్ నాగేశ్వరరావు అన్నారు. శనివారం బహుజన రాజకీయ పార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బందరు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం వరకు మార్చ్ టు స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బహుజనులు రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. రాజ్యాధికారం కోసం బహుజనులు రానున్న ఎన్నికల్లో బీజేపీ దాని అనుబంధ పార్టీలైన టీడీపీ, వైసీపీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా ప్రజాపార్టీ నేత శ్యామ్‌ప్రసాద్, ఆల్ తెలుగు ప్రజాపార్టీ నేత నమ్మి అప్పారావు, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా అబ్దుల్ సత్తార్, జై భీమ్ పార్టీ నేత పి.చర్చిల్, బహుజన రాష్ట్రీయ సమితి నేత డి.పెద్దన్న పాల్గొన్నారు.



అంబేడ్కర్ స్మృతివనం వద్ద నినాదాలు చేస్తున్న బహుజన రాజకీయ పార్టీల ఐక్యవేదిక నేతలు

దాసాంజనేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ప్రారంభం



పూజాధికాలు నిర్వహిస్తున్న అర్చకులు, నిర్వాహకులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 17: కేబీఎన్ కాలేజీలో దాసాంజనేయ స్వామి విగ్రహపునః ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు గోపూజ, గణపతి పూజలు మొదలు కొని మూల మంత్ర హోమాలు, మంటప దేవతా హోమాలు, జలాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు తదితరులు హోమాది పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

భవానీపురం, ఫిబ్రవరి 17: కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ ఊర్మిళానగర్ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు ఊర్మిళానగర్, ఏకలవ్యనగర్, నులకపేట, జోజినగర్, చర్చిసెంటర్, పోలేరమ్మగుడి పరిసర ప్రాంతం, రెడ్డికాలనీ,సీతారెడ్డి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

మధురానగర్ ఆర్‌యూబీ పనులు ఈ నెలాఖరుకు పూర్తి

మధురానగర్, ఫిబ్రవరి 17: మధురానగర్ ఆర్‌యూబీ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. శనివారం నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ రాయన భాగ్యలక్ష్మిలతో ఆయన ఆర్‌యూబీ పనులను పరిశీలించారు. డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్‌లు, వీఎంసీ సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న కె. విజయ, పక్కన ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 17 : బాల్య వివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వాసవ్య మహిళా మండలి వైస్ ప్రెసిడెంట్ కె. విజయ అన్నారు. వాసవ్య మహిళా మండలి విజయవాడ వారిచే స్థానిక వించిపేటలోని శ్రీవిద్యాంజలి హైస్కూల్ బ్రాంచ్ క్యూట్ కిడ్స్ ప్యారడైజ్ ప్లేస్కూల్‌లో ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు విద్యార్థులకు మానసిక, ఆరోగ్య అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంలో విద్యార్థులకు మానసిక, భౌతిక ఆరోగ్యం పట్ల ఏ విధంగా జాగ్రత్తలు పాటించాలో వివరించారు. విద్యార్థులు వయసు పెరిగేకొద్ది ఎటువంటి మార్పులు వస్తాయో, ఆ మార్పులను అర్థం చేసుకుని, ప్రవర్తించే విధానాన్ని వివరించారు. వాసవ్య మహిళా మండలి కౌన్సిలర్ కె. సునీత మాట్లాడుతూ బాల్య వివాహాల వలన వచ్చే సామాజిక సమస్యలు, ఆరోగ్య సమస్యలను వివరించారు. సంఘ సేవకురాలు మార్గరేట్, జ్యోత్స్న, షాలిని, సుధీర్ కుమార్, ప్రసన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతి స్కూల్ వార్షికోత్సవం

విద్యాధరపురం, ఫిబ్రవరి 17: విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని విజయవాడ రవీంద్రభారతి స్కూల్ జాబిల్లి క్యాంపస్‌లో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. న్యూరాలాజిస్ట్ డి.పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని సందేశమిచ్చారు. విద్యార్థులకు కళలు భవిష్యత్తు ఎదుగుదలకు దోహదం చేస్తాయని చెప్పారు. పాఠశాల ఛైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, జనరల్ మేనేజర్ రాజేష్, జోనల్ హెడ్స్ సరళ, రమేష్, ప్రిన్సిపాల్ సునీత విశ్వం, అకడమిక్ ఆఫీసర్ ప్రియ తదితరులు తమ పిల్లల ప్రతిభ పాటవాలను, తల్లిదండ్రులు ఇస్తున్న సహకారాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా చిన్నారులు నాట్య ప్రదర్శనతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దిక్సూచి DIKSUCHI



ఐఐటీ జోధ్‌పూర్

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజే)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఎస్ఎంఈ)- 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ని రెండు మోడ్‌లలో నిర్వహిస్తున్నారు. మొదటి మోడ్ ప్రకారం- ప్రోగ్రామ్ మొదటి ఏడాది కోర్సుని ఐఐటీజేలోను, రెండో ఏడాది కోర్సును యూఎస్ఏలోని ఎస్‌యూఎన్‌వై అల్బేనీలో చదువుకోవచ్చు. అల్బేనీ విద్యార్థులకు 5000 డాలర్ల స్కాలర్‌షిప్, మూడేళ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు అనుమతిస్తూ ఎఫ్-1 స్టూడెంట్ వీసా, అల్బేనీ అసిస్టెంట్‌షిప్ అందిస్తారు. ఈ మోడ్‌లో చదివిన వారికి ఐఐటీజే నుంచి 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' డిగ్రీ, ఎస్‌యూఎన్‌వై అల్బేనీ నుంచి 'ఎంఎస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్' డిగ్రీ లభిస్తాయి. రెండో మోడ్ ప్రకారం ప్రోగ్రామ్ రెండేళ్లూ ఐఐటీజేలోనే చదువుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఎంటెక్ అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ అభ్యర్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులందరికీ దరఖాస్తు నాటికి ఐటీ/బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్/ఇన్సూరెన్స్/సైబర్‌సెక్యూరిటీ తదితర విభాగాల్లో కనీసం రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. ఇంటర్న్‌షిప్‌లు; కోచింగ్ సెంటర్లు, స్మాల్ స్కేల్ బిజినెస్ సంస్థలు, రిటైల్ స్టోర్స్, కిరాణా స్టోర్స్, ఎన్‌జీఓ సంస్థలు, పెట్రోల్ పంప్ సంస్థలు, గ్యాస్ స్టేషన్‌లలో పనిచేయడాన్ని అనుభవం కింద పరిగణించరు.

ఎంపిక: క్యాట్ 2023/గేట్/జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్/అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ స్కోర్, అనుభవం, జెండర్ డైవర్సిటీ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** iitj.ac.in

ఐఐటీ మండీ

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎస్ఓఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: రెండు కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొదటి కేటగిరీ అడ్మిషన్స్‌కు సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం మార్కులు ఉండాలి. వీరికి క్యాట్ వ్యాలిడ్ స్కోర్ అవసరం లేదు. రెండో కేటగిరీ అడ్మిషన్స్‌కు ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. రెండు కేటగిరీలకు చెందిన అభ్యర్థులూ ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారికి మొదటి కేటగిరీ కింద ప్రవేశాలు కల్పిస్తారు. ఎన్ఆర్ఐ, విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ 2023 స్కోర్ ఉండాలి.

ఎంపిక: మొదటి కేటగిరీ అభ్యర్థులను అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా; రెండో కేటగిరీ అభ్యర్థులను క్యాట్ 2023 స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సెలెక్షన్ కమిటీ నిర్ణయం ప్రకారం ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ అండ్ డిజైన్

ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ(ఏడబ్ల్యూఈఎస్) బెంగళూరులో నిర్వహిస్తున్న ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ డిజైన్(ఏఐఎఫ్‌డీ)- బీఎస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫ్యాషన్ అండ్ అప్పారెల్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకరేషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌ని ఆర్మీ విభాగాలకు చెందిన ఉద్యోగులు/విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకించారు. రిటెన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండో తరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల్లో ఒకరికి ఆర్మీ ఉద్యోగిగా కనీసం పదేళ్ల సర్వీస్ ఉండాలి.

రిటెన్ అడ్మిషన్ టెస్ట్: దీనిని మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ టెస్ట్, జనరల్ అవేర్‌నెస్ టెస్ట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంపిటెన్సీ అండ్ కాంప్రహెన్షన్ టెస్ట్ ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** aifd.edu.in

ఐఐపీలో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్



చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్(సీపీఈ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుకు ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ (ఏపీఎఫ్) సహకారం అందిస్తోంది. ఇందులో ప్రధానాంశం 'ప్యాకేజింగ్'. ఇంజనీర్లకు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌ను జూలై నుంచి అక్టోబరు వరకు, రెండో సెమిస్టర్‌ను నవంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు, మూడో సెమిస్టర్‌ను వచ్చే ఏడాది మార్చి నుంచి జూన్ వరకు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో కాంటాక్ట్ క్లాసెస్ ఉంటాయి. ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్ నిర్వహిస్తారు. వీటి కోసం అభ్యర్థులు చెన్నై సెంటర్‌లో హాజరు కావాల్సి ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ విజిట్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో నాలుగు నెలల పాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రతి సెమిస్టర్ చివరలో ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం, మొత్తమ్మీద 50 శాతం మార్కులు ఉంటేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆటోమొబైల్ సంస్థలు, టెక్స్‌టైల్ హబ్‌లు, ఫైర్‌వర్క్స్ ఇండస్ట్రీలు, ఎఫ్ఎంసీజీ మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రింటింగ్ టెక్నాలజీ/ప్యాకేజింగ్ టెక్నాలజీ/పాలిమర్ ఇంజనీరింగ్/పాలిమర్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ టెక్నాలజీ/పేపర్ ఇంజనీరింగ్/పేపర్ టెక్నాలజీ/ప్లాస్టిక్స్ టెక్నాలజీ/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇతర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ప్యాకేజింగ్‌పై ఆసక్తి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.83,190
- **అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సిన సెమిస్టర్ ఫీజు:** రూ.35,990
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500+18% జీఎస్‌టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కాంటాక్ట్ క్లాసెస్ సెంటర్లు:** ముంబై, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్
- **వెబ్‌సైట్:** www.iip-in.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8yMEdJCలో చదవండి.

ఏఆర్‌వో విశాఖపట్నం పరిధిలో అగ్నివీరులు



విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్.. అగ్నిపథ్ పథకం కింద 2024-25 సంవత్సరం నియామకాలకు సంబంధించి అగ్నివీరుల ఎంపిక కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ నియామకాలకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు.

కేటగిరీలు:

1. అగ్నివీర్ జనరల్ డ్యూటీ(ఆల్ ఆర్మ్స్)
2. అగ్నివీర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
3. అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
4. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(టెన్త్ పాస్)(ఆల్ ఆర్మ్స్)
5. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత) (ఆల్ ఆర్మ్స్)

వయోపరిమితి: 17 1/2 - 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి 2003 అక్టోబరు 1 నుంచి 2007 ఏప్రిల్ మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి/మెట్రిక్యులేషన్, 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ లేదా ఆర్ట్స్, కామర్స్, సైన్స్), సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎత్తు(సెం.మీ.లలో): అగ్నివీర్ జీడీ/ట్రేడ్స్‌మన్-166, అగ్నివీర్ టెక్నికల్-165, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్-162.

ఛాతీ కొలత: గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ విస్తరణతో 77 సెం.మీ. ఉండాలి


పరీక్ష ఫీజు: రూ.250

రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 22

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: ఏప్రిల్ 22

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

శివరాత్రికి సిద్ధం



గోపీచంద్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8న విడుదల కానుంది. 'మరో ఇరవై రోజుల్లో..' అని పేర్కొంటూ శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఫైటింగ్‌కు సిద్ధం అన్నట్లు పోలీస్ యూనిఫామ్‌లో గోపీచంద్ కన్పిస్తున్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రియా భవానీశంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు.

మున్నార్‌లో ముగించారు



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం మున్నార్‌లో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తాజా షెడ్యూల్‌లో చిత్రబృందం పాల్గొనగా కీలకఘట్టాలను తెరకెక్కించారు. టాకీపార్ట్‌తో పాటు నితిన్, ఫైటర్స్‌పై భారీ యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించనున్నట్లు యూనిట్ తెలిపింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నితిన్ సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

అమరన్‌గా శివ కార్తికేయన్



తమిళ హీరో శివ కార్తికేయన్ హీరోగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న చిత్రానికి 'అమరన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. శనివారం శివ కార్తికేయన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఆర్మీ మేజర్ ముకుందవరదరాజన్ జీవితం ఆధారంగా రాహుల్ సింగ్, శివ్ అరూర్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్ లెస్' సిరీస్‌లోని ఓ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉంది. వేసవిలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి

గ్రామీణ ప్రేమకథ



ప్రేమకు అర్థం చెబుతూ రూపొందిన 'రాధామాధవం' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించారు. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ ఈ సినిమాను నిర్మించారు. 'మా సినిమా సెన్సార్ పూర్తయింది. గ్రామీణ నేపథ్యంలో నిర్మించిన చక్కని సందేశాత్మక చిత్రమని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ సాంగ్, టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన వచ్చింది. సినిమాపై నమ్మకం పెరిగింది. మార్చి ఒకటిన ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని చెప్పారు నిర్మాత. వసంత్ వెంకట్ బాలా కథ, మాటలు, పాటలు అందించిన ఈ చిత్రానికి సతీశ్ లైన్ ప్రొడ్యూసర్

ఒకే పాత్ర.. సామాజిక సందేశం



ఒకే పాత్రతో సామాజిక సందేశంతో రూపొందిన చిత్రం 'నేటి భారతం'. భరత్ పారేపల్లి దర్శకత్వంలో డాక్టర్ యర్రా శ్రీధర్ రాజు నటిస్తూ ఈ సినిమాను నిర్మించారు. త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ విడుదల చేశారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత సాంబేష్ మాట్లాడుతూ 'మంచి సినిమాలు చేయాలని శ్రీధర్ రాజు పరిశ్రమకు వచ్చారు. మొదటి 'మేరా భారత్ మహాన్' సినిమా తీశారు. ఇప్పుడు ఒకే పాత్రతో 'నేటి భారతం' తీశారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని ఈ సినిమా ద్వారా చూపించాం' అని చెప్పారు. కరోనా తర్వాత వచ్చిన ఆర్థిక, సామాజిక స్థితిగతులపై ఈ సినిమా ఉంటుందని నిర్మాత, నటుడు శ్రీధర్ రాజు చెప్పారు. ఇందులో తను జర్నలిస్ట్ పాత్రను పోషించినట్లు తెలిపారు. జర్నలిస్టు అంకిత భావం, తెగింపు ఇందులో చూపించామని చెప్పారు.

టీనేజ్ లవ్ స్టోరీ



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రూపుదిద్దుకున్న చిత్రం 'మధురం2. రాజేశ్ చికిలే దర్శకత్వంలో యం. బంగార్రాజు ఈ సినిమా నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. దర్శకుడు చిత్రం గురించి వివరిస్తూ '1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, ఎలా ఉండేవో చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత బంగార్రాజు మాట్లాడుతూ 'కొత్తదనం ఉన్న కథల్ని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. మా సినిమా కూడా కొత్తగా, నేటి తరానికి కనెక్ట్ అయ్యే విధంగా ఉంటుంది. హైదరాబాద్, పాలకొల్లు, ఆచంట, సిద్ధాంతం, రావులపాలెం , కోనసీమ ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

అరుదైన వ్యాధితో 'దంగల్' నటి మరణం




ఆమిర్ ఖాన్ నటించిన 'దంగల్'(2016)లో బబిత పాత్రలో నటించిన బాలనటి సుహానీ భట్నాగర్ అరుదైన వ్యాధితో శుక్రవారం కన్నుమూసింది. ఆమె వయసు 19 ఏళ్లు. సుహానీ డెర్మటోమయోసైటీస్ అనే అరుదైన వ్యాధితో బాధ పడుతోంది. స్టెరాయిడ్స్ ఇవ్వడమే దీనికి చికిత్స. కండరాలను బలహీన పరచడం, శరీరంపై రాష్ రావడం ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి తగ్గడానికి చాలా సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. వారి సూచన మేరకు స్టెరాయిడ్స్ తీసుకున్నా, ఆమె లేత శరీరం దానికి తట్టుకోలేక పోయింది. దానికి తోడు ఇన్‌ఫెక్షన్ వచ్చి , లంగ్స్‌లోకి నీరు చేరడంతో సుహానికి శ్వాస తీసుకోవడం కష్టమైంది. అలా బాధ పడుతూనే చివరకు శుక్రవారం సాయంత్రం ఆమె కన్నుమూసిందని సుహానీ తండ్రి పునీత్ సజల నయనాలతో చెప్పారు. 'దంగల్'లో నటించిన తర్వాత కొన్ని యాడ్ ఫిల్మ్‌లో సుహాని నటించింది. 2019లో ఆమె నటనకు దూరం జరిగి చదువు మీద దృష్టి పెట్టింది. ప్రస్తుతం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ చదువుతోంది. సోషల్ మీడియాకు దూరంగా ఉండే సుహాని చదువు పూర్తయ్యాక మళ్లీ సినిమాల్లో నటించాలనుకుందనీ, అంతలోనే ఇలా జరగడం చూసి తట్టుకోలేక పోతున్నామని ఆమె తల్లి పూజ చెబుతూ ఎమోషనల్ అయ్యారు.

భరద్వాజీయం



ఇప్పుడు నిర్మాతకు విలువ లేదు

అప్పటితో పోలిస్తే ఇప్పుడు సినీ పరిశ్రమలో వచ్చిన మార్పులు ఏమిటని కొందరు అడుగుతూ ఉంటారు. అప్పట్లో నిర్మాత సర్వస్వతంత్రుడు. తనకు కావల్సిన హీరోను, నచ్చిన దర్శకుణ్ణి, ఇతర టెక్నీషియన్లను పెట్టుకునేవాడు. ఉదాహరణకు మా నాన్న తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారు సినిమాలు తీసే రోజుల్లో వి.మధుసూదన రావు గారు ఆయనకు రెగ్యులర్ డైరెక్టర్. ఆయనతో 'లక్షాధికారి', 'జమీందార్' చిత్రాలు చేశారు. మూడో చిత్రం 'బంగారు గాజులు'కు కూడా మధుసూదనరావు గారినే దర్శకుడిగా అనుకున్నారు. అయితే వేరే వర్క్‌లో బిజీగా ఉండటంవల్ల అను కొంటా.. మధుసూదనరావు గారు స్క్రిప్ట్ చర్చల్లో పాల్గొనలేకపోయారు. నాన్నగారు కోరిన సమయం ఆయన కేటాయించలేకపోయారు. దాంతో నాన్నగారు అక్కినేని నాగేశ్వరరావు గారికి చెప్పి మధుసూదనరావు గారిని మార్చేశారు. సీఎస్‌రావు గారిని దర్శకుడిగా పెట్టుకుని 'బంగారు గాజులు' పూర్తి చేశారు. నాడు నిర్మాతలు హీరోలతో అంత స్నేహపూర్వకంగానూ ఉండేవారు. అదే సమయంలో అంత బలం గానూ నిలబడగలిగేవారు.



ఇవాళ పరిస్థితి ఏమిటంటే ఒక హీరో దగ్గరకు వెళ్లి ఫలానా దర్శకుడితో సినిమా చేద్దామని చెబితే- ఎంత కాలమైన అక్కడ పడివుండాల్సిందే. అతన్ని మార్చుకొనే అధికారం, స్వాతంత్ర్యం పెద్దగా ఉండదు. వాళ్లు తేలుస్తారా? తేల్చరా? హీరో నాటకాలాడుతున్నాడా? దర్శకుడు ఆడుతున్నాడా? అనేది కూడా తెలియని పరిస్థితి. అంతేకాకుండా హీరోతో ఎలాంటి కథ తీయాలనే విషయంపై నిర్మాతకు ఒక ఆలోచన ఉంటుంది. ఎందుకంటే అతను డబ్బు పెడుతున్నాడు కాబట్టి. రిస్క్ చేయకూడదనుకుంటాడు కాబట్టి. కానీ ప్రస్తుతం నిర్మాతకు అలాంటి స్వేచ్ఛ లేదు. కథను నమ్ముకున్న సినిమాలకైతే కొంత వరకు ఆ స్వేచ్ఛ ఉంటోంది. పెద్ద సినిమాలు- నిర్మాత నియంత్రణలో ఉండటం లేదు.

మొన్న టీవీ చూస్తుంటే- ఒకప్పుడు తీసిన సినిమాను ప్రస్తుతం తీస్తే ఎంత అవుతుందనే తులనాత్మక అధ్యయనం చేసిన ఒక వార్త కనిపించింది. అంటే 'ప్రొడక్షన్ కాస్ట్ పెంచుకొంటూ వెళుతున్నాం 'అని చెప్పినట్లే కదా! నాకు తెలిసి అప్పటికీ ఇప్పటికీ కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ పెద్దగా ఏమీ పెరగలేదు. మారిన రూపాయి విలువతో పాటు పెరిగిన వ్యయమే తప్ప వేరే కారణం లేదు. ఇప్పుడు సినిమాకు థియేటర్ల నుంచి వచ్చే ఆదాయంతో పాటుగా- శాటిలైట్, ఓటీటీలు, ఓవర్సీస్‌లు, హిందీ డబ్బింగ్లాంటి కొత్త మార్కెట్లు వచ్చాయి. దీనితో నిర్మాతకు అనేక అవకాశాలు లభిస్తున్నాయి. అంతే కాకుండా థియేట్రికల్‌గా మన దగ్గర రూపాయి రాకపోయినా ముంబయి మార్కెట్ మీద ఆధారపడి కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ కూడా పెంచుకొంటూ పోయారు. దాంతో వాళ్లు ఫలానా దర్శకుడిని పెట్టండి, ఫలానా నటులను పెట్టండని నిర్దేశిస్తున్నారు. వీటన్నిటి కారణంగా సినిమా మీద ప్రేమ కన్నా డబ్బు, పేరు వస్తున్నాయి కాబట్టి... నిర్మాత అవ్వాలనుకొనేవారు ఎక్కువైపోయారు. ఫలితంగా హీరోలు, దర్శకుల మీద ఆధారపడి, వాళ్లు ఏదంటే అది చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడు హీరోలు, దర్శకులు ఏ స్థాయికి వెళ్లారంటే... సినిమా మధ్యలో నిర్మాతను కూడా మార్చేస్తున్నారు. ఎందుకంటే ఆ 'మధ్యవర్తులు ఉంటారు. వాళ్లు అమ్మిపెడతారు. నువ్వు ఉంటే ఉండు. పోతే పో' అని నిర్మాతకు తెగేసి చెప్పే పరిస్థితులు వచ్చేశాయి. ఇవాళ చాలా సినిమాలు థియేట్రికల్‌గా కాకుండా ఓటీటీ మీదో, డబ్బింగ్ రైట్స్ మీదో ఆధారపడి తీస్తున్నవే. దాంతో హీరో, దర్శకుల మీద ఆధారపడి సినిమాలు చేసేస్తున్నాం. చివరకు నిర్మాత అనేవాడికి ఒక విలువ లేకుండా పోయింది. నిర్మాతను నిర్మాతగా చూడకపోవడం ఇప్పుడు నడుస్తున్న ట్రెండ్. అందరూ అలా ఉన్నారని నేను అనను. నిర్మాతలను గౌరవంగా చూసుకొనే హీరోలూ ఉన్నారు. పూర్వం కూడా హీరోకు, నిర్మాతకు మధ్య వివాదాలు వచ్చిన చిత్రాలు చాలా ఉన్నాయి. నిర్మాతను లోపలకు రావద్దంటే... హీరో గారికి కనపడకుండా తిరుగుతూ సినిమా పూర్తి చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎందుకంటే.. 'ముల్లు మీద ఆకు పడ్డా... ఆకు మీద ముల్లుపడ్డా నష్టం ఆకుకే' అన్న చందంగా... నిర్మాత డబ్బు పెట్టాడు కాబట్టి, అలా జాగ్రత్తపడేవాడు. అలా నాకు తెలిసినవే నాలుగైదు చిత్రాలున్నాయి. ఇప్పుడైతే... 'మీరు పోతే వేరేవాళ్లు చేస్తారు లేండి. ప్రొడక్షన్ హౌస్‌ను మార్చేద్దాం' అనే స్థాయికి వచ్చేశారు హీరోలు. అన్‌ప్రొఫెషనల్‌గా తయారైపోయింది సినిమా నిర్మాణం. అప్పుడు ప్రొఫెషనల్‌గా ఉండేది. నిర్మాతకు గౌరవం ఉండేది. అంతిమంగా సినిమాకు గౌరవం దక్కేది. నిజానికి ఇప్పుడు సినిమాను గౌరవించడంలేదు.

రెవెన్యూ పెరుగుతుందని రెమ్యూనరేషన్ పెంచాం. పెంచుకోవడంలో తప్పులేదు. కానీ ఒకవేళ సినిమా ఆడకపోతే ఏంచేస్తారు? నిన్న వంద కోట్లకు తీశారు. ఇవాళ కూడా వంద కోట్లకే తీయండి. పోయిన చిత్రం మూడొందల కోట్లు వసూలు చేసింది. తరువాతది వెయ్యి కోట్లు బిజినెస్ చేయవచ్చేమో. లాభాల్లో పర్సెంటేజ్ పెట్టుకున్నారనుకోండి... మీకు రెండొందల కోట్లు రెమ్యూనరేషన్ వచ్చినట్టే కదా. దీనివల్ల సినిమాను విజయవంతం చేసే బాధ్యత అందరిపైనా ఉంటుంది. సినిమా బాగా వస్తే మంచి ఆదరణ లభిస్తుంది. డబ్బు కూడా ఎక్కువ కనిపిస్తుంది. మరో సినిమా నిర్మించడానికి నిర్మాతకు కూడా ప్రోత్సాహకరంగా ఉంటుందనేది నా అభిప్రాయం.

• **తమ్మారెడ్డి భరద్వాజ**, దర్శకనిర్మాత

ఫుడ్ ఫ్యాక్ట్

తోలులోనూ పోషకాలు

కొన్ని కూరగాయలు, పండ్లను తొక్కు తీయకుండానే తినాలి. తొక్కులో ఉండే పోషకాలను నష్టపోకుండా ఉండడం కోసం వాటిని తొక్కుతో సహా తినడం అలవాటు చేసుకోవాలి. ఇంతకూ ఆ పండ్లు, కూరగాయలు ఏవంటే...

జుకిని: సలాడ్ కోసం ఉపయోగించే జుకిని తొక్కలో యాంటీఆక్సిడెంట్లు, పీచు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి పచ్చిగా తినాలనుకున్నా, ఉడికించాలనుకున్నా దీన్ని అలాగే నేరుగా వాడుకోవాలి.

పియర్స్, యాపిల్స్: ఈ పండ్ల తొక్కల్లో పీచు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. కాబట్టి వీటిని కూడా శుభ్రంగా కడిగి, అలాగే తినేయాలి.



క్యారెట్లు, బంగాళాదుంపలు: వీటి తొక్కులో పొటాషియం, పీచు ఉంటాయి. కాబట్టి వీటిని బాగా శుభ్రం చేసి అలాగే వండుకోవాలి.

కీరా: కీరాలో తోలులో పీచు, విటమిన్ కె, ఖనిజ లవణాలు ఉంటాయి. కాబట్టి కీరాను తోలు తీయకుండానే తినాలి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LLtpvTi లో చదవండి.

అందాల పోటీల్లో విజయం సాధించి సినీ రంగ ప్రవేశం చేసిన ఐశ్వర్యరాయ్, సుస్మితాసేన్ కోవకు చెందిన నటి **మానుషి చిల్లర్**. 2017లో 'మిస్ వరల్డ్'గా ఎంపికైన మానుషి... తాజాగా 'ఆపరేషన్ వాలెంటైన్' ద్వారా తెలుగు చిత్రసీమలోకి ప్రవేశించింది. మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన తాను హీరోయిన్ ఎలా అయిందో 'నవ్య'కు వివరించింది.



నేను లక్కీ గర్ల్..!

'మిస్ వరల్డ్' నుంచి 'ఆపరేషన్ వాలెంటైన్' దాకా ప్రయాణం ఎలా సాగుతోంది?

చాలా బావుంది. ఇప్పటికి నేను హిందీలో రెండు సినిమాలు చేశా. ఇది మూడో సినిమా. కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటున్నా. ప్రయాణం చాలా అడ్వెంచరస్‌గా సాగుతోంది.

మీకు ఏ తరహా సినిమాలు ఇష్టం?

నా చిన్నప్పుడు ఇంట్లో అందరం కలిసి సినిమాలు చూసేవాళ్లం. సినిమాకు వెళ్తే కుటుంబం అందరం కలిసే వెళ్లేవాళ్లం. నా ఉద్దేశంలో సినిమా అంటే కుటుంబం మొత్తం చూసేలా ఉండాలి. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రేక్షకులకు ఒక మంచి సినిమా చూశామనే అనుభూతి కలగాలి. కొన్ని సినిమాలు సింగిల్ డైమన్షనల్‌గా ఉంటాయి. కానీ నా ఉద్దేశంలో సినిమాలో రొమాన్స్, యాక్షన్, కామెడీ అన్నీ కలిపి ఉండాలి. ఇక నాకు నచ్చిన సినిమాలంటారా... చాలానే ఉన్నాయి. చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే పిచ్చి. అన్ని సినిమాలూ చూసేదాన్ని. నాకు రొమాన్స్ సినిమాలంటే చాలా ఇష్టం. 'దిల్‌తో పాగల్‌హై' ఎన్నిసార్లు చూశానో తెలియదు. దర్శకుడు ప్రియదర్శన్ తీసే సిట్యువేషనల్ కామెడీలంటే ఇష్టం. రాజమౌళి ఫాంటసీ ఇష్టం. చైనీయుల యాక్షన్ ఫిల్మ్స్ అంటే ఇష్టం. 'లిటిల్ ఉమెన్' అనే ఒక సినిమా వచ్చింది. దానిని ఎన్నిసార్లు చూశానో నాకే తెలియదు. అంత నచ్చింది ఆ చిత్రం.

మీ బాల్యం ఎలా గడిచింది?

మా అమ్మ, నాన్న.. ఇద్దరూ డాక్టర్లే. నాన్న రక్షణ శాఖలో పని చేసేవారు. ఏడేళ్ల దాకా బెంగుళూరులో పెరిగాను. ఆ తర్వాత ఢిల్లీ వెళ్లిపోయాం. మాది ఒక ఎగువ మధ్యతరగతి కుటుంబం. నాకు చెల్లి, తమ్ముడు ఉన్నారు. చిన్నప్పటి నుంచి అమ్మానాన్న మమ్మల్ని బాగా చదువుకోమని చెబుతూ ఉండేవారు. నా స్నేహితులందరూ ఇంజినీరింగ్ గురించి.. మెడిసిన్ గురించి మాట్లాడుకుంటూ ఉండేవారు. నేను కూడా బాగా చదువుకొని మెడిసిన్‌లో చేరా. రెండేళ్లు చదివా. ఆ సమయంలోనే 'మిస్ వరల్డ్' గెలుచుకున్నా. ఒక ఏడాది ఆ కార్యక్రమాల్లో పాల్గొన్నా. ఆ తర్వాత సినీరంగంలోకి వచ్చేశా.

మీ కుటుంబంలో అందరూ చదువరులు కదా! మీరు ఈ గ్లామర్ రంగంలోకి ఎలా వచ్చారు?

అవును. నేను కూడా బాగా చదివేదాన్ని. కానీ పరీక్షల ముందు మాత్రమే చదివేదాన్ని. మిగిలిన సమయాల్లో డ్యాన్స్ పెయింటింగ్ కాంపిటీషన్స్‌కు వెళ్లేదాన్ని. మా స్కూల్లో కూడా ఇలాంటి కాంపిటీషన్స్‌ను ప్రోత్సహించేవారు. మంచి మార్కులు వచ్చేవి కాబట్టి అమ్మానాన్న ఏమనేవారుకాదు. 15 ఏళ్ల వయస్సులో నాన్న దగ్గరకు వెళ్లి... "నేను డాక్టర్ అవుతా" అన్నా. అప్పుడు నాన్న... "డాక్టర్ అవ్వాలంటే



కష్టపడి చదవాలి. హాబీలంటూ తిరిగితే కష్టం" అని చెప్పారు. దాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నా. ఎంబీబీఎస్‌లో చేరా! ఇక్కడ నేను చెప్పదలుచుకున్నదేమిటంటే.. నేను ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవటానికి ఇష్టపడతాను. దానిని ఒక ఛాలెంజ్‌గా తీసుకుంటాను.

ముందు అందాల పోటీలు.. ఇప్పుడు సినిమాలు.. ఇవి కూడా అంతేనా?

అవును. నేను ఎప్పుడూ 'మిస్ వరల్డ్' అవుతానని అనుకోలేదు. 'మిస్ ఇండియా' అవుతానని కూడా అనుకోలేదు. ఎవరితోనైనా చెబితే నమ్మరు కానీ... 'మిస్ ఇండియా' పోటీల ముందు రోజు విపరీతమైన టెన్షన్ పడ్డాను. కళ్లజోడు పెట్టుకొని నైట్ డ్రెస్‌లో పుస్తకం పట్టుకొని కూర్చున్నా. 'మిస్ ఇండియా' ఫైనలిస్టునంటే ఎవ్వరూ నమ్మరు కూడా. ఒకవేళ పోటీలో ఓడిపోతే? కాలేజీ అటెండెన్స్ ఎలా? అని ఆలోచిస్తూ కూర్చున్నా. 'మిస్ ఇండియా' పోటీల్లో గెలిచిన తర్వాత రెండున్నర నెలలకు 'మిస్ వరల్డ్' పోటీలు జరిగాయి. ఆ రెండున్నర నెలల్లో చాలా నేర్చుకున్నా. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చా. ఇప్పుడూ నేర్చుకొంటున్నా. " హీరోయిన్ అవుతానని చిన్నప్పుడే తెలిస్తే.. ముందే అన్నీ నేర్చుకొనేదాన్ని కదా" అని అప్పుడప్పుడు అనుకుంటూ ఉంటా. ఒక విధంగా చూస్తే నేను చాలా లక్కీ గర్ల్. అదృష్టం కలిసిరాకపోతే ఇవన్నీ సాధించటం కష్టమే!

మీ జీవితంలో మీకు లభించిన అతి గొప్ప కాంప్లిమెంట్..?

'ఆపరేషన్ వాలెంటైన్' టీజర్ విడుదలయిన తర్వాత నాన్న... 'లైఫ్ ఈజ్ వాట్ యూ మేకిట్' అన్నారు. నా జీవితంలో నేను ఆ సిద్ధాంతాన్నే నమ్ముతాను. మనకు అవకాశాలు వస్తూనే ఉంటాయి. వాటిని ఎలా వాడుకుంటామనే విషయంపైనే మొత్తం ఆధారపడి ఉంటుంది. అమ్మానాన్న మాకు ఎప్పుడూ అదే చెప్పేవారు. "నీ జీవితం ఎలా బతుకుతావన్నది నీ ఇష్టం. నీకు మేము కేవలం సాయం మాత్రమే చేయగలం" అనేవారు. మొదట్లో నాకు ఈ వాక్యాలు అర్థం కాలేదు. ఇప్పుడు నెమ్మదిగా అర్థమవుతున్నాయి.

మీ ఇంట్లో చాలా మంది రక్షణ దళాల్లో పనిచేశారు కదా.. 'ఆపరేషన్ వాలెంటైన్' షూటింగ్‌లో ఎలా అనిపించింది?

మా అంకుల్స్ ఆర్మీలో ఉండేవారు. గతంలో ఆర్మీ నేపథ్యంలో వచ్చిన సినిమాలను అందరం కలిసి చూసేవాళ్లం. ఆ సినిమాలు వాస్తవికంగా ఉండేవి కాదు. దాంతో మా అంకుల్స్‌కు నచ్చేవి కావు. నాన్న కూడా రక్షణ శాఖలోనే పనిచేస్తూ ఉండటం వల్ల అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయో నాకు తెలుసు. అయితే ఈ సినిమాలో నేను రాడార్ కంట్రోలర్ పాత్రలో నటించా. షూటింగ్ జరుగుతున్న సమయంలో మాతో పాటు ఒక లేడీ రాడార్ కంట్రోలర్ ఉండేవారు. ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో వివరించేవారు. ఈ సినిమా తర్వాత నాకు రక్షణ దళాలలో ఉన్నవారిపై గౌరవం మరింత పెరిగింది. ఇలాంటి పాత్రలు అతి తక్కువగా ఉంటాయి. వాటిలో ఒకటి నాకు రావటం చాలా ఆనందంగా అనిపిస్తోంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఆ పాట 'అర్ధరాత్రి' పుట్టింది



తెలుగువారి సంస్కృతిని... ఒరవడిని ఒడిసిపట్టిన కవి సీతారామశాస్త్రి. 1986లో చిత్రరంగ ప్రవేశం చేసిన సీతారామశాస్త్రి... తెలుగు సినిమా గీతాల చరిత్రలో తనదైన ముద్ర వేయగలిగారు. ఆయన సినీ పాటల ప్రస్థానాన్ని ఆకేళ్ల రాఘవేంద్ర 'పాట షికారుకొచ్చింది' పేరిట గ్రంథస్థం చేశారు. దానిలోని కొన్ని ఆసక్తికరమైన భాగాలు...

'గులాబీ' సినిమా స్క్రిప్ట్ ప్రకారం మొదట అనుకున్నది నాలుగు పాటలే. మరో వైపు షూటింగ్ కూడా అయిపోయింది. ఇంకో పది పదిహేను రోజుల్లో రిలీజ్ అనుకున్నారు.

సినిమా బిజినెస్‌కు అప్పుడైనా ఇప్పుడైనా అత్యంత కీలకమైనది ఆడియో మార్కెటింగ్. అప్పట్లో ఆడియో క్యాసెట్లు ఉండేవి. క్యాసెట్‌కు ఏ, బీ అని రెండు సైడ్లు ఉంటాయి. పాలిస్టర్ లాంటి సన్నటి ప్లాస్టిక్ ఫిల్మ్ మీద మేగ్నెటిక్ కోటింగ్ ద్వారా పాటల్ని రికార్డ్ చేస్తారు. దాన్ని టేప్‌రికార్డర్ ద్వారా వింటారు. ఏ సైడ్ ఎంత స్పేస్ ఉంటుందో బీ సైడ్ కూడా అంతే ఉంటుంది. ఒక పక్క మూడు లేదా నాలుగు పాటలు ఉంటే.. ఇంకో పక్క కూడా సరిసమానంగా ఉండాల్సిందే. అందుకే ఆ రోజుల్లో దాదాపు ప్రతి సినిమాకూ కనీసం ఆరు పాటలు ఉండేవి. ఒక పాట తక్కువ అయితే ఓ పాటని రిపీట్ చేసేవారు- తప్పనిసరి పరిస్థితుల్లో!

'గులాబీ' సినిమాకి మరీ బొత్తిగా నాలుగు పాటలే ఉన్నాయి. దాంతో ఆడియో కంపెనీవారు- 'కనీసం అయిదవ పాట అయినా లేదా ఆరు పాటలు ఉండాల్సిందే' అని పట్టుపట్టారు. అలా అయిదవ పాట చేయక తప్పనిసరైంది. కానీ మొత్తం సినిమా షూటింగ్ అయిపోయింది. అందుకని అయిదవ పాటని రికార్డ్ చేయించి, ఆడియో క్యాసెట్‌లో మాత్రమే ఇచ్చి, సినిమాలో మాత్రం నాలుగే ఉంచుదాం అని నిర్మాత ఆర్జీవీ, దర్శకులు కృష్ణవంశీ డిసైడయ్యారు.

అప్పటికే "ఏ రోజైతే నిను చూశానో" పాట మేల్ వాయిస్‌లో ఉంది. ఇదే మాదిరి ట్యూన్‌తో ఫిమేల్ వెర్షన్‌లో ఇంకో పాట చేస్తే- అయిదవ పాటగా జరిగినదంతా ఆయనకు చెప్పి కొంచెం తొందరగా ఇవ్వమని అన్నారు. ఆయన ఒక రాత్రంతా మేలుకొని రాసిన ఆ పాట

"ఈ వేళలో నీవు ఏం చేస్తు ఉంటావో.. అనుకుంటు వుంటాను ప్రతి నిమిషమూ నేను..నడిరేయిలో నీవు.. నీదురైన రానీవు.. గడిపేదెలా కాలము..పగలైనా కాసేపు పని చేసుకోనీవు.. నీ మీదనే ధ్యానము".

కావలిసినవారు ఏ మాత్రం దూరంగా ఉన్నా ఎలా పలకరిస్తామో.. కలవరిస్తామో అలాగే రాశారు. ఒక కన్నె మనసు ప్రియుడి తలపుల్లో ఎలా తల్లడిల్లుతుందో అచ్చం అలాగే ఉందీ పాట.

ఆ పాటని ఎవరి చేత పాడించాలీ అన్న ప్రశ్న ఎదురైంది కృష్ణవంశీకి. ఎందుకంటే అప్పటికే ఆ సినిమాలో శశిప్రీతమ్, సురేష్ పీటర్స్, సుచిత్ర కృష్ణమూర్తి, హరిహరన్, గాయత్రి, మనోలాంటి కొత్త గొంతుకలతో పాడించారు. ఒక్క మనో తప్ప వీళ్లంతా తెలుగువారు కూడా కాదు.

ఇపుడు సినిమాలో కూడా ఉండని ఈ పాటని- పరభాషా గాయనితో పాడించేంత ఖర్చు పెట్టాలా? అందుకని అప్పటికి ఇంకా సింగర్‌గా ఎదగని, కోరస్‌లు మాత్రమే పాడుతూ ఉన్న సునీత ఉపద్రష్ట అనే 17 ఏళ్ల అమ్మాయి చేత పాడించారు. సీతారామశాస్త్రి రెమ్యునరేషన్ కాకుండా- ఈ పాట మొత్తం రికార్డింగ్‌కు అయిన ఖర్చు కేవలం ఏడు వేల రూపాయలే! ఈ నాటికీ ఈ పాట సూపర్‌హిట్.

మూలం ఎక్కడుంది? సీతారామశాస్త్రి అందించిన లిరిక్‌లో ఉంది. మామూలు పాటే కదా అని వదిలేద్దాం అని అనుకోకుండా మనసుపెట్టి మంచి పాట ఇచ్చారు. నిజానికి ఈ పాట సినిమాలో ఉండదని తెలుసు. కేవలం ఆడియో క్యాసెట్ కోసమే అని తెలుసు.. అయినా మెమొరబుల్ సాంగ్ రాశారు. ప్రేమలో ఉన్నవారికి ప్రియుడి తలుపు, పిలుపు ఎక్కడ ఉన్నా తరుముతూనే ఉంటాయి. అందుకే ఈ పాట ఇప్పటికీ ఆడపిల్లల మనసుల్లో నిలిచిపోయింది.


ఇలాంటివి చూస్తేనే అనిపిస్తుంది సీతారామశాస్త్రి 'సాంగ్ మేకర్' అని!

మొత్తమ్మీద 'సింధూరం' సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిపోయింది. ఫస్ట్ కాపీ కూడా వచ్చేసింది. మూడు నాలుగు రోజుల్లో సెన్సార్. వారం రోజుల్లో సినిమా రిలీజ్. ఇదీ ప్లాన్. సరదాగా సినిమా ఎలా వచ్చిందో కాలక్షేపానికి చూద్దామని ఒక షో వేశారు కృష్ణవంశీ, సీతారామశాస్త్రి, బ్రహ్మాజీ, ఆయన భార్య.. ఇంకో నలుగురైదురుగురు అంతే. వీరికే ఆ ప్రదర్శన వేశారు.

మద్రాసు టీ నగర్‌లోని 'దేవి-శ్రీదేవి' థియేటర్‌లో రాత్రి పదకొండున్నరకి స్లాట్ దొరికింది. సినిమా మొదలైంది. బాగుంది. ఇంటర్వెల్ వచ్చింది. సీతారామశాస్త్రి ఎందుకో అన్‌ఈజీ ఫీలయ్యారు. ఏమీ మాట్లాడలేదు. రెండో ఆఫ్ కూడా చూసేశారు. సినిమా అయ్యేసరికి రాత్రి రెండున్నరయింది. అందరూ వెళ్లిపోయారు... కృష్ణవంశీ, శాస్త్రి తప్ప. శాస్త్రి చాలా డిస్‌కంఫర్ట్‌గా, రెస్ట్‌లెస్‌గా కనిపించారు. ఆయన రోడ్డు మీద అటూ ఇటూ తిరిగేస్తున్నారు. తనలో తానే ఏదో వితర్కించేస్తున్నారు. కథ బావుంది. టేకింగ్ బావుంది. ఎమోషన్స్ అద్భుతం. ఎంటర్‌టైన్‌మెంట్ పరవాలేదు. అయినా ఏదో వెలితి సినిమాలో.

అదే అర్థం కాక... ఆ లోపం ఏమిటో అంతుచిక్కక- టీనగర్ నడి రోడ్డు మీద ఆ అర్ధరాత్రి చీకట్లో ప్రజ్వరిల్లిపోతున్నారు శాస్త్రి. తాను అప్పటికే రాసిన పారాహుషార్ పాట నక్సలైట్ల కోణంలోనుంచి మాత్రమే రాసినది. సినిమా అంతా చూశాక, నక్సలైట్లు, పోలీసులు- వీరిలో ఎవరి మార్గం కరక్టో అర్థం కావటంలేదు. ఆ సినిమా ముగింపు అలా ఉంది. దాని వల్ల ప్రేక్షకులు శుభం కార్డు వచ్చే సరికి ఏమైందో అర్థం కాక గందరగోళంలో పడతారు. అది సినిమాకి నష్టం. ఇదీ సీతారామశాస్త్రిని వేధిస్తున్న ప్రశ్న.. వాస్తవానికి ఆ పోలీసులు, ఈ నక్సలైట్లు ఎవరు? సమాజంలోని ప్రజలే కదా! జనం అంటే మనమే కదా! మనం అంటే నువ్వు..నేను. నువ్వు..నేను అంటే ఎవరికి వారే 'నేను'. అంటే ఈ సంఘం పాడైపోయింది. కుళ్లిపోయింది. అంటే కారణం ఎవరు? 'నేనే'.. నేను మాత్రమే అని ప్రతి ఒక్క వ్యక్తీ అనుకోగలగాలి.

ఇదీ అసలైన పరిష్కారం. ఇంతటి కాంప్లికేటెడ్ ఫినామినాని క్లియర్‌గా సినిమా చెప్పలేకపోతోంది. తీరా చూస్తే ఇప్పుడు షూటింగ్ అంతా అయిపోయి సెన్సార్‌కి వెళ్లిపోతోంది. రిలీజ్ అవబోతోంది. అందుకని ఆ కాన్సెప్ట్‌ని క్లియర్‌గా చెప్పే పాట రాస్తే బావుంటుందనిపించింది సీతారామశాస్త్రికి. అంతే అప్పటికప్పుడు ఆ క్షణం రాత్రిపూట రోడ్డుపై దొరికిన ఏదో కాగితం తీసుకొని తన జేబులోంచి పెన్ తీసి.. స్ట్రీట్‌లైట్ కిందకు వెళ్లి.. తన గుండెల్ని గత రెండుగంటలుగా వేధిస్తున్న.. మెలిపెడుతున్న భావనను అక్షరబద్ధం చేస్తే- అది పాటగా ప్రవహిస్తే 'అర్థశతాబ్దపు అజ్ఞానాన్నే స్వతంత్రమందామా? స్వర్ణోత్సవాలు చేద్దామా?' అనే పదాలు పుట్టుకొచ్చాయి.



పాట షికారుకొచ్చింది
రచయిత: ఆకేళ్ల రాఘవేంద్ర
ప్రతులకు: 8897826108

మేకప్

చిరచిరలాడే ఎండలోకి అడుగు పెడితే, మేకప్ మొత్తం చెల్లాచెదరవుతోందా? ఎండకూ, వేడికీ కరిగిపోకుండా, రోజంతా మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే, కొన్ని చిట్కాలు పాటించాలి.

సమ్మర్‌లో ఇలా...


- **మాయిశ్చరైజర్:** పగటివేళ ఆయిల్ ఫ్రీ మాయిశ్చరైజర్ మాత్రమే ఉపయోగించాలి. ముఖం జిడ్డుగా మారకుండా ఉండడానికి ఇది తోడ్పడుతుంది.
- **సన్ ప్రొటెక్షన్:** మేకప్‌తో పని లేకుండా వేసవి కాలమంతా 30 కంటే ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ అప్లై చేసిన తర్వాత సన్‌స్క్రీన్, ఆ తర్వాత ఫౌండేషన్ సరైన ఛాయిస్.
- **ప్రైమర్:** మేకప్ వన్నె తగ్గకుండా ఉండాలంటే ప్రైమర్ కూడా తప్పనిసరిగా వాడాలి. ముడతలను కనపడనివ్వకుండా చేసే ప్రైమర్‌తో యంగర్ లుక్ వస్తుంది.
- **తక్కువ మేకప్:** ముఖం మీద మేకప్ ముద్దలు కట్టకుండా, గీతలు పడకుండా ఉండాలంటే, వేసవి కాలంలో వీలైనంత తక్కువ మేకప్ వేసుకోవాలి. తప్పనిసరి అయితే టింటెడ్ మాయిశ్చరైజర్, కన్‌సీలర్లను ఉపయోగించుకోవచ్చు.



- **బ్రాంజర్:** కళ్లు ఆకర్షణీయంగా కనిపించాలంటే బ్రాంజర్ వాడుకోవాలి. తాజాగా, సహజసిద్ధ సౌందర్యంతో మెరిసిపోవాలంటే ఎండ సోకే వీలున్న నుదురు, చీక్ బోన్స్, చుబుకం, ముక్కు మీద బ్రాంజర్ అప్లై చేయాలి. వేసవిలో పౌడర్ రూపంలోని బ్రాంజర్లనే ఎంచుకోవాలి.
- **షిమ్మర్ వద్దు:** అవసరానికి మించిన మెరుపులు వేసవిలో ఎబ్బెట్టుగా ఉంటాయి. కాబట్టి ఈ కాలంలో షిమ్మర్‌ను వాడకపోవడమే మంచిది.
- **బ్లష్:** ఈ కాలంలో పౌడర్ బ్లష్‌లకు బదులుగా జెల్ బ్లష్ వాడుకోవాలి.
- **లిప్‌స్టిక్:** ముదురు రంగు లిప్‌స్టిక్‌లకు బదులుగా హాయిగొలిపే లేత గులాబీ, లేత నారింజ రంగులను ఎంచుకోవాలి.

పట్టు చిక్కినట్టే..

- జైస్వాల్ మెరుపు శతకం
- ప్రస్తుత ఆధిక్యం 322
- భారత్ రెండో ఇన్నింగ్స్ 196/2
- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 319
- సిరాజ్‌కు నాలుగు వికెట్లు


యశస్వీ జైస్వాల్ (104 రిటైర్డ్ హర్ట్)


సిరాజ్ (4/84)

రాజ్‌కోట్: మూడో రోజు ఆటలో భారత్ ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టింది. అలాగే ఇంగ్లండ్ జట్టు బజ్‌బాల్ గేమ్‌కు దీటుగా ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (133 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 104 రిటైర్డ్ హర్ట్) గేమ్‌తో చెలరేగాడు. ఆదిలో నెమ్మదిగా ఆరంభమైన అతడి ఇన్నింగ్స్ కాస్త కుదురుకున్నాక తుఫాన్ వేగంతో దూసుకెళ్లింది. బౌలర్ ఎవరైనా వైవిధ్యమైన స్వీప్ షాట్లతో, ఎడాపెడా బౌండరీలు బాదేస్తూ కెరీర్‌లో మూడో శతకాన్ని పూర్తి చేశాడు. మరో యువ బ్యాటర్ గిల్ (65 బ్యాటింగ్) అజేయ అర్ధసెంచరీతో నిలిచాడు. వీరిద్దరి సమయోచిత ఆటతీరుతో మూడో టెస్టులో భారత్ 322 పరుగుల భారీ ఆధిక్యం అందుకుంది. శనివారం మూడో రోజు ఆట ముగిసేసరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 196/2 స్కోరు సాధించింది. గిల్‌కు జతగా క్రీజులో కుల్దీప్ (3) ఉన్నాడు. అంతకుముందు అశ్విన్ లేకపోయినా భారత బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను సమర్థవంతంగా కట్టడి చేశారు. పేసర్ సిరాజ్ 4 వికెట్లతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 319 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్‌కు 126 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. జడేజా, కుల్దీప్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. డకెట్ (153), స్టోక్స్ (41) రాణించారు. ఆదివారం ఆధిక్యాన్ని దాదాపు 450 రన్స్‌కు చేర్చితే భారత్ తిరుగులేని స్థితికి చేరుకుంటుంది.

మరో 112 పరుగులే: అశ్విన్ లేకపోవడంతో మూడో రోజు భారత్ నలుగురు బౌలర్లతోనే బరిలోకి దిగింది. అటు ఓవర్‌నైట్ స్కోరు 207/2తో పటిష్ఠ స్థితిలో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ నుంచి భారీ స్కోరు ఖాయమే అనిపించింది. డకెట్‌తో పాటు రూట్ క్రీజులో ఉండడమే దీనికి కారణం. కానీ స్పిన్నర్ కుల్దీప్ లయ అందుకోవడంతో పాటు పేసర్ సిరాజ్ పదునైన బంతులకు ఆ జట్టు అనూహ్యంగా తడబడింది. చివరకు మరో 112 రన్స్ మాత్రమే చేసి మిగిలిన వికెట్లన్నీ కోల్పోయింది. తొలి సెషన్‌లోనే రూట్, డకెట్, బెయిర్‌స్టో అవుటవడం జట్టును దెబ్బతీసింది. బుమ్రా ఓవర్‌లో రూట్ అనవసరంగా రివర్స్ ర్యాంప్ షాట్‌కు యత్నించి జైస్వాల్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ వెంటనే బెయిర్‌స్టోను కుల్దీప్ డకౌట్ చేశాడు. అనంతరం డకెట్, స్టోక్స్ రక్షణాత్మకంగా ఆడారు. 150 పరుగులు చేశాక డకెట్ ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. కుల్దీప్ వైడ్ బాల్‌ను వేటాడి కవర్స్‌లో గిల్‌కు క్యాచ్ ఇవ్వడంతో అతడి అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. రెండో సెషన్‌లో సిరాజ్ చెలరేగడంతో ఇంగ్లండ్‌కు కష్టాలు పెరిగాయి. చక్కగా పాతుకుపోయిన స్టోక్స్‌ను జడేజా దెబ్బతీయడంతో భారత్ సంబరాల్లో మునిగింది. డీప్ మిడ్‌వికెట్‌లో బుమ్రా అతడి క్యాచ్‌ను తీసుకున్నాడు. ఆ వెంటనే ఫోక్స్ (13), రెహాన్ (6), అండర్సన్ (1)లను సిరాజ్.. హార్ట్‌లీ (9)ని జడేజా పెవిలియన్ చేర్చడంతో 20 పరుగుల వ్యవధిలోనే ఆఖరి 5 వికెట్లను కోల్పోయింది.

'జైస్‌బాల్' దూకుడు: రెండో సెషన్‌లోనే భారత్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. అయితే ఎలాంటి తొందరపాటును చూపకుండా నిదానంగా ఆడింది. దీంతో టీ బ్రేక్‌కల్లా 16 ఓవర్లలో కెప్టెన్ రోహిత్ (19) వికెట్‌ను కోల్పోయి 44 పరుగులు చేసింది. ఓపెనర్ జైస్వాల్ తొలి 50 బంతుల్లో 18 పరుగులే చేశాడు. ఆఖరి సెషన్‌లో అతడితో పాటు గిల్ బౌలర్లపై ప్రతాపం చూపారు. ముందుగా రిస్కీ షాట్లకు వెళ్లకుండానే స్కోరు పెంచారు. ఆధిక్యం 200కు చేరాక జైస్వాల్ జూలు విదిల్చాడు. అండర్సన్ ఓవర్‌లో వరుసగా 6,4,4తో బ్యాట్‌కు పనిచెప్పాడు. తర్వాతి ఓవర్‌లోనే రెండు వరుస సిక్సర్లను బాదడంతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుంటూ స్వీప్ షాట్లతో జైస్వాల్ సాధించిన బౌండరీలు అబ్బురపరిచాయి. ఈ ధనాధన్ బ్యాటింగ్‌తో అతడు ఈ సిరీస్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అటు గిల్ సైతం 64తో అర్ధసెంచరీ సాధించాడు. అయితే సెంచరీ అయిన కాసేపటికే జైస్వాల్ వెన్నునొప్పితో మైదానం వీడాడు. రెండో వికెట్‌కు వీరి మధ్య 155 రన్స్ వచ్చాయి. రజత్ డకౌటవగా.. గిల్, కుల్దీప్ మూడో రోజును ముగించారు.

1
భారత్‌పై టెస్టుల్లో ఎక్కువసార్లు (8) డకౌటైన బ్యాటర్‌గా బెయిర్‌స్టో

పది మందితోనే..

అశ్విన్ లేకపోవడంతో టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో పది మందితోనే బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. అలాగే నలుగురు బౌలర్లు మాత్రమే ఉంటారు. నిబంధనల ప్రకారం కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కే బౌలింగ్, బ్యాటింగ్ చేసే వీలుంది. కానీ అశ్విన్ అత్యవసర పరిస్థితి కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగాడు. కాబట్టి మరో ప్లేయర్ అతడి విధులను నిర్వర్తించలేడు. ప్రస్తుతానికి ప్రత్యర్థి జట్టు కెప్టెన్ స్టోక్స్ అనుమతితో దేవ్‌దత్ పడిక్కళ్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా ఉన్నాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 445;

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) రజత్ (బి) అశ్విన్ 15; డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 153; పోప్ (ఎల్బీ) సిరాజ్ 39; రూట్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 18; బెయిర్‌స్టో (ఎల్బీ) కుల్దీప్ 0; స్టోక్స్ (సి) బుమ్రా (బి) జడేజా 41; ఫోక్స్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13; రెహాన్ (బి) సిరాజ్ 6; హార్ట్‌లీ (స్టంప్) జురెల్ (బి) జడేజా 9; ఉడ్ (నాటౌట్) 4; అండర్సన్ (బి) సిరాజ్ 1; **ఎక్స్‌ట్రాలు:** 20; **మొత్తం: 71.1 ఓవర్లలో 319 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-89, 2-182, 3-224, 4-225, 5-260, 6-299, 7-299, 8-314, 9-314, 10-319. **బౌలింగ్:** బుమ్రా 15-1-54-1; సిరాజ్ 21.1-2-84-4; కుల్దీప్ 18-2-77-2; అశ్విన్ 7-0-37-1; జడేజా 10-0-51-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వీ జైస్వాల్ (రిటైర్డ్ హర్ట్) 104; రోహిత్ (ఎల్బీ) రూట్ 19; గిల్ (బ్యాటింగ్) 65; రజత్ (సి) రెహాన్ (బి) హార్ట్‌లీ 0; కుల్దీప్ (బ్యాటింగ్) 3; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 51 ఓవర్లలో 196/2. వికెట్ల పతనం:** 1-30, 2-191. **బౌలింగ్:** అండర్సన్ 6-1-32-0; రూట్ 14-2-48-1; హార్ట్‌లీ 15-2-42-1; ఉడ్ 8-0-38-0; రెహాన్ 8-0-31-0.

నల్ల బ్యాండ్లతో బరిలోకి..



మాజీ కెప్టెన్ దత్తాజీరావ్ గైక్వాడ్ మృతికి నివాళిగా మూడో రోజు శనివారం ఆటలో భారత ఆటగాళ్లు భుజానికి నల్ల బ్యాండ్లతో బరిలోకి దిగారు. ఈనెల 13న గైక్వాడ్ అనారోగ్యంతో మృతి చెందారు. అయితే టెస్టు తొలిరోజునే ఆటగాళ్లు నివాళి అర్పించాల్సిందని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.

తల్లి అనారోగ్యం వల్లే..

తల్లి తీవ్ర అనారోగ్యం కారణంగానే అశ్విన్ అర్ధంతరంగా మూడో టెస్టును వీడినట్టు సమాచారం. రెండో రోజు ఆటలో 500 వికెట్లు పూర్తి చేసిన అశ్విన్ శుక్రవారమే చెన్నై బయలుదేరాడు. 'అశ్విన్ తల్లి వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. ఈ సమయంలో ఆమెతో పాటు ఉండేందుకు అశ్విన్ చెన్నైకి వెళ్లనున్నాడు' అని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.

వెన్నునొప్పితో మైదానం వీడాడు



భారత్ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో కదం తొక్కిన యశస్వీ జైస్వాల్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. శతకం పూర్తయిన కాసేపటికే అతను వెన్నునొప్పితో విలవిల్లాడాడు. వెంటనే ఫిజియో వచ్చి చికిత్స చేసినా.. కాసేపటికే మళ్లీ నొప్పితో బాధపడ్డాడు. దీంతో అతను మైదానం వీడడంతో రజత్ క్రీజులోకి వచ్చాడు. అయితే జైస్వాల్ నొప్పి తీవ్రతను బట్టి నాలుగో రోజు బరిలోకి దిగుతాడా లేదా అనేది తెలుస్తుంది.

ప్రపంచ టీటీలో భారత్ బోణీ

బుసాన్ (కొరియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు బోణీ కొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో శరత్ కమల్ సారథ్యంలోని భారత్ 3-0తో చిలీపై గెలిచింది.

లంక ఉత్కంఠ విజయం

దంబుల్లా: అఫ్ఘానిస్థాన్‌తో హోరాహోరీగా సాగిన తొలి టీ20లో శ్రీలంక 4 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయాన్ని అందుకొంది. తొలుత శ్రీలంక 19 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో అఫ్ఘాన్ ఓవర్లన్నీ ఆడి 156/9 స్కోరు మాత్రమే చేసింది.

స్వర్ణ చరిత్రకు అడుగు దూరం


అన్‌మోల్

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

ఫైనల్లో భారత అమ్మాయిలు

- సెమీస్‌లో జపాన్‌పై సంచలన విజయం
- థాయ్‌లాండ్‌తో టైటిల్ పోరు నేడు

షా ఆలమ్ (మలేసియా): యువ సంచలనాల అద్భుత పోరాటంతో.. ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ చరిత్రకు భారత మహిళల జట్టు అడుగు దూరంలో నిలిచింది. స్టార్ షట్లర్ సింధు తీవ్రంగా నిరాశపర్చినా.. నేటి తరం ప్లేయర్లు అన్‌మోల్ కర్బ్, అస్మితతోపాటు గాయత్రి జోడీ పట్టువీడకుండా పోరాడారు. దీంతో శనివారం ఉత్కంఠగా జరిగిన సెమీఫైనల్లో భారత్ 3-2తో పటిష్ఠ జపాన్‌కు షాకిచ్చింది. ఆదివారం జరిగే తుది పోరులో థాయ్‌లాండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. 2016, 2020లో పురుషుల జట్టు కాంస్య పతకాలు సాధించడమే ఈ ఈవెంట్‌లో ఇప్పటిదాకా భారత్‌కు అత్యుత్తమ ప్రదర్శన. జపాన్‌తో పోరులో 2-2తో సమంగా నిలిచిన స్థితిలో నిర్ణాయక, ఆఖరి సింగిల్స్‌లో బరిలోకి దిగిన హరియాణాకు చెందిన 17 ఏళ్ల అన్‌మోల్ 21-14, 21-18తో వరల్డ్ నెం.29 నట్సుకి నిడైరాకు షాకిచ్చింది. ఫలితంగా టీమిండియాను ఫైనల్‌కు చేర్చింది. గ్రూప్ దశలో చైనాపై గెలుపులోనూ అన్‌మోల్ కీలకపాత్ర పోషించింది. అయితే, తొలి సింగిల్స్‌లో సింధు 13-21, 20-22తో అయా ఒహోరి చేతిలో ఓడింది. కానీ, డబుల్స్‌లో 73 నిమిషాలపాటు సాగిన పోరులో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల జంట 21-17, 16-21, 22-20తో వరల్డ్ నెం.6 జోడీ మట్సుయామా-చిహారు షిడాపై నెగ్గి 1-1తో సమం చేసింది. ఆ తర్వాత జరిగిన మరో సింగిల్స్‌లో అస్మిత 21-17, 21-14తో ప్రపంచ మాజీ చాంపియన్ ఒకుహరాను చిత్తు చేసింది. దీంతో భారత్ 2-1తో పైచేయి సాధించింది. అయితే, తనీషా నొప్పితో బాధపడుతుండడంతో.. అశ్విని పొన్నప్పకు జోడీగా సింధు డబుల్స్ బరిలోకి దిగింది. కానీ 11వ ర్యాంకర్ రీనా మియురా-అకాయో సకుమోటో ద్వయం చేతిలో 14-21, 11-21తో సింధు-అశ్విని ఓడింది. ఇక, నిర్ణాయక మ్యాచ్‌లో తీవ్ర ఒత్తిడి మధ్య బరిలోకి దిగిన అన్‌మోల్ ప్రత్యర్థిని చిత్తుచేసి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.



జ్యోతి మరోసారి..

- 60 మీ. హర్డిల్స్‌లో జాతీయ రికార్డు
- స్వర్ణం కొల్లగొట్టిన తెలుగు అథ్లెట్

విశాఖపట్నం (స్పోర్ట్స్): భారత స్ప్రింట్ స్టార్, తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ తన జాతీయ రికార్డును తానే మరోసారి తిరగరాసింది. శనివారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో జరిగిన ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 60 మీటర్ల హర్డిల్స్‌లో ఆమె 8.12 సెకన్లలో గమ్యం చేరి స్వర్ణ పతకం కొల్లగొట్టింది. 2022 ఆసియా క్రీడల్లో 100 మీ. హర్డిల్స్‌లో రజత పతకం నెగ్గిన జ్యోతికి 60 మీటర్ల హర్డిల్స్‌లో గత అత్యుత్తమ టైమింగ్ 8.13 సెకన్లు. నిరుడు ఈ టోర్నీలోనే ఆమె ఆ రికార్డు నెలకొల్పింది. అయితే అప్పుడు రన్నరప్‌తోనే సరిపెట్టుకున్న జ్యోతి ఈసారి విజేతగా నిలిచి సత్తా చాటింది. అసుక టెరెడా (జపాన్) రజతం, లి లా యి (హాంకాంగ్) కాంస్యం అందుకున్నారు.

ఆధిక్యం దిశగా కేరళ

ఆంధ్రతో రంజీ

విజయనగరం: సచిన్ బేబి (87 బ్యాటింగ్) రాణించడంతో.. గ్రూప్-బిలో ఆంధ్రతో రంజీ మ్యాచ్‌లో కేరళ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దిశగా సాగుతోంది. రెండో రోజైన శనివారం ఆట ముగిసేసరికి మొదటి ఇన్నింగ్స్‌లో కేరళ 258/3 స్కోరు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 260/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 272 పరుగులకు ఆలౌటైంది. కేరళ తీవ్రంగా పోరాడుతున్నా.. ప్రస్తుతం 25 పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంలో ఉన్న ఆంధ్ర క్వార్టర్స్‌కు చేరడం ఖాయమే.




సాకేత్ జోడీదే బెంగళూరు టైటిల్

బెంగళూరు: బెంగళూరు ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను తెలుగు ఆటగాడు సాకేత్ మైనేని జంట సొంతం చేసుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ జోడీ 6-3, 6-4తో ఫ్రాన్స్ ద్వయం మాక్సిమ్-కోజ్‌మైన్‌పై గెలిచింది. గత వారం చెన్నై ఓపెన్ నెగ్గిన సాకేత్-రామ్ జోడీకిది వరుసగా రెండో టైటిల్. కాగా, సింగిల్స్‌లో రెండో సీడ్ సుమిత్ నగల్‌కు చుక్కెదురైంది. సెమీస్‌లో నగల్ 6-7(2), 4-6తో ఏడో సీడ్ స్టెఫనో నపోలిటానో (ఇటలీ) చేతిలో ఓడాడు.

బిజినెస్

నోవార్టిస్ ఇండియాపై డాక్టర్ రెడ్డీస్ నజర్!

మెజారిటీ వాటా కోసం చర్చలు



న్యూఢిల్లీ: దేశ ఫార్మా రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. స్విట్జర్లాండ్‌కు చెందిన నోవార్టిస్ ఏజీ భారత్‌లోని తన అనుబంధ సంస్థ నోవార్టిస్ ఇండియాను అమ్మకానికి పెట్టింది. ఈ లిస్టెడ్ కంపెనీలో తనకున్న 70.68 శాతం వాటాను విక్రయించే విషయాన్ని పరిశీలిస్తోంది. ఈ వాటా కొనుగోలుకు హైదరాబాద్ కేంద్రంగా పని చేసే డాక్టర్ రెడ్డీస్ లేబరోటరీస్ ఆసక్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. అయితే ఈ వార్తలపై స్పందించేందుకు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ నిరాకరించింది. నోవార్టిస్ ఇండియా మాత్రం 'నోవార్టిస్ ఏజీ భారత్‌లోని తన వ్యాపారాలను వ్యూహాత్మకంగా సమీక్షిస్తోంది. నోవార్టిస్ ఇండియా ఈక్విటీలో ఉన్న 70.68 శాతం వాటా అమ్మకం కూడా ఇందులో భాగం. అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు' అని తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్‌తో మార్కెటింగ్ డీల్

నోవార్టిస్ ఇండియా ఇప్పటికే అమ్మకాలు, మార్కెటింగ్ నుంచి తప్పుకుంది. కంపెనీ ఉత్పత్తి చేసే ఔషధాలను డాక్టర్ రెడ్డీస్ లేబరోటరీస్ మార్కెట్ చేస్తోంది. ఇందుకోసం రెండు కంపెనీల మధ్య 2022 ఫిబ్రవరిలోనే ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కింద నోవార్టిస్ ఇండియా ఉత్పత్తి చేసే వోవెరన్, కాల్షియం, మెథెర్జిన్ ఔషధాలను డాక్టర్ రెడ్డీస్ మార్కెట్ చేస్తోంది. నోవార్టిస్ ఇండియా ఈక్విటీలో 70.68 శాతం వాటా కొనుగోలు ద్వారా ఫార్మా రంగంలో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని డాక్టర్ రెడ్డీస్ యోచిస్తున్నట్టు సమాచారం.

ఆస్ట్రేలియాలో ఎన్‌ఎండీసీ పసిడి వేట

వచ్చే రెండు నెలల్లో ఉత్పత్తి



ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని ఎన్‌ఎండీసీ లిమిటెడ్.. ఆస్ట్రేలియాలో పసిడి వేట ప్రారంభించింది. ఇందుకోసం ఆ దేశ పశ్చిమ ప్రాంతంలోని మౌంట్ బేవన్ ప్రాంతంలో ఒక గని తవ్వకం ప్రారంభించింది. ఒకటి రెండు నెలల్లో ఈ గని నుంచి పసిడి ఉత్పత్తి ప్రారంభం అవుతుందని మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల తర్వాత విడుదల చేసిన ప్రకటనలో ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. వచ్చే ఏడాదిన్నర, రెండేళ్ల కాలంలో ఈ ప్రాంతంలో మరిన్ని గనులు తవ్వేందుకూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ప్రకటించారు.

లిథియం కోసం అన్వేషణ

ఇనుప ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న ఎన్ఎండీసీ లిథియం ఉత్పత్తికీ సిద్ధమవుతోంది. విద్యుత్ వాహనాల బ్యాటరీల తయారీలో లిథియం కీలక ముడి పదార్థం. మన దేశంలో లిథియం నిక్షేపాలు చాలా పరిమితంగానే ఉన్నాయి. దీంతో ఆస్ట్రేలియాతో సహా వివిధ దేశాల్లో ఈ నిక్షేపాల గనుల కోసం ఎన్ఎండీసీ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే హాన్‌కాక్ అనే ఆస్ట్రేలియా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. మౌంట్ బేవన్ ప్రాంతంలోనే లిథియం నిక్షేపాలు కూడా ఉన్నట్టు భావిస్తున్నారు. వచ్చే రెండు మూడు నెలల్లో హాన్‌కాక్ కంపెనీతో కలిసి ఈ ప్రాంతంలో లిథియం నిక్షేపాల కోసం అన్వేషణ ప్రారంభించనున్నట్టు ముఖర్జీ తెలిపారు.

యాక్సిస్ బీఎస్ఈ సెనెక్స్ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్ టీఆర్ఐను ఈ ఫండ్ ట్రాక్ చేస్తుంది. లార్జ్ క్యాప్ కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఒకే ఇండెక్స్‌తో వివిధ రంగాల్లోని అవకాశాలు చేజిక్కించుకోవటంతో పాటు ఇన్వెస్టర్లకు దీర్ఘకాలం పాటు మంచి రిటర్నులు అందించే విధంగా దీన్ని తీర్చిదిద్దినట్లు యాక్సిస్ ఎంఎఫ్ వెల్లడించింది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 22. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500.

యూనియన్ బిజినెస్ సైకిల్ ఫండ్

యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్.. యూనియన్ బిజినెస్ సైకిల్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న వ్యాపార వాతావరణానికి అనుగుణంగా ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. మార్కెట్లో చురుగ్గా ఉన్న రంగాలతో పాటు కొద్దిగా వెనుకబడిన రంగాల మధ్య సమతుల్యత పాటిస్తూ ఈ ఫండ్ ఎప్పటికప్పుడు పెట్టుబడులపై నిర్ణయం తీసుకుటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఫిబ్రవరి 27.

బరోడా బీఎన్‌పీ పరిబా ఇన్నోవేషన్ ఫండ్

బరోడా బీఎన్‌పీ పరిబా ఎంఎఫ్.. బరోడా బీఎన్‌పీ పరిబా ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇన్నోవేషన్ థీమ్‌తో తీసుకువచ్చిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. ఇన్నోవేటివ్ కంపెనీలపై ప్రధానంగా దృష్టి పెట్టడంతో పాటు వాటిల్లో పెట్టుబడులు పెట్టి దీర్ఘకాలం మంచి రిటర్నులు అందించటం ఈ ఫండ్ ప్రత్యేకత. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 28. కనీస పెట్టుబడి రూ.1,000.

ఐసీఐసీఐ ప్రు గోల్డ్ పెన్షన్ సేవింగ్స్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్.. ఐసీఐసీఐ ప్రు గోల్డ్ పెన్షన్ సేవింగ్స్ పేరుతో రిటైర్మెంట్ ఫండ్‌ను తీసుకువచ్చింది. పదవీ విరమణ అనంతరం ఆర్థికపరమైన ఆటుపోట్లు లేకుండా అప్పటి అవసరాలకు తగ్గట్టుగా దీన్ని రూపొందించింది. కాంప్లిమెంటరీ హెల్త్ చెకప్స్, పాక్షిక ఉపసంహరణలతో పాటు క్యాపిటల్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం ఈ పథకం ప్రత్యేకత. మూడేళ్ల తర్వాత నగదు అవసరాల నిమిత్తం 25 శాతం మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. మెచ్యూరిటీ అనంతరం వచ్చిన మొత్తంలో 60 శాతాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చు. మిగిలిన మొత్తాన్ని జీవితాంతం పెన్షన్ రూపంలో పొందవచ్చు.

కెనరా ఐ సెలెక్ట్ గ్యారంటీడ్ ఫ్యూచర్ ప్లస్

కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్.. ఐసెలెక్ట్ గ్యారంటీడ్ ఫ్యూచర్ ప్లస్ పేరుతో కొత్త ప్లాన్‌ను తీసుకువచ్చింది. ఇది నాన్-లింక్డ్ నాన్-పార్టిసిపేటింగ్ ఇండివిడ్యువల్ సేవింగ్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్. పాలసీదారుతో పాటు కుటుంబ సభ్యులకు జీవిత బీమాతో పాటు గ్యారంటీడ్ బెనిఫిట్స్ సదుపాయాలను కల్పించనుంది. ఎండోమెంట్ ఆప్షన్ కింద పాలసీదారు తమ అవసరాలకు తగ్గట్టుగా ప్లాన్ ఆప్షన్స్‌ను అందిస్తోంది. దీంతో పాటు ప్రీమియం చెల్లింపు టర్మ్ తర్వాత రెగ్యులర్ ఇన్‌కమ్ ఆప్షన్ కింద నిలకడగా ఆదాయం అందించే విధంగా ఈ ప్లాన్‌ను రూపొందించింది. అలాగే రిటర్న్ ఆఫ్ ప్రీమియం ఆప్షన్స్‌తో దీర్ఘకాలం పాటు గ్యారంటీడ్ రిటర్న్ అందించే విధంగా దీన్ని తీర్చిదిద్దింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.450 కోట్ల టర్నోవర్

2024-25లో రెట్టింపు ఆదాయం
జెన్ టెక్నాలజీస్ సీఎండీ అశోక్

Zen Technologies

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జెన్ టెక్నాలజీస్ భవిష్యత్ వ్యాపార అవకాశాలపై అత్యంత ఆశాభావంతో ఉంది. 2022 డిసెంబరు త్రైమాసికంలో రూ.32.93 కోట్లు ఉన్న కంపెనీ ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.98 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ నికర లాభం కూడా రూ.7.58 కోట్ల నుంచి ఐదు రెట్లు పెరిగి రూ.31.66 కోట్లకు చేరింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి టర్నోవర్ రూ.450 కోట్లకు చేరుతుందని కంపెనీ సీఎండీ అట్లూరి అశోక్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా టర్నోవర్‌ను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

రూ.1,434 కోట్ల ఆర్డర్లు

డిసెంబరు త్రైమాసికం చివరి నాటికి జెన్ టెక్నాలజీస్ చేతిలో రూ.1,434 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. ఇందులో రూ.997 కోట్లు దేశీయ ఆర్డర్లు కాగా రూ.437 కోట్లు ఎగుమతి ఆర్డర్లు. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలోనూ కంపెనీ రూ.129 కోట్ల విలువైన ఆర్డర్లు సంపాదించింది. యాంటీ డ్రోన్ సిస్టమ్స్‌తో పోలిస్తే సిమ్యులేటర్లలోనే లాభాలు ఎక్కువగా ఉన్నట్టు అశోక్ తెలిపారు. ప్రస్తుతం తమ ఆర్డర్ బుక్‌లో 56 నుంచి 57 శాతం సిమ్యులేటర్లు, 43 శాతం యాంటీ డ్రోన్ సిస్టమ్స్ ఉన్నట్టు వెల్లడించారు.

ఎల్ఐసీ నుంచి 'అమృత్‌బాల్' పాలసీ

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ).. అమృత్‌బాల్ పేరుతో కొత్త ఎండోమెంట్ పాలసీ ప్రారంభించింది. ఈ వ్యక్తిగత, పొదుపు, జీవిత బీమా పాలసీలో 30 రోజుల నుంచి 13 సంవత్సరాల పిల్లలు ఎవరైనా చేరవచ్చు. భవిషత్‌లో పిల్లల ఉన్నత విద్య, ఇతర అవసరాలకు తగినన్ని నిధులు సమకూర్చేలా ఎల్ఐసీ ఈ పాలసీని రూపొందించింది.

పాలసీ ముఖ్యాంశాలు

- పాలసీ తీసుకున్నప్పటి నుంచి పాలసీ ముగిసే వరకు బీమా మొత్తంలో ప్రతి రూ.1,000పై ఏటా రూ.80 అదనపు చెల్లింపులకు హామీ
- 18 నుంచి 25 సంవత్సరాల మధ్య పాలసీ మెచ్యూరిటీ
- 5, 6 లేదా ఏడేళ్ల కాలపరిమితితో స్వల్పకాలిక ప్రీమియం చెల్లించే సదుపాయం
- పదేళ్ల కనిష్ఠ కాలపరిమితితో లిమిటెడ్ ప్రీమియం చెల్లింపు సదుపాయం
- ఐదేళ్ల కాల పరిమితితో సింగిల్ ప్రీమియం సదుపాయం
- లిమిటెడ్/సింగిల్ ప్రీమియం పాలసీల ప్రీమియం చెల్లింపు గడువు
- గరిష్ఠంగా 25 సంవత్సరాలు
- పీఓఎస్‌పీ-ఎల్ఐ/సీపీఎస్‌సీ-ఎస్‌పీవీల ద్వారా కొనుగోలు చేసే అమృత్‌బాల్ పాలసీలకు గరిష్ఠంగా 20 ఏళ్ల గడువు
- కనిష్ఠంగా రూ.2 లక్షల బీమా. గరిష్ఠ పరిమితి లేదు
- మెచ్యూరిటీ సమయంలో బీమా మొత్తంతో పాటు హామీ ఇచ్చిన అదనపు మొత్తాల చెల్లింపు
- మెచ్యూరిటీ మొత్తాన్ని 5,10,15వ సంవత్సరం వాయిదాల్లో తీసుకునే సౌలభ్యం
- సింగిల్/లిమిటెడ్ పీరియడ్ ప్రీమియం చెల్లింపు ఆప్షన్స్ రెండింటిలో 'సమ్ అష్యూర్డ్ ఆన్ డెత్' ఆప్షన్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,400 ▲	57,200 ▲	78,000 ▲
ముంబై	61,743 ▲	56,557 ▲	70,922

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ	
హైదరాబాద్	554
18వ తేదీ	
చిత్తూరు	603
గోదావరి	542
విజయవాడ	542
విశాఖపట్నం	555
వరంగల్	556
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	130
వరంగల్	130
కరీంనగర్	130
మహబూబ్‌నగర్	130
కర్నూలు	130
విశాఖపట్నం	122
గోదావరి	134
విజయవాడ	134
గుంటూరు	135
ఒంగోలు	135
చిత్తూరు	135



జువెలరీ రంగ ప్రముఖుడు, జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎండీ జోయ్ అలుక్కాస్.. తన ఆత్మకథ 'స్ప్రెడింగ్ జాయ్'ను బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులకు అందజేశారు. బ్రిటిష్ సౌత్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ కామర్స్ (బీఎస్ఐసీసీ) లండన్‌లోని గ్రిమాండ్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు మార్టిన్ డే, వీరేంద్ర శర్మ, స్టీఫెన్ టిమ్స్ సహా బరోనెస్ ఉడ్డీన్‌లకు తన ఆత్మకథను బహూకరించారు. బ్రిటిష్ పార్లమెంటేరియన్స్‌కు నా కథను తెలియజేయటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జోయ్ అలుక్కాస్ ఈ సందర్భంగా అన్నారు. కాగా ఇటీవల తన ఆత్మ కథను భారత ప్రధాని నరేంద్ర మోదీకి కూడా జోయ్ అలుక్కాస్ అందజేశారు.

స్టార్టప్‌లకు 'ఇన్నోవేషన్ పాస్‌పోర్టు'

మెడ్‌టెక్ జోన్‌లో కొత్త ప్రయోగం

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి) : స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) వినూత్న విధానాలను అనుసరిస్తోంది. కొత్త ఆలోచనలతో వచ్చే యువతరానికి స్వాగతం పలుకుతూ మెడ్‌టెక్ జోన్‌లో ఉన్న వసతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం వారికి 'ఇన్నోవేషన్ పాస్‌పోర్టు' జారీ చేస్తోంది. ఒక దేశం నుంచి మరో దేశం వెళ్లాలంటే..'పాస్‌పోర్టు' ఎలా అవసరమో, ఇక్కడ మెడ్‌టెక్ జోన్‌లోకి ప్రవేశించడానికి 'ఇన్నోవేషన్ పాస్‌పోర్టు' ఇస్తోంది. వైద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించి ఏదైనా కొత్త ఆలోచనలతో వస్తే వారి పరిజ్ఞానాన్ని అంచనా వేసిన తర్వాత ఈ పాస్‌పోర్టును జారీ చేస్తారు. ఈ పాస్‌పోర్ట్ ఉంటే మెడ్‌టెక్ జోన్‌లో ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంతో స్థలాన్ని కేటాయిస్తారు. అవసరమైన సీడ్ ఫండింగ్‌ను అందజేస్తారు. 150కి పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలసి పనిచేసే అవకాశం కల్పిస్తారు.



పర్చూరు నియోజకవర్గంలో జరిగిన సభలో పార్టీ జెండాతో చంద్రబాబు



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే ఏలూరి తదితరులు

వైసీపీ పని ఫినిష్

(మొదటి పేజీ తరువాయి)

విర్రవీగుతున్నారని, అంబోతులందరికీ కళ్లెం వేసి ప్రజలను కాపాడుకుంటానన్నారు. సభకు అడ్డంకులు సృష్టించడానికి ప్రభుత్వం కుట్ర పన్నిందని, ఎండోమెంట్ భూమి అంటూ హడావుడి చేశారని మండిపడ్డారు. కానీ రైతు స్వచ్ఛందంగా భూమి ఇవ్వడమే కాకుండా బెదిరింపులకు లొంగకుండా ధైర్యంగా నిలబడ్డారని, ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. 'రా..కదలిరా సభలంటే పిచ్చి జగన్‌రెడ్డికి ప్యాంటు తడిసిపోతుంది. అధికార పిచ్చి త్వరలోనే వదులుతుంది. పోలీసులూ.. పోయే ప్రభుత్వాన్ని మోస్తే మీరు మునిగిపోతారు. చట్టప్రకారం నడుచుకోవాలని అందరికీ చెబుతున్నా' అని హెచ్చరించారు.

జగన్ వల్లే ఎక్కువ నష్టం

"హైదరాబాద్ నాలుగో రాజధాని అంటూ వైసీపీ వాళ్లు కొత్త పల్లవి ఎత్తుకున్నారు. 'రాజధాని కూడా నిర్మించుకోలేని పనికిరాని వాళ్లం.. మళ్లీ మీ పంచకొస్తాం' అంటే ఒప్పుకుంటారా? సిగ్గుండాలి. అమరావతిని నాశనం చేయకుండా ఉంటే వలసలు తప్పేవి. అందరికీ ఇక్కడే ఉపాధి దొరికేది. హైదరాబాద్‌ను పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ప్రకటించారు తప్పితే శాశ్వతంగా కాదు. ఆనాడు బీజేపీతో మేం విబేధించింది ప్రజల కోసమే తప్ప వ్యక్తిగతం కాదు. జగన్ కేంద్రం మెడలు వంచుతానని ప్రగల్భాలు పలికారు. కేంద్రం కంటే జగన్ వల్లే ఎక్కువ నష్టం రాష్ట్రానికి జరిగింది. 'రా..కదలిరా' అంటోంది నాకోసం కాదు.. మీకోసం, మీ బిడ్డల భవిష్యత్తు కోసమే. విదేశాలలో పనిచేసే ఐటీ ఉద్యోగులు ఈ రెండు నెలల ఇక్కడే ఉండి టీడీపీ గెలుపుకోసం పనిచేస్తామని చెబుతున్నారు. నేను చేసిన అభివృద్ధి వల్లే వారందరూ స్థిరపడ్డారు. ఇప్పుడు రుణం తీర్చుకోవాలనుకుంటున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలలో రామరాజ్య స్థాపనతో పాటు రావణాసుర వధకు ప్రజలు సిద్ధం కావాలి" అని చంద్రబాబు అన్నారు. "తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని 43,000 కోట్లు దోపిడీ చేసిన జగన్‌కు ఇంకా ధనదాహం తగ్గలేదు. గ్రానైట్ వ్యాపారులను అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయిస్తున్నారు. మైనింగ్ అధికారులు రౌడీల్లాగా కారంపొడి పాకెట్లతో తనిఖీలకు వెళ్లారు. ప్రశ్నించిన ఎమ్మెల్యే ఏలూరిపైనా కేసులు పెట్టారు. ఎమ్మెల్యే రవికుమార్ పార్టీ మారకపోయేసరికి రూ.350కోట్లు పెనాల్టీ వేశారు. పదేళ్లు వ్యాపారం చేసినా అంత లాభం రాదు. ఇక్కడకు వచ్చిన నాకు గ్రానైట్ వ్యాపారులు స్వాగతం పలికారు. అధికారంలోకి రాగానే ఆ రంగాన్ని ఆదుకుంటా" అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఆ హామీలన్నీ ఏమయ్యాయి?

"బటన్ నొక్కుతున్నానని జగన్ గొప్పగా చెబుతున్నాడు. ఆయన నొక్కుడు వల్ల ఏడుసార్లు కరెంటు చార్జీలు పెరిగాయి. మూడుసార్లు ఆర్టీసీ చార్జీలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెంచేసి ఒక్కో కుటుంబం దగ్గర 7లక్షలు నొక్కేశారు. జాబ్ క్యాలెండర్‌పై జగన్ బటన్ పనిచేయడం లేదా? మద్యపాన నిషేధం ఏమైంది? సీపీఎస్ రద్దు బటన్ ఏమైంది? నేను అభివృద్ధి చేసి ఆ సంపదతో సంక్షేమం చేపట్టాను. అది విజనరీ. కానీ జగన్ ప్రిజనరీ కావడం వల్ల రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి సంక్షేమం అంటూ గొప్పలు చెబుతున్నారు. పేదవాడి రక్తాన్ని తాగే జలగ జగన్. అధికారంలోకి వచ్చాక నాణ్యమైన మద్యం అందిస్తా" అని చంద్రబాబు అన్నారు. "మిచౌంగ్ తుఫాన్ వల్ల దాదాపు 12 లక్షల ఎకరాలకు నష్టం వాటిల్లింది. ఇంతవరకు అన్నదాతలకు పరిహారం అందించలేదు. కాలువల్లో పూడికతీతలు, మురికికాలువల మరమ్మతులు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. అధికారంలోకి రాగానే పూడికలు తీయిస్తా. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి అన్నదాతలకు న్యాయం చేస్తా. బిందుసేద్యం, తుంపర సేద్యాన్ని మళ్లీ అందిస్తా. రైతును రాజు చేస్తా. వలంటీర్ వ్యవస్థకు నేను వ్యతిరేకం కాదు. ఆ ముసుగులో వైసీపీ, జగన్ సేవ చేయొద్దు. ప్రజలకు సేవ చెయ్యండి అభినందిస్తా. జగన్ ఇప్పుడు సినిమాలు తీస్తున్నావు. ప్రజలు నీకు 70ఎంఎంలో రియల్ సినిమా చూపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. పర్చూరులో పాలకపార్టీ చేసిన అక్రమాలు రాష్ట్రానికి కేస్ స్టడీ. విధ్వంసం, దొంగ ఓట్లు, అక్రమ కేసులు ఇలాంటివి ఎన్నో చేశారు. ఓట్లు తొలగించడానికి దాదాపు 14,000 ఫామ్-7లు దరఖాస్తు చేశారు. తాడేపల్లిలో పెద్ద సైకో ఉంటే, ఇక్కడ చిన్న సైకో ఉన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వారి మీద హీరోలాగా పోరాడారు" అని చంద్రబాబు అన్నారు.

తలసరి ఆదాయం పతనం

"నా హయాంలో ప్రజల తలసరి ఆదాయం మెరుగ్గా ఉండేది. కానీ ఇప్పుడు అది చాలా అట్టడుగున ఉంది. అభివృద్ధిలో దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా నా పాలనలో ఏపీని మార్చాను. టీడీపీ హయాంలో 14 శాతం ఉండే వృద్ధిరేటు, ఈ ప్రభుత్వం వచ్చాక 10.93 శాతానికి పడిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధిరేటు 4.06 శాతం తగ్గింది. పన్నుల రూపంలో సంవత్సరానికి దాదాపు రూ.30,000 కోట్ల ఆదాయం రాష్ట్రం కోల్పోయింది. విభజన జరిగినప్పుడు తలసరి ఆదాయంలో ఏపీ, తెలంగాణ మధ్య 35 శాతం తేడా ఉండేది. 2014 తర్వాత ఆ తేడాను 27.5 శాతానికి తగ్గించాను. ఇప్పుడు జగన్ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల తెలంగాణతో పోల్చితే ఏపీ 44 శాతం వెనుకంజలో ఉంది. మళ్లీ రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాలి" అని చంద్రబాబు అన్నారు.

అడ్డగింతలు దాటి.. జనసందోహం

'రా... కదలిరా' సభకు ప్రభుత్వం అనేక అడ్డంకులను సృష్టించింది. తొలుత ఆర్టీసీ స్థలమని చెప్పి చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. దేవదాయ శాఖ భూమి అంటూ కౌలురైతును బెదిరించే ప్రయత్నం చేశారు. సభకు జనం రాకుండా పోలీసులు పలు ఆంక్షలు పెట్టారు. అయినా ప్రజలు పొలాల్లో నుంచి నడుచుకుంటూ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ముళ్ల చెట్లను దాటుకుంటూ పంటపొలాల గట్లపై బారులు తీరారు. మహిళలు, చంటిబిడ్డలతో తల్లులు ఎండనూ లెక్కచేయకుండా సభకు తరలివచ్చి అభిమానం చాటుకున్నారు. దాదాపు లక్షమంది సభకు హాజరు కాగా మరో 50 వేల మంది ట్రాఫిక్ ఇక్కట్ల వల్ల సభాస్థలికి చేరుకోలేకపోయారు.

3 రాజధానులంటూ ముక్కలాట

రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడు

విశాఖ, విజయనగరం శంఖారావం సభల్లో లోకేశ్

విశాఖపట్నం, పెందుర్తి, భీమిలి, విజయనగరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మూడు రాజధానుల పేరుతో సీఎం జగన్ మూడు ముక్కలాట ఆడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తామంటూ ఇక్కడి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి పట్టిన దరిద్రం జగన్ అని మండిపడ్డారు. భవిష్యత్తులో విశాఖను ఐటీ, ఆర్థిక, మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. శనివారం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కృష్ణరాయపురం, భీమిలి నియోజకవర్గ పరిధిలోని చిట్టివలస, విజయనగరం జిల్లా సోంపురంలో శంఖారావం యాత్ర సభల్లో లోకేశ్ మాట్లాడారు. ఒక్క భీమిలి చుట్టుపక్కల ప్రాంతాల్లోనే సుమారు రూ.2500 కోట్ల విలువజేసే భూములను వైసీపీ నేతలు దోచుకున్నారని, వీటి వెనుక విజయసాయిరెడ్డి ఉన్నాడని ఆరోపించారు. 'ఉత్తరాంధ్రను గంజాయి రాజధానిగా వైసీపీ నాయకులు మార్చేశారు. గతంలో చంద్రబాబు విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దేందుకు అనేక ప్రణాళికలు వేశారు. ఐటీ పరిశ్రమలు తీసుకువచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అనేక కంపెనీలు పారిపోయేలా వేధింపులకు గురిచేశారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే విశాఖ ఉక్కుకర్మాగారాన్ని కొనుగోలు చేస్తుంది. నాలుగున్నరేళ్లుగా ఉత్తరాంధ్రతో జగన్ ఫుట్‌బాల్ ఆడుకున్నాడు. రెండు నెలల్లో ఉత్తరాంధ్ర ప్రజలు జగన్‌తో ఫుట్‌బాల్ ఆడుకోబోతున్నారు. 2014లో ఇక్కడి ప్రజలు చైతన్యంతో వ్యవహరించి కడప రౌడీయిజాన్ని వద్దనుకుని జగన్‌రెడ్డి తల్లితో పాటు ఇతర నాయకులను ఓడించారు. 2024లోనూ అదే స్ఫూర్తితో టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటేయండి. సూపర్ సిక్స్ పేరుతో తెచ్చిన టీడీపీ మేనిఫెస్టోను జగన్ ఎగతాళి చేస్తున్నాడు. ఆయన ఓటమికి దేవుడు స్క్రిప్ట్ రాసి పెట్టాడు. జగన్‌రెడ్డి పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకడం లేదు. ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చినా పోటీ చేసేందుకు సిద్ధపడడం లేదు. నన్ను చూస్తే జగన్‌కు భయం. నేను పాదయాత్ర చేస్తానంటే జీవో.1 తీసుకువచ్చి గొంతు నొక్కే ప్రయత్నం చేశాడు' అని లోకేశ్ విమర్శించారు. "వైవీ సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు బాక్సైట్, లేటరైట్ గనులు కొట్టేస్తున్నారు. జీవీఎంసీని అవినీతి కూపంగా మార్చేశారు. వైసీపీ ప్రభుత్వం నాపై 22 కేసులు పెట్టింది. హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు కూడా ఉన్నాయి. బాంబులకు భయపడని కుటుంబం మాది. కేసులకు భయపడతామా?" అని లోకేశ్ అన్నారు.

బీసీలు, ఎస్సీలకు తీవ్ర అన్యాయం

వైసీపీలో బీసీ, ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగిందని లోకేశ్ ఆరోపించారు. అధికారం కోసం 'నా బీసీ... నా ఎస్సీ' అంటూ ప్రేమ కురిపించిన జగన్.. సీఎం అయ్యాక వారిని తొక్కేశారని విమర్శించారు. బీసీలకు అందాల్సిన 27 పథకాలు రద్దు చేశారన్నారు. స్థానిక సంస్థల్లో 10శాతం రిజర్వేషన్లు తగ్గించడంతో 16,500 మంది పదవులకు దూరమయ్యారని విమర్శించారు. 27వేల మంది బీసీలపై కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. మంత్రిగా తాను టీసీఎల్, హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్, జోహో.. వంటి పరిశ్రమలు తీసుకువస్తే జగన్ బూమ్‌బూమ్, ప్రెసిడెంట్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు తీసుకువచ్చారని లోకేశ్ ఎద్దేవా చేశారు. తాను అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదివితే, జగన్ టెన్త్ పేపరు లీక్ వ్యవహారంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసులో ఉన్నారని ఆరోపించారు. జగన్ పెద్ద కటింగ్ మాస్టర్ అని లోకేశ్ ఆరోపించారు. సూపర్ సిక్స్‌లో పేర్కొన్న ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించారు. టీడీపీ, జనసేన కేడర్ మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉంటూ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

జగన్ ఓటమిని దేవుడు రాసిపెట్టాడు

"వచ్చే ఎన్నికల్లో జగన్ ఓటమిని దేవుడు ముందే రాసిపెట్టాడు. వైసీపీ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులు లేక పక్క జిల్లాల నుంచి తీసుకొస్తున్నాడు. విజయనగరంలో బొత్స ఝాన్సీలక్ష్మికి విశాఖ ఎంపీ టికెటు ఇస్తున్నారు. ఒంగోలు ఎంపీగా చిత్తూరుకు చెందిన చెవిరెడ్డి భాస్కరరెడ్డికి, నరసరావుపేట ఎంపీగా నెల్లూరు చెందిన అనిల్‌కుమార్‌కు టికెట్ ఇస్తున్నారు. గుంటూరు ఎంపీగా పోటీకి క్రికెటర్ ముందుకు వస్తే ఎంత డబ్బులిస్తావని డిమాండ్ చేయటంతో పారిపోయాడు. కర్నూలు ఎంపీ సీటు గుమ్మనూరు జయరామ్‌కు ఇస్తే వద్దు బాబోయ్ అంటున్నాడు. తిరుపతి ఎంపీగా కోనేటి ఆదిమూలానికి ఇస్తే నాకొద్దు అంటున్నాడు. ఇదీ వైసీపీలో పరిస్థితి" అని లోకేశ్ అన్నారు.



పెందుర్తిలో జరిగిన శంఖారావం సభలో మహిళల నినాదాలు



భీమిలి సభలో కార్యకర్తలు అందజేసిన కంబళి, గొర్రెపిల్లతో లోకేశ్

'సంఘం' చేయని సంతకం!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే. ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కూడా కాదు. అయినా సరే.. ఇలాంటి ఖండనలు జారీ చేయాలంటే సంఘం కార్యదర్శి ఎగ్జిక్యూటివ్ కమిటీ భేటీ ఏర్పాటు చేసి వారి ఆమోదం తీసుకోవాలి. లేదా... ఫోన్‌లోనైనా సమాచారం ఇవ్వాలి. ఇక్కడ ఇవేవీ జరగనే లేదు. సంఘం కార్యదర్శిగా ఉన్న ఆర్‌కే మీనాకు తెలియకుండానే, ఆయన అనుమతి లేకుండానే, ఆయన పేరుతో కాంతి రాణా టాటా 'ఫార్' సంతకం చేసేసి.. ఇరుక్కుపోయారు. ఇది ఇప్పుడు మొత్తం ఐపీఎస్ వర్గాల్లోనే సంచలనం సృష్టిస్తోంది.

ఇలా బయటపడింది...

సభ్యుల ప్రయోజనాలకు భంగం కలిగిందని భావించినప్పుడు ఐపీఎస్ అధికారుల సంఘం జోక్యం చేసుకోవడం కొత్తేమీ కాదు. 'మీరు రాసింది సత్యదూరం' అని ఖండననూ పంపొచ్చు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఈనెల 12న ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి పేరుతో ఓ ఖండన వెలువడింది. అందులో ఐపీఎస్ భాష కనిపించక పోగా... 'తాడేపల్లి స్టైల్ బెదిరింపులు' వినిపించాయి. "ప్రజల భద్రత, సమాజంలో శాంతిని కాపాడేందుకు రాత్రింబవళ్లు పనిచేస్తున్నాం. తప్పు చేసిన వారిపై ఆయా ఐపీఎస్‌లు వ్యక్తిగతంగా తగిన క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకుంటారు" అని అందులో హెచ్చరించారు. అసలు కథనాన్ని ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'కి తప్ప ఇతర కూలి, నీలి మీడియాకు ఈ ఖండనను పంపించారు. జగన్ రోత పత్రిక కూడా దీనిని ప్రచురించింది. ఇది చదివిన ఒక అధికారికి మరుసటి రోజు ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి ఆర్‌కె మీనా ఎదురయ్యారు. 'అదేంటి సర్.. మీరు సాఫ్ట్‌గా ఉంటారు కదా! 'ఆంధ్రజ్యోతి' కథనంపై పొలిటికల్ స్టేట్మెంట్ తరహాలో ఘాటుగా ఖండన ఇచ్చారేంటి' అని అడిగారు. దీంతో మీనా ఆశ్చర్యపోయారు. 'ఖండనేంటి.. నాకేమీ తెలియదే' అని బదులిచ్చారు. 'ఐపీఎస్‌ల బదిలీలపై వచ్చిన వార్త విషయంలో.. సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మీరు వార్నింగ్ ఇచ్చినట్లు పత్రికల్లో వచ్చింది' అనగానే, 'అవునా.. నేను ఏదీ ఇవ్వలేదు. నన్నెవరూ అడగలేదు' అంటూ ఆయన ముందుకు వెళ్లిపోయారు. ఆ ఖండన ప్రకటనను తెప్పించుకుని పరిశీలించారు. తన తరఫున చేసిన సంతకం ఎవరిదని ఆరా తీశారు. ఆ సంతకం కాంతి రాణా టాటా చేసినట్లు తెలుసుకున్నారు. వెంటనే ఆయనకు ఫోన్ చేశారు. "నా హోదాతో మీరెలా సంతకం చేస్తారు? కనీసం నన్ను అడిగారా? ప్రకటన విడుదల గురించి ఒక మాటైనా చెప్పారా? విజయవాడ పోలీస్ కమిషనర్ సంతకం ఇంకెవరైనా చేస్తే మీరు ఊరుకుంటారా? దీనిపై మీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే మీపై కేసు పెడతా" అని మీనా హెచ్చరించినట్లు సమాచారం. దీంతో 'పై నుంచి వచ్చిన ఆదేశాలు పాటించాను' అని టాటా బదులిచ్చినట్లు తెలిసింది.

డీజీపీకి ఫిర్యాదు...


ఈ విషయాన్ని మీనా సీరియస్‌గా తీసుకున్నారు. డీజీపీని కలిశారు. 'నాకు తెలీకుండానే నేను ప్రకటన విడుదల చేసినట్లు ఇచ్చారు. ఇది సరైన పద్ధతి కాదు. నిజంగా ఐపీఎస్‌లకు ఇబ్బంది కలిగితే అసోసియేషన్‌లో చర్చించాలి. అప్పుడు నేనే అధికారికంగా ప్రకటన విడుదల చేస్తా. కానీ... ఇలా చేయడం పద్ధతి కాదు" అని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై డీజీపీ ఆయనకు సర్ది చెప్పారు.

పీఎస్ఆర్ డైరెక్షన్‌లో...

కార్యదర్శి ఆర్కే మీనా అనుమతి లేకుండానే కాంతి రాణా టాటా ఎందుకు సంతకం చేశారు? ఎందుకీ అత్యుత్సాహం ప్రదర్శించారు? నడుచుకునే ఇంటెలిజెన్స్ అధిపతి పీఎస్సార్ ఆంజనేయులు డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరిగినట్లు మీనా విచారణలో తేలినట్లు సమాచారం. 'ఈ విషయాన్ని అంత సులభంగా వదలను. మీ పరిధిలోని పోలీసు స్టేషన్లోనే కంప్లైంట్ ఇస్తా' అని మీనా హెచ్చరించడంతో 'ఎరక్కపోయి సంతకం పెట్టి ఇరుక్కుపోయాను' అని కాంతి రాణా వాపోతున్నట్లు తెలిసింది! సర్కారు పెద్దల అండ ఉన్నందున ఇప్పటికిప్పుడు ఆయనకు ఏమీ కాకపోవచ్చుకానీ, భవిష్యత్తులో కష్టాలు ఖాయమని ఐపీఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

టార్గెట్ 'ట్రైబల్'!

గిరిజన ప్రాంతాలపై పవన్ ఫోకస్



అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ గిరిజన ప్రాంతాలపై ఫోకస్ పెట్టింది! రాష్ట్రంలో ఉన్న ఏడు గిరిజన నియోజకవర్గాల్లో పార్టీకి కొంత కేడర్ ఉండగా.. ఇక పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని అధినేత పవన్ నిర్ణయించారు. 2019 ఎన్నికలలో ఆ ఏడు నియోజకవర్గాల్లోనూ వైసీపీ అభ్యర్థులే గెలిచారు. గతంతో పోల్చితే ఇప్పుడా స్థానాల్లో వైసీపీ బలహీన పడింది. ప్రభుత్వం గిరిజన ప్రాంతాలను పూర్తిగా గాలికి వదిలేయడమే ఇందుకు కారణం. అక్కడ మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైంది. ఉద్యోగాల కోసం ఎదురుచూసిన యువతకు తీవ్ర నిరాశే ఎదురైంది. దీంతో ప్రభుత్వం పట్ల యువత తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. పైగా జిల్లాల విభజనతో అక్కడ ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు మరింత విసుగుచెందారు. ఐదేళ్లల్లో కనీసం ఒక చిన్న అంబులెన్స్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో ఇప్పుడా ప్రాంతాల్లో వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి.

అభిమానుల్ని ఓటర్లుగా మలుచుకునే ప్రణాళికలు

గిరిజన ప్రాంతాల్లో బలమైన నాయకత్వాన్ని పెంపొందించుకునేదిశగా జనసేన దృష్టిపెట్టింది. ఇప్పటికే పార్టీ కోసం పని చేస్తున్న నాయకులు, కేడర్‌లో జోష్ పెంచే కార్యక్రమాలకు అధినేత పవన్ సిద్ధమవుతున్నారు. అభిమానుల్ని ఓటర్లుగా మలుచుకునే ప్రణాళికలను పార్టీ చేస్తోంది. ప్రస్తుతం పాడేరు, పోలవరం నియోజకవర్గాల్లో పార్టీకి బలమైన నాయకత్వం ఉంది. నేతలు నిత్యం గిరిజన తండాలు, గ్రామాల్లో పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసే నాయకుల్ని నియమించే పనిలో పవన్ ఉన్నారు. త్వరలో గిరిజన ప్రాంతాల పర్యటనకు సిదమవుతున్నట్లు సమాచారం.



'సిద్ధం' సభ కోసం అనంత ఆర్టీఏ కార్యాలయంలో అధికారులు సిద్ధం చేసిన ప్రైవేటు బస్సులు

అధికారులతో 'సిద్ధం'!

నేడు రాప్తాడులో వైసీపీ బహిరంగ సభ

విజయవంతం చేసేందుకు అధికారుల హడావుడి

- దగ్గరుండి మరీ ఏర్పాట్ల పర్యవేక్షణ.. జనాన్ని తరలించాలని వలంటీర్లకు ఆదేశాలు
- రాకుంటే పథకాలు రద్దవుతాయని బెదిరింపులు.. ఇంటికి కనీసం ఒకరైనా రావాలని హుకుం
- డ్వాక్రా మహిళలను భారీగా తరలించే యత్నం.. జన సమీకరణకు 3,196 ప్రైవేట్, స్కూల్ బస్సులు
- 3,010 ఆర్టీసీ బస్సుల్లో లబ్ధిదారులు, వైసీపీ శ్రేణులు.. ఆర్టీసీ ప్రయాణికులకు 'సిద్ధం' సభ కష్టాలు

అనంతపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల 'సిద్ధం' బహిరంగ సభను అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్నారు. సీఎం జగన్ హాజరుకానున్న ఈ సభ ఏర్పాట్లను వైసీపీ ముఖ్యులతో పాటు అధికారులు దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తున్నారు. సభకు పెద్దఎత్తున జనాన్ని తరలించేందుకు వైసీపీ నేతల కంటే అధికారులే ఎక్కువగా శ్రమిస్తున్నారు. పథకాల లబ్ధిదారులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు ఆ పనిని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు అప్పగించి.. ఇంటింటికీ పంపుతున్నారు. సభకు రాకుంటే పథకాలు రద్దవుతాయని హెచ్చరిస్తున్నారు. ఇంటికి కనీసం ఒకరైనా రావాలని హుకుం జారీ చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల మహిళలను పెద్ద ఎత్తున సభకు తరలించేందుకు అధికారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి పెద్దఎత్తున ప్రైవేట్, ఆర్టీసీ బస్సుల్లో పథకాల లబ్ధిదారులు, పార్టీ శ్రేణులను తరలిస్తున్నారు. రాయలసీమ జిల్లాల నుంచి 3,196 ప్రైవేట్, స్కూల్ బస్సులు, 3,010 ఆర్టీసీ బస్సులను జన సమీకరణకు వాడుతున్నారు. ప్రైవేట్ బస్సుల ఏర్పాటు ప్రక్రియను ఆర్టీఏ అధికారులు చూసుకుంటున్నారు.

బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు

ఆర్టీసీ బస్సులను భారీగా సిద్ధం సభకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 857 బస్సులు ఉండగా, ఇందులో సభకు ఏకంగా 543 కేటాయించారు. ఈ బస్సులన్నీ శనివారం మధ్యాహ్నమే వివిధ నియోజకవర్గాలకు చేరుకున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్లలో గంటల తరబడి పడిగాపులు కాశారు. దీనిపై ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తే... 'ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాం. మా చేతుల్లో ఏమీ లేదు' అని చేతులెత్తేశారు.

జాతీయ రహదారిపై ఆంక్షలు

బెంగళూరు-హైదరాబాద్ 44వ నంబరు జాతీయ రహదారి పక్కనే సిద్ధం సభను నిర్వహిస్తున్నారు. దీంతో హైవేపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జిల్లా పోలీసు యంత్రాంగం హైవేపై కఠినమైన ఆంక్షలు విధించింది. అత్యవసర సేవల వాహనాలతో పాటు కార్లకు మాత్రమే జాతీయ రహదారిలో ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. సరుకు రవాణా వాహనాలు, లారీలను దారి మళ్లించారు. సిద్ధం సభ కారణంగా జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎస్పీ అన్బురాజన్ ప్రకటించారు.

జగన్ పర్యటన ఇలా..

సిద్ధం బహిరంగ సభకు హాజరయ్యేందుకు గానూ సీఎం జగన్ ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ప్రత్యేక విమానంలో 2.45 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 3.15 గంటలకు రాప్తాడులో సిద్ధం వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వస్తారు. సాయంత్రం 5గంటల వరకూ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. 5.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి పుట్టపర్తి విమానాశ్రయానికి, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 6.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

అద్దంకి డిపో నుంచీ 20 బస్సులు

అద్దంకి: రాప్తాడులో సిద్ధం సభ కోసం బాపట్ల జిల్లా అద్దంకి డిపో నుంచి 20 బస్సులు శనివారం ఉదయం బయలుదేరి వెళ్లాయి. సభ పూర్తయిన తర్వాత తిరిగి సోమవారం సాయంత్రానికి బస్సులు అద్దంకికి చేరే అవకాశం ఉంది. దీంతో మూడు రోజుల పాటు ప్రయాణికులకు కష్టాల ప్రయాణమే. వినుకొండ, నర్సరావుపేట, ఒంగోలు, పొదిలి రూట్లలో అద్దె బస్సులు తిరిగాయి.

సీపీఎస్ పోరుపై సర్కారీ నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

అప్పటి ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచినా హామీని అమలు చేయలేదు. ఉద్యోగులు ఆందోళనలు చేయడంతో సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అనే కొత్త విధానం తెచ్చి ఉద్యోగులపై బలవంతంగా రుద్దారు. దీంతో జీపీఎస్ వద్దంటూ సీపీఎస్ ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ ఇప్పటికే అనేక సార్లు నిరసనలు తెలిపారు. అయినా జగన్ సీపీఎస్ ఉద్యోగుల పట్ల కనికరించలేదు. రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నా ఇచ్చిన హామీని నెరవేర్చే ఊసేలేదు. దీంతో పాత పెన్షన్ విధానం చేయాలనే డిమాండ్‌తో ఏపీసీపీఎస్‌ఈఏ చలో విజయవాడకు పిలుపు నిచ్చింది. దీంతో జగన్ ప్రభుత్వం పోలీసుల సాయంతో ఎక్కడికక్కడ నిర్బంధాలు, బెదిరింపులకు దిగింది. సీపీఎస్ ఉద్యోగ సంఘ నేతలను గృహనిర్బంధం చేయించింది. 'చలో విజయవాడ'కు అనుమతి లేదని, వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చింది. పాఠశాలలు, కార్యాలయాల వద్దకు పోలీసులు వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఇళ్ల వద్ద కూడా పోలీసులు నిఘా పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సీపీఎస్ ఉద్యోగులను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అక్రమంగా గృహనిర్బంధం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేశారు. చలో విజయవాడకు తరలి రాకుండా ఎక్కడికక్కడ కట్టడి చేశారు.

చర్చల పేరుతో పిలిచి అదుపులోకి..

సీపీఎస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను చర్చలపేరుతో పిలిచి పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. సంఘం ఇతర నేతలనూ పోలీసులు నీడలా వెంటాడుతున్నారు. ఇళ్ల చుట్టూ మఫ్టీలో పోలీసులు నిఘా పెట్టారు. వారు ఎక్కడికి వెళ్లకుండా నోటీసులు ఇచ్చారు. పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారిని ఎక్కడ ఉంచారో, ఎక్కడికి తరలించారో తెలియడంలేదని సీపీఎస్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీడలా వెంటాడిన పోలీసులు...

అనుమతి లేదంటున్నందున చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లడం లేదని రాసిచ్చినా పోలీసులు వారిని వదలడంలేదు. 'మేం వెళ్లంబాబో య్' అన్నా సరే ఇబ్బంది పెడుతున్నారని సీపీఎస్ ఉద్యోగి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. తమను పోలీసులు నీడలా వెంటాడుతున్నారని, వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్నారని వాపోతున్నారు. ఇచ్చిన హామీనే అమలు చేయాలని అడుగుతుంటే ఇంత నిర్బంధకాండా? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి లేదు: సీపీ

సీపీఎస్ ఉద్యోగులు ఆదివారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టి.కాంతిరాణా శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. సీపీఎస్ నేతలు తలపెట్టే కార్యక్రమాలకు విజయవాడలో ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదన్నారు. నగరంలో ఇప్పటికే 144, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై పీడీపీపీ(ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ), ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో 1500 మంది పోలీసులను బందోబస్తుకు నియమించామని, సీసీ, డ్రోన్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా నిఘా ఉంచామని వివరించారు.

తాత్కాలికంగా నిలిపేస్తున్నాం: ఏపీసీపీఎస్‌ఈఏ

ఆదివారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నామని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్, సీఎందాస్ తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులెవరూ విజయవాడకు తరలి రావొద్దని సూచించారు. ప్రభుత్వం నిరంకుశ విధానంతో పోలీసులను ఉపయోగించుకుని సీపీఎస్ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నందువల్ల వారి భద్రత దృష్ట్యా చలో విజయవాడ కార్యక్రమాన్ని నిలిపి వేస్తున్నామని వివరించారు. ఆదివారం అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ 'మీకు తోచిన విధంగా' కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎస్ ఉద్యోగులు కనీసం తమ ఆవేదనను తెలపడానికి కూడా స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగులు తగిన విధంగా ప్రతిఫలం ఇవ్వాలని, అందుకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



విజయవాడ ధర్నాచౌక్‌లో ఏపీజేఏసీ నేతల సంఘీభావం

ఇదేం నియంతృత్వం?

- చర్చలు ఓ డ్రామా.. ఒరిగింది శూన్యం
- ఏపీజేఏసీ ప్రధానకార్యదర్శి హృదయరాజు
- విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా

విజయవాడ(ఆంధ్రజ్యోతి), గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17: ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి నాలుగున్నరేళ్లుగా విజ్ఞప్తులు చేస్తున్నా.. చర్చలు, హామీల పేరుతో వాటిని బుట్టదాఖలా చేసిందని, అంతిమంగా ఉద్యమం దిశగా కదులుతున్న వేళ కుట్రతో చర్చలకు పిలవటం దుర్మార్గమని ఏపీజేఏసీ ప్రధాన కార్యదర్శి జి.హృదయరాజు మండిపడ్డారు. మంత్రుల సమావేశంలో వెల్లడించిన రూ.22 వేల కోట్లతోపాటు ఇతర చెల్లింపులు కలిపితే రూ.30 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని, ఇవన్నీ చెల్లించటానికి బడ్జెట్ అంటూ కొత్త కథలు అల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ ఎత్తుగడలు మాత్రమేనన్నారు. ఏపీజేఏసీ ఉద్యమ శంఖారావం పిలుపులో భాగంగా నాలుగో రోజు(శనివారం) విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. హృదయరాజు మాట్లాడుతూ మంత్రుల సమావేశంలో ఉద్యోగుల ప్రధానమైన 34 సమస్యలపై మరోసారి చర్చించారని, వేటికీ హామీలు లభించలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉద్యమం దిశగా వెళుతున్నామని, ఇక తాడోపేడో తేల్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించటానికి రెండున్నరేళ్లుగా 12 సార్లకు పైగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించిన ప్రభుత్వం.. ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగులు కోరుతున్న ఆర్థిక, ఆర్థికేతర, సామాజిక సమస్యలను పరిష్కరించటానికి గంట సమయం సరిపోతుందన్నారు. ఐదేళ్లు కావస్తున్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించటం లేదని తాము ఆందోళనకు శ్రీకారం చుడుతున్న తరుణంలో మంత్రుల బృందం చర్చలకు పిలవటం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ సంఘాల నాయకులం 25 సార్లకుపైగా ముఖ్యమంత్రితో సమావేశమయ్యామని, చర్చించామని, అనేక న్యాయమైన డిమాండ్లను సాధించుకున్నామని వివరించారు. ఈ ప్రభుత్వ హయాంలో గత 57 నెలలుగా ఒక్కసారి కూడా ఉద్యోగ సంఘాల నాయకులు ముఖ్యమంత్రిని కలవలేకపోయారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామో, నియంతృత్వ పాలనలో ఉన్నామో తెలియని స్థితిలో రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. ఒక పథకం ప్రకారం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సరైన సమయంలో ప్రభుత్వానికి సత్తా చూపేందుకు సిద్ధంగా ఉండాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఏపీఎన్జీవో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జగదీష్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఏపీఎన్‌జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ పాల్గొన్నారు.

జీవోలు సరే.. నిధుల మాటేంటి?

ఏపీజేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని, కనీసం మెడికల్ బిల్లులు సైతం రావడం లేదని ఏపీజేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గుంటూరు తాలుకా కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో మాట్లాడుతూ ప్రభుత్వం జీవోలు విడుదల చేస్తోందే కానీ, నిధులు మాత్రం ఇవ్వడం లేదన్నారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేస్తూనే ఉందన్నారు. 12వ పీఆర్సీ ఇతర బకాయిలు అడగడం నేరమా? అని ప్రశ్నించారు. ఇటీవల మంత్రుల బృందంతో జరిగిన చర్చల్లో 49 సమస్యలను నివేదించామని, ఒక్క సమస్యకూ ప్రభుత్వం పరిష్కారం చూపలేదన్నారు. స్పందన రాకపోతే... 27న చలో విజయవాడ నిర్వహిస్తామని తేల్చి చెప్పారు.



పట్టాలిచ్చి నాలుగేళ్లు.. స్థలాలేవి జగనన్నా?

కడియం, ఫిబ్రవరి 17: వైసీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చి నాలుగేళ్లు దాటింది. పట్టాలిచ్చారు కానీ నేటికీ స్థలాలు చూపలేదు. అదిగో స్థలం.. ఇదిగో పట్టా అంటున్నారే తప్ప ఇప్పటికీ ఇవ్వలేదంటూ తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరికి చెందిన మహిళలు శనివారం ఆందోళన చేపట్టారు. కడియం-సామర్లకోట రోడ్డుపై పెద్దఎత్తున బైఠాయించారు. మహిళల ఆందోళనతో పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. 'శనివారం ఉదయం స్థలాలు ఇస్తున్నామంటూ పిలిచి రాళ్ల వద్ద ఉండమని చెప్పి, పట్టాపై నంబర్ ఇచ్చారు. దాని కోసం రూ.150 చొప్పున తీసుకున్నారు. రాళ్లకు రూ.400 చొప్పున తీసుకున్నారు. ఓ ఐదుగురికి మాత్రమే స్థలాలు చూపించారు' అని మహిళలు తెలిపారు. ఆందోళన చేస్తున్న మహిళలతో తహశీల్దారు బి.రమాదేవి మాట్లాడి, ఐదుగురు మహిళలను బొమ్మూరులోని కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి.. జేసీ తేజ్‌భరత్‌ను కలవగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపి న్యాయం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని డిమాండ్ చేశారు.

'వక్ఫ్‌బోర్డు' పర్యవేక్షణకు అడ్‌హాక్ కమిటీ

- ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన హైకోర్టు
- విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని ఆదేశం



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ వక్ఫ్‌బోర్డు పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు హైకోర్టు అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసింది. మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి మహ్మద్ ఇంతియాజ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి. ఉషాకుమారి, ఐపీఎస్ అధికారి ఆరిఫ్ హఫీజ్‌లను కమిటీలో నియమించింది. వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన రోజువారీ కార్యకలాపాలు నిర్వహించడం తప్ప ఆస్తులను అన్యాక్రాంతం చేయడం కానీ, ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అలాగే బోర్డు ఆస్తులకు సంబంధించిన లీజులను 11 నెలలకు మించి పొడిగించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. జయసూర్య ఇటీవల తీర్పు ఇచ్చారు. ఏపీ వక్ఫ్‌బోర్డు పరిపాలనా వ్యవహారాల నిర్వహణను ఎలాంటి కేసులు, ఆరోపణలు లేని ఖాదర్ బాషా, సయ్యద్ సఫీ అహ్మద్ ఖాద్రీ, మీర్ హుస్సేన్, హఫీజ్ ఖాన్‌లకు అప్పగించేలా మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ సయ్యద్ సఫీ అహ్మద్ ఖాద్రీ, మీర్ హుస్సేన్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. "వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎన్నికను నిలుపుదల చేస్తూ హైకోర్టు గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు బోర్డు కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయి. పిటిషనర్లను బోర్డు సభ్యులుగా నియమించి వారిలో ఒకరిని బోర్డు చైర్మన్‌గా నియమించేలా అధికారులను ఆదేశించండి" అని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి అవరోధాలు లేకుండా బోర్డు తన కార్యకలాపాలు సాగాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. పిటిషనర్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మరో సీనియర్ న్యాయవాది వీఎస్ఆర్ ఆంజనేయులు వాదనలు వినిపిస్తూ.. ఖాదర్ బాషాను వక్ఫ్ బోర్డు సభ్యుడిగా నియమించడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ వేశామని కోర్టుకు వివరించారు.

రేపు తుది విచారణకు రండి

- వైసీపీ ఎమ్మెల్యే ఆనంకు స్పీకర్ తమ్మినేని నోటీసు

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో తుది వాదనలు వినిపించేందుకు సోమవారం ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా హాజరుకావాలని వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిని స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశించారు. ఈ మేరకు శనివారం రామనారాయణరెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. సోమవారం తుది విచారణ చేపట్టనున్న నేపథ్యంలో.. పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదంటూ నిరూపించుకోవాలని స్పీకర్ ఆదేశించారు. వాస్తవానికి ఈ నెల 8న స్పీకర్ సీతారాం ముందు ఆనం హాజరయ్యారు. తాను పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని.. ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు చూపించిన సాక్ష్యాధారాలు చట్టప్రకారం చెల్లబోవని ఆనం వాదించారు. పత్రికలకు, మీడియాకు ఇచ్చిన ప్రకటనలు తానే ఇచ్చానంటూ మీడియా యాజమాన్యాలు సర్టిఫికెట్ ఇవ్వాలని స్పీకర్‌కు ఆనం స్పష్టం చేశారు.

ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ హెచ్చరిక

పాలకోడేరు, ఫిబ్రవరి 17: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై సత్వరం నిర్ణయం తీసుకోకపోతే ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ హెచ్చరించారు. ఎస్టీయూ 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని శనివారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం శివారు గొల్లలకోడేరులో నిర్వహించారు. సమావేశంలో సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ పల్లె బడులకు మంగళం పలికే ఆలోచన అత్యంత ప్రమాదకరమన్నారు. ప్రతి ఏటా మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి, చివరిలో కంటితుడుపుగా 6 వేల పోస్టులతో డీఎస్సీ వేయడం నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లడమేనని పేర్కొన్నారు. 202 ఉన్నత పాఠశాలలను ప్లస్-2గా ఉన్నతీకరించి పదోన్నతుల ద్వారా పీజీ టీచర్లను నియమించకుండా రీ డిప్లాయిమెంట్ పేరుతో ఒక ఇంక్రిమెంట్ ఇచ్చి నియమించి ఇంతవరకు ఇంక్రిమెంటు చెల్లించకపోవడం దారుణమని ఆక్షేపించారు. పరీక్ష విధానం లోపభూయిష్టంగా మారిందన్నారు. ఒకటిన్నర దశాబ్దం పోరాటం చేసి రద్దు చేసుకున్న అప్రెంటిస్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలనే దుర్మార్గపు ఆలోచనతో ఉన్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

నేతన్నల బతుకులను మారుస్తాం

అంతర్జాతీయ బ్రాండ్‌గా మంగళగిరి చేనేత

- పైలెట్ ప్రాజెక్టుగా వీవర్స్‌శాల
- ప్రారంభించిన నారా బ్రాహ్మణి

మంగళగిరి, ఫిబ్రవరి 17: 'నేతన్నల బతుకులను మారుస్తాం. చేనేతలు సగౌరవంగా, ఆరోగ్యంగా, సంతృప్తికరంగా, సంతోషకరంగా జీవించేలా చేయడమే లోకేశ్ ధ్యేయం' అని ఆయన సతీమణి, హెరిటేజ్‌ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా గుంటూరు జిల్లా మంగళగిరి ఆటోనగర్‌లో అత్యంత ఆధునిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో వీవర్‌శాలలను ఏర్పాటు చేశారు. శనివారం దానిని టాటా అనుబంధ సంస్థ 'తనేరా' సీఈవో అంబుజ్ నారాయణ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ చేనేతరంగం అభివృద్ధి కోసం ఆ రంగాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. చేనేతల అభివృద్ధి కోసమై కొన్ని హామీలను ఇచ్చారు. వాటి అమలులో భాగంగా తన నియోజకవర్గమైన మంగళగిరిలో చేనేతలకు చేయూతనందించే పైలెట్ ప్రాజెక్టుగా ఈ వీవర్‌శాలను ఏర్పాటు చేయించారు. దీని స్థాపన కోసం ఏపీ ఎన్నార్టీ మాజీ సీఈవో వేమూరి రవికుమార్, మరికొందరు ఎన్నారైలు, స్థానిక చేనేత ప్రముఖులతో కలిసి శ్రమించారు. ఈ సందర్భంగా బ్రహ్మణి మాట్లాడుతూ... 'నారా లోకేశ్ కల, విజన్ చాల పెద్దవి. మంగళగిరి చేనేత కార్మికులకు, స్వర్ణకారులకు మెరుగైన జీవనోపాధిని కల్పించడమే ఆయన లక్ష్యం. లోకేశ్ విజన్‌లో భాగంగానే ఈ వీవర్‌శాలను ఏర్పాటు చేశాం. ఇక్కడి చేనేత కార్మికులకు ఆధునిక మగ్గాలను అందుబాటులో ఉంచాం. నాణ్యతకు మారుపేరైన టాటా సంస్థ ఆధ్వర్యంలో అత్యాధునిక డిజైన్లకు రూపకల్పన జరుగుతుంది. వాటి తయారీలో నేత కార్మికులకు అధునాతన మిషనరీపై శిక్షణ ఇస్తారు. వారి చేతుల మీదుగానే ఉత్పత్తులను రూపొందిస్తారు. ఈ వీవర్‌శాలలో తయారైన వస్త్రాల నాణ్యతను కూడ ఇక్కడే రాజీపడకుండా క్వాలిటీ కంట్రోల్ చాంబర్‌లో పరిశీలిస్తారు. తనేరా సంస్థ సహకారంతో వాటికి అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం' అని బ్రాహ్మణి వివరించారు.



వీవర్స్‌శాలలో ఆధునాతన మగ్గాన్ని పరిశీలిస్తున్న బ్రాహ్మణి

స్వావలంబనే లక్ష్యంగా స్త్రీ శక్తి

'మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా స్త్రీ శక్తి కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. ఇక్కడి మహిళల స్పందన చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది' అని నారా బ్రాహ్మణి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తన సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న స్త్రీ శక్తి కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అక్కడ కుట్టులో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి పాల్గొన్నారు.

'ప్రపంచాన్ని చూసిన' శిశు మేధావి!

4 నెలల వయసులోనే నోబుల్ వరల్డ్ రికార్డ్



నోబుల్ వరల్డ్ రికార్డుతో చిన్నారి కైవల్య

విజయవాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నెలల వయసున్న చిన్నారులకు ఏం తెలుస్తుంది?!.. ఆకలేస్తే ఏడుపుతో సంకేతాలిస్తారు... అంతే కదా!.. కానీ.. నలుగు నెలల పసికందు.. బుడిబుడి అడుగులు వేయడానికి ముందే ప్రపంచ రికార్డ్‌ను సాధించింది! ఆ శిశు మేధావే చల్లగుండ్ల కైవల్య. ఒకటి, రెండు కాదు ఏకంగా 120 అంశాలను గుర్తించి ఈ రికార్డును నెలకొల్పింది. చల్లగుండ్ల రమేశ్ హైదరాబాద్‌లోని క్వెస్ట్ గ్లోబల్ సంస్థలో హార్డ్‌వేర్ ఉద్యోగి. ఆయన భార్య హేమ.. కాగ్నిజెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈ దంపతుల ముద్దుల కూతురు కైవల్య. ఆ చిన్నారికి కొద్ది రోజుల క్రితమే 4 నెలలు నిండాయి. హేమ... కైవల్య కంటి చూపు కోసం చేసిన ప్రయత్నాలు ప్రతిభకు బీజం వేశాయి. చిన్నారులకు బ్లాక్ అండ్ వైట్ బొమ్మలున్న కార్డులు చూపిస్తే చూపు మెరుగుపడుతుందని కొంతమంది సలహా ఇచ్చారు. దీంతో ఆన్‌లైన్‌లో కొన్ని ఫ్లాష్‌కార్డులను ఆర్డర్ చేసింది. ఒకటో నెలలో వాటిని హేమ చూపిస్తున్నప్పుడు కైవల్య శ్రద్ధతో చూస్తున్నట్టు గుర్తించింది. నాలుగో నెలలో రెండు కార్డులను పట్టుకుని కైవల్యకు చూపించి కార్డుపై ఉన్న చిత్రం పేరు చెప్తే అదే కార్డును పట్టుకునేది. దీన్ని గమనించిన తల్లి హేమ వేర్వేరు కార్డులను చూపించి పేర్లు చెప్పేది. దీంతో నోబుల్ వరల్డ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు దరఖాస్తు చేసింది. మొత్తం 120 అంశాలను ఈ నాలుగేళ్ల చిన్నారి గుర్తించి 'బాల్యమేధావి' అనిపించుకుంది. వాటిని పరిశీలించిన నోబుల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఈ నెల 13న రికార్డ్స్‌కు సంబంధించిన ప్రశంసాపత్రాన్ని, పతకాన్ని పంపించింది.

పీచు మిఠాయిపై నిషేధం

- తమిళనాడు సర్కారు సంచలన నిర్ణయం
- క్యాన్సర్ కారకాలు ఉన్నట్లు నిర్ధారణ



చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ కారక పదార్థాలున్నట్లు నిర్ధారణ కావడంతో పీచు మిఠాయి విక్రయాలపై తమిళనాడు ప్రభుత్వం నిషేధం విధించింది. ఆహార భద్రతా శాఖ సిఫారసులతో ఈ నిర్ణయం తీసుకుంది. పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లు, ప్రజల అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో తెలుపు, నీలం రంగుల్లో పీచు మిఠాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నారు. ఇది తియ్యగా, నోటిలో వేసుకొంటే కరిగిపోయే స్థితి ఉండడంతో పిల్లలు, యువతీయువకులు వీటిని తినేందుకు ఇష్టపడుతుంటారు. ఇటీవల పుదుచ్చేరి బీచ్‌లో విక్రయిస్తున్న పీచు మిఠాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఆ రాష్ట్ర ఆహార భద్రతా శాఖ అధికారులు.. వాటి శాంపిళ్లను పరిశోధనల కోసం ల్యాబ్‌కు పంపించారు. క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే 'రొడమైన్ బి' అనే రసాయనం కలుపుతున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయింది. దీంతో, పీచు మిఠాయి విక్రయాలకు తాత్కాలిక నిషేధం విధించిన పుదుచ్చేరి ప్రభుత్వం, పీచు మిఠాయి తయారీ ఆహార భద్రత శాఖ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్ పొంది విక్రయాలు చేపట్టవచ్చని ఆదేశించింది. ఈ పరిస్థితుల్లో చెన్నై మెరీనా బీచ్‌లో విక్రయిస్తున్న పీచు మిఠాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు, వాటి నమూనాలను పరిశోధనలకు పంపిన నేపథ్యంలో, ఆ పీచు మిఠాయిలో కూడా క్యాన్సర్ వ్యాధికి కారణమైన రొడమైన్ బి రసాయనం కలుపుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ విషయమై ఆహార భద్రతా శాఖ సిఫారసులతో రాష్ట్రంలో పీచు మిఠాయి విక్రయాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రప్రభుత్వం, నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే కఠినచర్యలు చేపడతామని హెచ్చరించింది.

శరీరంలో 45 రోజులుంటుంది!

ఆహార భద్రతా శాఖ అధికారి సతీష్‌కుమార్ మాట్లాడుతూ... రొడమైన్ బి రసాయం జౌళి రంగానికి సంబంధించిన వృత్తిలో వినియోగిస్తారన్నారు. ఇలాంటి రసాయనాన్ని పీచు మిఠాయిలో వినియోగిస్తున్నారని తెలిపారు. సాధారణంగా తినుబండారాల్లో ఉంటే రసాయనాలు 24 గంటల్లో మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయని, కానీ రొడమైన్ బి రసాయనం శరీరం నుంచి బయటకు వెళ్లేందుకు 45 రోజులు పడుతుందని చెప్పారు. ఈ రసాయనం కిడ్నీ, కాలేయం, నాడీ వ్యవస్థ, మెదడు తదితరాలపై ప్రభావం చూపుతుందన్నారు. శరీరానికి రక్షణగా ఉండే పరమాణువులను నిర్వీర్యం చేసే గుణం ఈ రసాయనంలో ఉందని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నిరుద్యోగ రహితంగా బెజవాడ పార్లమెంట్

● మెగా జాబ్‌మేళాలో కేశినేని చిన్ని

విజయవాడ, ఫిబ్రవరి 17: నిరుద్యోగ రహితంగా బెజవాడ పార్లమెంట్ నియోజకవర్గం ఉండాలన్నదే తన లక్ష్యమని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంజిసెంటర్‌లోని లారీ యజమానుల సంఘ ఫంక్షన్ హాలులో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందినవారికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జాబ్‌మేళాకు 1800 మంది రాగా 830 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, మరో 386 మంది కాల్ లెటర్లు అందుకున్నారన్నారు. ఈనెల 22న జగ్గయపేట, 28న మైలవరంలో జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నామని యువత సద్వినియోగపరచుకోవాలని కోరారు. 2019 నుంచి రాష్ట్రంలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఎటువంటి విధ్వంసం చోటు చేసుకుందో అందరికీ తెలిసిందేనన్నారు. యువతకు చంద్రబాబు మంచి భవిష్యత్ కల్పిస్తారని హామీ ఇస్తున్నట్టు తెలిపారు.


నియామకపత్రాలు అందిస్తున్న గద్దె, చిన్ని

బుద్దా వెంకన్న అనుచరుడు భాను అకాలమృతి


● కుటుంబసభ్యులకు రూ.25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన వెంకన్న

వన్‌టౌన్, ఫిబ్రవరి 17: ఉత్తరాంధ్ర టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న డ్రైవర్ బావిశెట్టి భాను (49) శనివారం అకాల మరణం చెందారు. భవానీపురం బ్యాంక్ సెంటర్‌లో నివాసం ఉంటున్న భాను 30ఏళ్లుగా వెంకన్న ముఖ్య అనుచరుడుగా ఉంటున్నారు. 10 రోజుల క్రితం స్వల్ప అనారోగ్యానికి గురై ఇంటివద్ద పడిపోయాడు. ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకవెళ్లగా పరీక్షలు చేసిన వైద్యులు తలలో రక్తం గడ్డ కట్టిందన్నారు. వారం క్రితం శస్త్రచికిత్స చేయగా పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడు. కృష్ణలంక స్వర్గపురిలో అంత్యక్రియలు నిర్వహించారు. బుద్దా వెంకన్న, అల్లుడు కే రవీంద్ర పాడెను మోసి, అశ్రుతర్పణం వదిలారు. అతడి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. అనంతరం భాను కుటుంబ సభ్యులను బుద్దా వెంకన్న ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇదే సందర్భంలో ఆయన తన దాతృత్వాన్ని ప్రదర్శించి భాను కుటుంబసభ్యులకు రూ.25లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. అలాగే భాను సంతానం ఇద్దరు కుమారులు స్థిరపడే వరకు చదువుకునేందుకు అండగా ఉంటానన్నారు.


భాను పాడెను మోస్తున్న బుద్దా వెంకన్న

నేడు తుమ్మలపల్లిలో రామరాజ భూషణుడి విగ్రహావిష్కరణ

వన్‌టౌన్: స్థానిక తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం రామరాజ భూషణుడు విగ్రహావిష్కరణ జరుగుతున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భట్రాజు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి విగ్రహావిష్కరణ చేస్తారన్నారు. ఇదే వేదికపై రామరాజ భూషణ్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ 40వ వార్షికోత్సవం కూడా జరుగుతుందన్నారు. సేవా అవార్డులు, పేద మెరిట్ విద్యార్థులకు పారితోషికం ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కురుక్షేత్ర నాటకం ప్రదర్శితమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు, రాజకీయ నేతలు పాల్గొంటారన్నారు.



రూ.19.20లక్షల విదేశీ సిగరెట్ల సీజ్

విజయవాడ: పార్సిల్‌లో వచ్చిన విదేశీ సిగరెట్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోనగర్‌లోని క్రాంతి పార్సిల్ సర్వీసు కార్యాలయానికి సిగరెట్లు పార్సిల్‌లో వచ్చాయన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు శుక్రవారం రాత్రి సోదాలు చేశారు. ఎలాంటి చిరునామా లేకుండా వచ్చిన ఈ పార్సిల్‌ను తెరిచి చూడగా విదేశీ సిగరెట్లున్నాయి. తెనాలిలో చిరునామాతో పార్సిల్ వచ్చినప్పటికీ దాన్ని పరిశీలించగా అక్కడెవరూ లేరని, నకిలీ చిరునామాతో ఈ పార్సిల్‌ను చేశారని గుర్తించారు. ఈ సిగరెట్లను తదుపరి దర్యాప్తు నిమిత్తం పటమట పోలీసులకు అప్పగించారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 10 పతకాలు

విజయవాడ స్పోర్ట్సు: మహారాష్ట్రలోని పూణే ఛత్రపతి స్టేడియంలో జరిగిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఉమ్మడి కృష్ణా అథ్లెట్లు మొత్తం 10 పతకాలను కైవసం చేసుకున్నారని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కంది గంగాధరరావు, జీవీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారంతో ముగిసిన ఈ పోటీల్లో మొత్తం 2 స్వర్ణాలు, 3 రజతాలు, 5 కాంస్యాలను అథ్లెట్లు సాధించారన్నారు. 85 ప్లస్ ఏజ్ కేటగిరిలో సీహెచ్.రామస్వామి 1500 మీటర్ల పరుగులో రజతం, హేమర్ త్రోలో కాంస్యం, బి.జోజి 5 కిలోమీటర్ల వాక్‌లో రజతం, లాంగ్ జంప్‌లో కాంస్యం, 75 ప్లస్‌లో ఏవీ సుబ్బలక్ష్మి 4 X 100 రిలేలో స్వర్ణం, 60 ప్లస్‌లో కే. గీతాంజలి 300 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్యం 60 ప్లస్‌లోనే కే.రణధీర్ కుమార్ 4 X 400 రిలేలో స్వర్ణం, 4 X 100 రిలేలో రజతం, 45 ప్లస్‌లో రోశయ్య 4 X 400 రిలేలో కాంస్యం, ఎస్.అంజనేయకుమార్ 400 మీటర్ల రిలేలో కాంస్యం సాధించారన్నారు.

గంజాయితో రౌడీషీటర్ అరెస్టు

విజయవాడ: జైలునుంచి బయటకొచ్చి గంజాయి విక్రయాలకు దిగిన రౌడీషీటర్‌ను అజిత్‌సింగ్ నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. బుడమేరు మధ్యకట్ట ప్రాంతానికి చెందిన అద్దంకి సతీష్‌పై అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఇప్పటి వరకు జైల్లో ఉన్న అతడు 2రోజుల క్రితం బయటకు వచ్చాడు. డబ్బుల కోసం పీఎన్‌బీఎస్ వద్ద 5కిలోల గంజాయిని రూ.10వేలకు కొనుగోలు చేశాడు. దాన్ని గ్రాములుగా ప్యాకెట్లలో పెట్టి రైల్వేస్టేషన్ వద్ద విక్రయించడానికి బయలుదేరాడు. ఇన్‌స్పెక్టర్ గురుప్రకాశ్‌కు సమాచారం రావడంతో బుడమేరు వంతెన వద్ద గస్తీ నిర్వహించి పట్టుకున్నారు. అతడి నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

జగన్‌పై తిరగబడుతున్న 'సానుభూతి'

● రాష్ట్ర మున్సిపల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు చిన్నయ్యదొర

విజయవాడ: జగన్ గెలుపునకు 2019లో ఉపయోగపడిన సానుభూతి అంశాలే ఇప్పుడు తిరుగుబాటుకు సిద్ధమయ్యాయని రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర శనివారం ఒక ప్రకటన విమర్శించారు. కోడికత్తి, వివేకానందరెడ్డి హత్యతోపాటు షర్మిలను 2019లో ఉపయోగించుకుని జగన్ అధికారంలోకి వచ్చారని, నాడు సానుభూతిని పెంచిన ఈ అంశాలే ఇప్పుడు తిరుగుబాటు చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ఓటమి ఖాయమన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

ధర్నాచౌక్: రాష్ట్రంలోని క్రైస్తవులు, క్రైస్తవ సంఘాల సమస్యల పరిష్కారానికి ఆలిండియా క్రిస్టియన్ ఫెలోషిప్ (ఏఐసీఎఫ్) కృషి చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డేనియల్ పోలిమెట్ల తెలిపారు. గాంధీనగర్‌లోని ఓహోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. క్రైస్తవ హక్కులకై పోరాడుతున్న క్రైస్తవ నాయకులకు అండగా ఉంటామన్నారు. నేతలు వారి గ్రామాల్లో ఉన్న సమస్యలను ఏఐసీఎఫ్ సేవాదళ్ నాయకుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. క్రైస్తవుల హక్కుల పరిరక్షణ, వారి అభ్యున్నతికి ఏఐసీఎఫ్ పాటుపడుతుందని స్పష్టం చేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

కృష్ణానదిలో ఈతకు దిగి యువకుడి మృతి

తాడేపల్లి: మండలంలోని ఉండవల్లి సమీపంలోని కొండవీటి వాగు ఎత్తిపోతల ప్రాంతంలో శనివారం ఓ వ్యక్తి ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయాడు. విజయవాడ అయ్యప్ప నగర్‌కు చెందిన కుంచే లోకేశ్ (27) భార్య, ఇద్దరు పిల్లలతో శనివారం సాయంత్రం నది వద్దకు వచ్చి స్నానానికి దిగారు. పిల్లలకు స్నానం చేయించిన అనంతరం లోకేశ్ కొద్దిసేపు నీటిలోనే ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. లోకేశ్ బయటకు రాకపోవడంతో భార్య కమల కుమారి స్థానిక మత్స్యకారులకు విషయం తెలిపింది. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మత్స్యకారుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. మృతుడు బజాజ్ క్యాపిటల్‌లో పని చేస్తాడు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజు చెప్పిందే వేదం!

● దుర్గగుడి నిత్యాన్నదాన విభాగంలో రాజు, రాధాకృష్ణ చేతివాటం! ● 15 ఏళ్లుగా తిష్ట ● ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవు

వన్‌టౌన్, ఫిబ్రవరి 17: దుర్గగుడి నిత్యాన్నదాన విభాగంలో ఓ ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు హల్‌చల్ చేస్తున్నారు. అక్కడ వారిద్దరిదే పైచేయిగా ఉంది. చేతివాటంలో ఆరితేరారు. 15 ఏళ్లుగా ఇక్కడే కొనసాగుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాట. నిత్యాన్నదానశాలలో భోజనం చేసిన భక్తులు కొందరు తమకు తోచినట్టు విరాళాలు ఇస్తుంటారు. వీటిని సేకరించే క్రమంలో రాజు, రాధాకృష్ణ చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కాగా కొందరు భక్తులు విరాళాలిచ్చి రశీదు అక్కర్లేదంటూ వెళ్లిపోతుంటారు. దీన్ని ఈజీ మనీగా మార్చుకున్న ఆ ఇద్దరు తమ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో కొంత వాటాను సంబంధిత అధికారులకు, తోటి పనివాళ్లకు ముట్టచెబుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఈఈ రమాదేవి అన్నదాన విభాగంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సిబ్బంది వద్ద క్యాష్ కౌంటర్‌లో ఉండాల్సిన డబ్బు కంటే అదనంగా రూ.2వేలకు పైగా ఉన్నట్లు గుర్తించి ఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఈవో ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి. అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమితుడైన రాధాకృష్ణ తన పని వదిలేసి అన్నదానం క్యాష్ కౌంటర్‌లో కూర్చుని హల్‌చల్ చేస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. అన్నదాన విభాగంలో రోజుకు కనీసం 2వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తారు. శుక్రవారం, ఆదివారం, పర్వదినాల్లో రెట్టింపు ఉంటుంది. దేవస్థానం మెనూ ప్రకారం రోజూ భక్తులకు వండి వడ్డించాలి. కానీ మెనూ ప్రకారం కాకుండా సరుకులను ఆ ఇద్దరు పక్కదోవ పట్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మిగతా వారెవ్వరూ వారిమాటను కాదనేలా పరిస్థితిని మార్చుకున్నట్టు తెలుస్తోంది.


భక్తుల నుంచి డొనేషన్ తీసుకుంటున్న రాధాకృష్ణ

ఘాట్‌రోడ్డులో భక్తుల రాకపోకలకు ఆటంకం

దుర్గగుడి ఘాట్‌రోడ్డులో భక్తుల రాకపోకలకు అటంకం కలిగిస్తూ అడ్డంగా కార్లను నిలిపేస్తున్నారు. వారు తమ సుఖాలను, హోదాలను చూసుకుంటున్నారే గానీ సామాన్య భక్తులను గురించి ఆలోచించడం లేదు. నేరుగా గుడి ముందుకే తమ కారు వెళితే బావుణ్ను అనే ధోరణిలో ఉంటున్నారు. తమ హోదాలు, సిఫారసులు చెప్పుకుంటూ సెక్యూరిటీని కూడా కాదని ఇష్టానుసారం కార్లు నిలిపివేస్తున్నారు. ఘాట్‌రోడ్డు రిసెప్షన్ పక్క డోనర్‌సెల్‌ను నిర్మిస్తున్నారు. దీనివల్ల భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది.




మల్లేశ్వరస్వామి విగ్రహాలకు పుష్పాధివాసం

విద్యుత్ కాంతులతో శోభాయమానంగా మల్లేశ్వరాలయం

వన్‌టౌన్, ఫిబ్రవరి 17: ఇంద్రకీలాద్రిపై పునఃప్రతిష్ఠకు సిద్ధమైన మల్లేశ్వరాలయం శనివారం రాత్రి విద్యుత్ కాంతులతో శోభిల్లింది. ఆధ్యాత్మిక వాతావరణంలో పూజాదికాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చివరిగా స్వామి విగ్రహాలకు పుష్పాదివాసం నిర్వహించారు. ఇతర ప్రక్రియలన్నీ శాస్త్రానుసారంగా అర్చకస్వాములు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈవో రామారావు గోపూజ నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో సినీ నటుడు గోపీచంద్

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శనివారం ప్రముఖ సినీ నటుడు గోపీచంద్ దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో ఆయన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్

'చలసాని'కి ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

చిట్టినగర్, ఫిబ్రవరి 17: పాడిరైతుల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులుకు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ వొకేషనల్ ఎక్సలెన్స్ అవార్డును అందజేసింది. గుణదలలోని రోటరీ క్లబ్ ఫంక్షన్ హాలులో శనివారం ఆయనకు అవార్డు అందజేసి సత్కరించారు. వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ముఖ్య అతిథిగా రోటరీ ఇంటర్నేషనల్ ట్రైనర్ డాక్టర్ శ్యామ్ మొవ్వ, కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, రోటరీ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు మున్వార్ బేగ్, వొకేషనల్ డైరెక్టర్ సీబీజీ తిలక్, సెక్రటరీ డాక్టర్ యండా సంతోష్ పాల్గొన్నారు.


చలసాని ఆంజనేయులుకు వొకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందజేస్తున్న రోటరీ క్లబ్ నిర్వాహకులు

బీసీలను అగౌరవపరచిన జగన్: లుక్కా


ఎన్టీఆర్, పూలే చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

విద్యాధరపురం, ఫిబ్రవరి 17: బీసీలను జగన్ రెడ్డి అవమానపరిచాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా టీడీపీ బీసీ గౌడ సాధికారిక విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి, జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లుక్కా మాట్లాడుతూ బీసీలను చంద్రబాబు అన్ని విధాలా ఆదుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలందరూ చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలన్నారు. బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ కులసంఘాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి జగన్‌రెడ్డి మోసాలను, పాలనా వైఫల్యాలను ప్రజలలోకి తీసుకు వెళ్లాలన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మరక శ్రీనివాస్, బీసీ గౌడ్ సాధికారిక కార్యదర్శి బొల్లా వెంకటేశ్వరరావు, నేతలు పిర్యా సోమేశ్వరరావు, బెజవాడ తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

రూ.వెయ్యికోట్ల బడ్జెట్‌తో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అన్ని ముఖ్య రాజకీయ పార్టీలను కోరనున్నట్టు జాతీయ ముదిరాజ్ యూత్ ప్రెసిడెంట్ మహేంద్ర కేసరి అన్నారు. నగరంలోని ముదిరాజుల కార్యాలయంలో శనివారం జిల్లా ముదిరాజ్‌ల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏపీలో 40 లక్షలకు పైగా ముదిరాజ్‌లు ఉన్నారని, దేశవ్యాప్తంగా 18 కోట్ల వరకు ఉన్నారన్నారు. వచ్చే నెలలో జిల్లాలో ముదిరాజ్‌ల భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. నేతలు పిట్టల రాజు, సిరిబోయిన శివాజీ, బచ్చు కోటేశ్వరరావు, రాచకొండ శ్రీనివాస్, బచ్చు కిషోర్, సిరిబోయిన కృష్ణకుమారి, బోనం వెంకటయ్య, రాచకొండ రేవతి పాల్గొన్నారు.

వలంటీర్లపై అంత ప్రేమ ఎందుకో?

వలంటీర్లపై జగన్‌రెడ్డి వల్లమాలిన ప్రేమ చూపిస్తున్నాడని ప్రజల సొమ్ముతో తన సొంత సైన్యంగా పిలుచుకుంటున్న వలంటీర్లకు కానుకలిస్తున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి కనకాచారి అన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన బండారాన్ని వలంటీర్లు బయటపెడతారనే వారిపై వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తున్నాడన్నారు. వలంటీర్లకు ఏ హక్కు లేకపోయినా ప్రజల డేటాను సేకరిస్తున్నారన్నారు. టీడీపీ, ఇతర పార్టీల సానుభూతి పరుల ఓటర్లను తొలగిస్తూ వైసీపీ అనుకూల ఓటర్లను చేర్పిస్తూ దొంగ ఓట్లను చేర్పించడం కోసమే వలంటీర్లను జగన్‌రెడ్డి తన బ్రాండ్ అంబాసిడర్లని చెబుతున్నారన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సురేష్‌కుమార్

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

● పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 17: విద్యార్థులు తరగతి గదుల్లో చదువుతో పాటు బాహ్య ప్రపంచంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ విద్యను పూర్తి చేయాలని ఏపీ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ అన్నారు. ఎడ్యుకేషన్ ఎపీఫనీ మెరిట్ టెస్ట్-2024 రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి విజేతల బహుమతి ప్రదానోత్సవ సభ శనివారం ఎంజీ రోడ్డులోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఎడ్యుకేషన్ ఏపీఫనీ సంస్థ కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన సురేష్‌కుమార్ మెరిట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ట్రోఫీలు, నగదు బహుమతిని అందజేశారు. సంస్థ కార్యదర్శి డి.స్వామి, డీఎస్‌వోలు ఎం.మహేశ్వరరెడ్డి, ఎండీ సాధిక్, ఎం.హుస్సేన్, కె.వెంకటరమణ, సంస్థ సభ్యులు నేతాజీ, సుబ్రహ్మణ్యం, బేబీరాణి, నాగబాబు, త్రినాథ్‌కుడ్డి, పి.సురేష్, రాఘవ, జయరామిరెడ్డి, ఎల్.శ్రీనివాసరావు, శివప్రసాద్, శ్రీకృష్ణ, యాస్మిన్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం పరిధిలోకి

ఆయుష్ వైద్యులను తేవాలి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 17: ఆంధ్రా బోర్డు ఫర్ ఆయుర్వేద స్థానంలో ఏపీ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసిన సీఎం జగన్‌కు నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్.పీవీఎస్.విజయభాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ ఆయుష్ వైద్యులను క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం పరిధిలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ వేముల భానుప్రకాష్ విలేజ్ క్లినిక్‌లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా ఆయుర్వేదిక్ గ్రాడ్యుయేట్స్‌కు అవకాశం కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలన్నారు. ఆయుర్వేద అభివృద్ధి మరియు వైద్యుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లపుడూ అసోసియేషన్ సహకరిస్తుందన్నారు. బి.వెంకట రమణ, బి.మురళీధర్, జి.చిన్నరాజు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న నాట్యకళాకారులు

భరతమునికి కళానీరాజనం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భరతముని జయంతి సందర్భంగా సంస్కార భారతి విజయవాడ మహానగర్, సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో 2 రోజులపాటు నిర్వహించే కూచిపూడి, భరతనాట్యం, జానపద పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. మొత్తం 300 మంది కళాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. మొత్తం ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ కృష్ణ, విజయవాడ మహానగర అధ్యక్షుడు పీవీ భాస్కరశర్మ, సంస్కార భారతి ప్రాంత ప్రధాన కార్యదర్శి దుర్భ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంచనాలు ఆకాశంలో.. అభివృద్ధి పాతాళంలో..!

● టీడీపీ ఫ్లోర్ లీడర్ బాలస్వామి

చిట్టినగర్, ఫిబ్రవరి 17: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై భారాలు మోపేలా ఉందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి అన్నారు. వీఎంసీ బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంచనాలు ఆకాశంలో ఉంటే, వ్యయాలు, అభివృద్ధి పాతాళంలో ఉన్నాయన్నట్టుగా బడ్జెట్ ఉందన్నారు. జనవరి 10లోపు పెట్టాల్సిన బడ్జెట్‌ను రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ముగిశాక పెడుతున్నారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలున్నాయి కాబట్టే వెలంపల్లిని సెంట్రల్‌కు మార్చి మల్లాదికి సీట్ లేకుండా చేశారన్నారు. రాష్ట్రం ప్రభుత్వం నుంచి రూ.150 కోట్లు తెచ్చామని చెబుతున్న అధికారపార్టీ రూ.9కోట్లు తెచ్చి, జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చులు చేసి ప్రజలను మభ్య పెడుతున్నారు. వైసీపీకి ఇదే చివరి సమావేశమని, రానున్న కౌన్సిల్ సమావేశం టీడీపీ హయాంలో జరుగుతుందన్నారు.

వీఎంసీ బడ్జెట్ భారాల బడ్జెట్: సత్యబాబు

మేయర్ భారాలు లేని బడ్జెట్‌ని ప్రసంగించారని, వైసీపీ పాలన ఆరంభం నుంచి ప్రజలపై భారాలు మోపటమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని వీఎంసీ బడ్జెట్ ప్రజలకు భారాల బడ్జెట్ అని బోయి సత్యబాబు దుయ్యబట్టారు. బడ్జెట్ అంకెల గారడీలా ఉందన్నారు ఆస్తిపన్ను భారం రూ.144 కోట్లు, వాటర్ చార్జీలు కోట్లు, డ్రైయినేజి రూ.32కోట్లు, చెత్త పన్ను రూ.18 కోట్లు ఇలా అన్ని భారాలు ప్రజలపైనే మోపుతూ ఈ బడ్జెట్ ప్రజలపై భారం లేదని చెప్పండం హాస్యాస్పదం ఉందన్నారు. స్ట్రాం వాటర్ నిధులు రూ 289 కోట్లు ఏమైయాయే తెలియదని వాటిని రాబట్టేందుకు పాలక పక్షం శ్రద్ధ పెట్టకుంటా ప్రజలపై భారాలు మోపేందుకు చూస్తోందన్నారు.

కళ్లకు కట్టినట్టుగా రాజధాని అరాచకాలు

ఖతార్ రాజధాని దోహాలో 'రాజధాని ఫైల్స్' సినిమాను వీక్షించిన అభిమానులు



వన్‌టౌన్, ఫిబ్రవరి 17: రాజధాని అమరావతిలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను కళ్లకట్టినట్టుగా రాజధాని ఫైల్స్ సినిమాలో చూపించారని రాజధాని అమరావతి అభిమానులు పేర్కొన్నారు. ఖతార్ రాజధాని దోహాలో శుక్రవారం వారు రాజధాని ఫైల్స్ సినిమా తొలి షోను వీక్షించారు. అక్కడి తెలుగువారు పెద్ద సంఖ్యలో తమ కుటుంబాలతో సహా వచ్చి సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ భాను శంకర్ సోదరిని సత్కరించడం విశేషం, అనంతరం చిత్రంలోని అంశాలను గురించి వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అమరావతిలో జరుగుతున్న సంఘటనలను ఉన్నది ఉన్నట్టుగా వాస్తవాలను దర్శకుడు ప్రతిబింబింపజేశారన్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్ర చేసిన రైతులకు ఒక పూట భోజనం అందించిన అదృష్టం తమకు దక్కిందని కొందరు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కొందరు యువకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు, ఉద్యోగులకు ఈనెల 12న రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ఒత్తిడితో 3 మాసాల నుంచి అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఉద్యోగుల క్వార్టర్లు వాడుకలో ఉన్నాయని చెబుతూ జీవో ఇవ్వడం దారుణమన్నారు. 90శాతం పూర్తయిన క్వార్టర్లను పాడు పెట్టించి ఇప్పుడు జీవోతో తప్పుదోవ పట్టించారన్నారు. భవనాలు పూర్తిచేసి ఉద్యోగులకిచ్చి ఉంటే నెలకు రూ.78కోట్ల చొప్పున ఏడాదికి సుమారు రూ.1000 కోట్లు హెచ్‌ఆర్‌ఏ రూపంలో సీఆర్‌డీఏకు వచ్చి ఉండేదన్నారు. ఇకనైనా ప్రజలు తమ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని, ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు ఏరువాక పాటకు నటి అద్భుతంగా నాట్యం చేశారని నటుడు వినోద్‌కుమార్, నటి వాణీ విశ్వనాథ్ బాగా నటించారని, వారికి అభినందనలు తెలిపారు. తెలుగు ప్రజలు ఈ చిత్రాన్ని తప్పక చూడాలన్నారు.

ఇండియా కూటమిలోకి వైసీపీ!

ప్రతిపాదనలు వస్తే పరిశీలిస్తాం: తులసిరెడ్డి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 17: ఇండియా కూటమిలో చేరటానికి వైసీపీ నుంచి ప్రతిపాదనలు వస్తే పరిశీలిస్తామని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, వైసీపీని దూరం పెడుతున్నట్లు సంకేతాలు ఇస్తున్న నేపథ్యంలో ఇండియా కూటమిలోకి చేరుతుందా? అన్న ప్రశ్నకు ఆయన పై విధంగా స్పందించారు. 'రాష్ట్రానికి బీజేపీ తీవ్ర ద్రోహం చేసింది. పోలవరం, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లాంటి వాటితో పాటు రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీతో పొత్తు కోసం టీడీపీ, జనసేన, వైసీపీ పాకులాడుతున్నాయి. ఇలాంటి పార్టీలకు ఓటు వేస్తే మన వేలితో మన కన్ను పొడుచుకున్నట్లే. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ సేవలు అవసరం. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో మా పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారు' అని తులసిరెడ్డి పేర్కొన్నారు.

జగన్‌కు పాలించే అర్హత లేదు: రామకృష్ణ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 17: సీఎం జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. శనివారం కర్నూలు సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు ప్రత్యేక హోదా తీసుకొస్తామని, విభజన హామీల కోసం పోరాటం చేస్తామని చెప్పాడు. కానీ ఇప్పుడు ఎందుకు నోరెత్తడం లేదు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఢిల్లీలో ప్రత్యేక హోదా కోసం ఉద్యమాలు చేసినా కూడా బీజేపీ పట్టించుకోలేదు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మంత్రివర్గంలో డిప్యూటీ సీఎం సిసోడియాను రూ.100 కోట్ల స్కాంలో బీజేపీ ఇరికించి ఏడాదిపాటు జైలుపాలు చేసింది. మరి రూ.వేల కోట్ల స్కాం చేసిన జగన్‌రెడ్డిని వెయ్యి సంవత్సరాల పాటు జైల్లో ఉంచాలి. కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు వ్యతిరేకంగా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న విజయవాడలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో భారీ సదస్సును నిర్వహిస్తున్నాం' అని రామకృష్ణ తెలిపారు.

ఫ్యానుకు ఓటేస్తే... ఆంధ్రకు ఉరేసినట్టే

» పొత్తులను అధినాయకత్వం నిర్ణయిస్తుంది: విష్ణుకుమార్‌రాజు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తే ఆంధ్రప్రదేశ్‌కు ఉరేసినట్టేనని బీజేపీ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంట్ చార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చిన జగన్ ఆ తర్వాత ఎనిమిది సార్లు చార్జీలు పెంచారు. మద్యపానాన్ని నిషేధిస్తామని చెప్పి.. ఆ తర్వాత లిక్కర్ దందా చేశారు. ఏపీ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓటేస్తే ఐదేండ్లలో జగన్ ప్రజలకు చేసిందేమీ లేదు. దొంగ ఓట్లతో మళ్లీ అధికారంలోకి రావాలని జగన్ చూస్తున్నారు. ఆయనకి ఓటడిగే హక్కు లేదు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగనరెడ్డికి ప్రతిపక్షంలో కూర్చునే సీట్లు కూడా రావు. ఏపీలో పొత్తులపై బీజేపీ అధినాయకత్వం నిర్ణయిస్తుంది. ఆ విషయాన్ని త్వరలోనే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రకటిస్తారు' అని విష్ణుకుమార్‌రాజు తెలిపారు.

చర్చిలను రాజకీయ వేదికలుగా మార్చకండి: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 'నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు అని తరచూ మాట్లాడే సీఎం జగన్ ఏపీలో ఖాళీ అయ్యే మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు స్థానాలను జనాభాలో ఐదు శాతం మాత్రమే ఉన్న ఆయన సొంత సామాజిక వర్గానికి చెందిన వారికే కేటాయించడం ఎంతవరకు సమంజసం?' అని ఎంపీ రఘురామకృష్ణరాజు ప్రశ్నించారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గానికి చెందిన నాయకులకు ఒక్కొక్క రాజ్యసభ స్థానాన్ని కట్టబెట్టి ఉండవచ్చు కదా? అంటూ నిలదీశారు. రెండింట మూడో వంతు తన సొంత సామాజిక వర్గానికి కేటాయించి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేశానని చెప్పుకోవడం జగన్‌కే చెల్లిందంటూ ఎద్దేవా చేశారు. శనివారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన తన నివాసంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'ఓడిపోయే స్థానాల్లో, ఆర్థికంగా బలమైన నేతలు లేకపోతే జగన్‌రెడ్డి బీసీ మంత్రాన్ని జపిస్తున్నారు తప్ప... ఎక్కడా వారికి పెద్దపీట వేసిందే లేదు. మనశ్శాంతి కోసం చర్చిలకు వచ్చే భక్తులకు జగన్‌ను గెలిపించండని, ఫ్యాను గుర్తుకు ఓటేయండని ఫాదర్లు చెప్పవద్దు. మానసిక ప్రశాంతతను ఇచ్చే చర్చిలను రాజకీయ వేదికలుగా మార్చవద్దు. జగన్‌పై ఆయన మంత్రివర్గ సహచరులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు పరోక్షంగా సెటైర్లు వేశారు. ఎక్కడ పుట్టాడో... ఎక్కడి వాడో... ఇక్కడకు వస్తే ఎవరు ఓట్లు వేస్తారు? అంటూ బీజేపీ నేత సత్య కుమార్‌ను ఉద్దేశించి మంత్రి పెద్దిరెడ్డి చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి చేసినట్లుగా ఉన్నాయి' అంటూ నియోజకవర్గాల మార్పిళ్లను ఉదహరించారు.

ప్రైవేట్ కార్యక్రమాలకు స్టేడియాలు

» ఆదాయం కోసం ఇస్తామన్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్

» 'ఆడుదాం ఆంధ్రా'కు కూడా అందుకే ఇచ్చామని వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పరిధిలోని స్టేడియాలను ప్రైవేట్ కార్యక్రమాలకు కూడా లీజుకు ఇస్తామని ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి అన్నారు. శనివారం విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీఏ అభివృద్ధి నివేదిక పుస్తకాన్ని ఇతర సభ్యులతో కలసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపీనాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏసీఏకి ఆదాయం తీసుకొచ్చేందుకే స్టేడియాలను ప్రైవేట్ కార్యక్రమాలకు ఇస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి విశాఖ అంతర్జాతీయ స్టేడియంను ఇచ్చామని తెలిపారు. మంగళగిరి స్టేడియం విషయంలో కొన్ని న్యాయపరమైన సమస్యలు ఉండటంతో అభివృద్ధి మందగించిందని, మౌలిక సదుపాయాలు కల్పనలో ఇబ్బందులున్నాయని పేర్కొన్నారు. అక్కడ ఈ ఏడాది ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం కూడా అందించామని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని, దీనికి సంబంధించి చర్చలు జరుపుతున్నామని వివరించారు. ఏపీ నుంచి అంతర్జాతీయ క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఇందుకోసం టీమిండియా మాజీ ఆటగాళ్ల రవిశాస్త్రి, భరత్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రతిభ ఉన్న ఆంధ్రా క్రికెటర్లు జాతీయ జట్టుకు ఎంపికయ్యేందుకు గాను వారికి ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలో ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాటు చేస్తున్నామని గోపీనాథ్ రెడ్డి చెప్పారు. ఏసీఏ సిబ్బంది, క్రీడాకారులకు గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 400 మంది క్రీడాకారుల పౌష్టికాహారం కోసం ఏడాదికి రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఈ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ఏసీఏ అమలు చేస్తోందని వివరించారు. విశాఖలో 40 వేల సీట్ల సామర్థ్యంతో కొత్తగా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ కౌన్సిల్ సభ్యులు కె.వి.పురుషోత్తం, ఎన్.గీత, ఏసీఏ సీఈవో డాక్టర్ ఎం.వి.శివారెడ్డి, సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్.వి.చంద్రమౌళి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జగన్ సభ కోసం రహదారి మూతా?: అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభ కోసం అనంతపురం జిల్లాలో బెంగుళూరు - హైదరాబాద్ జాతీయ రహదారిని మూసివేయడమా..!' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విస్మయం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఇక్కడ ఒక ప్రకటన చేశారు. 'జగన్ సభను ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కన సభను పెట్టడమే తప్పు. ఆ సభ పేరుతో ఈ నెల 11 నుంచే ఈ రోడ్డుపై ఆంక్షలు విధించి ట్రాఫిక్‌ను కదలనీయడం లేదు. అనంతపురం జిల్లా రైతులు తమ పంటలు బెంగుళూరు, హైదరాబాద్ మార్కెట్లకు తీసుకువెళ్లలేని పరిస్థితి నెలకొంది. వేల వాహనాలు నిత్యం ప్రయాణించే జాతీయ రహదారి పక్కన సభ పెట్టి ఈ మాదిరిగా ఆంక్షలు విధించడం సైకో పాలనకు నిదర్శనం. ఈ రాష్ట్రంలో చట్టం ఉందా? అధికారులు ప్రజల డబ్బుతో జీతాలు తీసుకొంటున్నారా లేక వైసీపీ నుంచి తీసుకొంటున్నారా? ఈ ఆగడాలు ఎక్కువ రోజులు సాగవు. వైసీపీకి కౌంట్ డౌన్ మొదలైంది' అని అచ్చెన్న వ్యాఖ్యానించారు.

కడప జిల్లా అధ్యక్షునిగా శ్రీనివాసరెడ్డి

కడప జిల్లా టీడీపీ అధ్యక్షునిగా రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకూ అధ్యక్షునిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డిని పార్టీ ఉపాధ్యక్షునిగా నియమించారు.





విశాఖ సాగరతీరంలో నేవీ రిహార్సల్స్



రేపటి నుంచి మిలాన్-2024

» విశాఖ బీచ్ రోడ్డులో విస్తృత ఏర్పాట్లు

» రిహార్సల్స్‌తో సందడే సందడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగరతీరంలో మిలాన్-2024కు సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 19 నుంచి 27 వరకు రెండు దశల్లో జరిగే మిలాన్-2024కు ఆర్కే బీచ్ రోడ్డులో నేవీ, జిల్లా అధికారులు కలిసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మిలాన్‌కు 50 దేశాల నుంచి అతిథులు వస్తున్నారు. 15 విదేశీ యుద్ధ నౌకలు పాల్గొంటాయి. మేరీటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ కూడా రానుంది. భారత నౌకాదళం తరఫున 20 యుద్ధనౌకలు, యుద్ధ విమాన వాహక నౌకలు విక్రాంత్, విక్రమాదిత్య, పీ 8ఐ నిఘా విమానం, మిగ్ 29కే తదితరాలు పాల్గొంటున్నాయి. తొలిదశ హార్బర్ ఫేజ్‌లో ఇంటర్నేషనల్ సిటీ పరేడ్, మారీటైమ్ సెమినార్, మిలాన్ టెక్ ఎక్స్‌పో ఉంటాయి. రెండో దశ సీ ఫేజ్‌లో భాగంగా గగనతల పోరాట పటిమను ప్రదర్శించే విమానాలు, హెలికాప్టర్లు, యాంటీ సబ్‌మెరైన్ విన్యాసాలు ప్రదర్శించనున్నాయి. బీచ్‌రోడ్డులో నిర్వహించే ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌కు లక్ష మందికి పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున 30 ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటుచేసినట్టు కలెక్టర్, నేవీ అధికారులు శనివారం వివరించారు. వీవీఐపీ, వీఐపీ రక్షణ ఏర్పాట్లు, బందోబస్తు వంటివాటిని పోలీసు విభాగం చూస్తోంది. బీచ్ ఏరియాలో బారికేడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. ఏపీఐఐసీ, ఏయూ మైదానంలో పార్కింగ్ సదుపాయం కల్పించారు. కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నేవల్ కమాండర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, మిలాన్ నిర్వహణలో భాగంగా శనివారం జరిగిన రిహార్సల్స్ ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

మిలాన్‌లో సందడి చేయనున్న సీ హాక్స్



మిలాన్-2024లో సందడి చేసేందుకు మూడు ఎంహెచ్-60 ఆర్ సీహాక్ హెలికాప్టర్లు శనివారం ఇక్కడికి చేరుకున్నాయి. ఇవి రెండు టర్బో ఇంజన్లతో పని చేస్తాయి. వీటిని మల్టీ విషన్ హెలికాప్టర్లుగా వ్యవహరిస్తారు. సబ్‌మెరైన్లను వెంటాడడంలోను, పైనుంచి దాడి చేయడంలోనూ వీటికివే సాటి. అవసరమైనప్పుడు పైనున్న రెక్కల్ని మడత పెట్టి దూసుకుపోవడం వీటి ప్రత్యేకత. సముద్రంలో పయనిస్తున్న నౌకలపై అతి తక్కువ స్థలంలోనే ల్యాండ్ అయ్యేందుకు వీలుగా దీని తోకను డిజైన్ చేశారు.

వైద్య కళాశాలలపై 'స్కానింగ్' భారం

» విద్యార్థుల జవాబు పత్రాలను స్కాన్ చేసే బాధ్యత కాలేజీలదేనన్న వర్సిటీ

» దీనికిగాను గదులు, కంప్యూటర్లు, మిషన్లు ఏర్పాటు చేయాలని యాజమాన్యాలకు లేఖ

» సంస్కరణల నెపంతో కీలక బాధ్యతల నుంచి తప్పించుకుంటున్న హెల్త్ యూనివర్సిటీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆరోగ్య విశ్వవిద్యాలయంలో సంస్కరణల పేరిట అధికారులు మెడికల్ కాలేజీలపై భారం మోపుతున్నారు. ఇటీవల అడ్మిషన్లకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్ల స్ర్కూటినీ బాధ్యతలను కాలేజీలకే అప్పగించారు. ఇప్పుడు పరీక్షల విధానంలో కూడా కొన్ని కీలక మార్పులు చేస్తున్నారు. దీనిని కూడా మెడికల్ కాలేజీలకే అప్పగించేలా నిర్ణయాలు తీసుకున్నారు. వర్సిటీ నిర్వహించే ఎంబీబీఎస్, మెడికల్ పీజీ పరీక్షలకు సంబంధించిన మొత్తం బాధ్యతను కాలేజీలపై పెట్టేలా అడుగులు వేస్తున్నారు. ఇప్పటి వరకు మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు పరీక్షలు రాసిన తర్వాత వాటిని సీల్డ్ కవర్‌లలో వర్సిటీలోని ప్రత్యేక విభాగానికి పంపిస్తారు. ఇక్కడి సిబ్బంది ఆ జవాబు పత్రాలను స్కాన్ చేసి, డీకోడ్ చేస్తారు. తర్వాత ఈ పత్రాలను వివిధ కాలేజీలకు మూల్యాంకనం నిమిత్తం పంపుతారు. ఇదంతా అత్యంత పగడ్బందీగా జరుగుతుంది. అయితే, ఈ ప్రక్రియలో వర్సిటీ అధికారులు మార్పు చేస్తున్నారు. జవాబుపత్రాలను స్కానింగ్ చేసే బాధ్యత నుంచి వర్సిటీ తప్పుకోనుంది. ఆ బాధ్యతను మెడికల్ కాలేజీలకు అప్పగిస్తోంది. ఆయా కాలేజీల్లో విద్యార్థులు పరీక్ష రాసిన తర్వాత కళాశాల యాజమాన్యమే జవాబు పత్రాలను తీసుకుని, కాలేజీలోనే స్కాన్ చేసి, ఆన్‌లైన్‌లో వాటిని వర్సిటీకి పంపించాల్సి ఉంటుంది. అప్పుడు వర్సిటీ వాటిని డీ కోడ్ చేసి మూల్యాంకనం నిమిత్తం కాలేజీల్లో టీచింగ్ సిబ్బందికి పంపిస్తుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని మెడికల్ కాలేజీలకు యూనివర్సిటీ లేఖలు రాసింది. జవాబు పత్రాల స్కానింగ్ కోసం ప్రతి కాలేజీలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని, 15 కంప్యూటర్లు, స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని వర్సిటీ కళాశాలలను ఆదేశించింది. ప్రత్యేక సిబ్బందితో పాటు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొంది. అయితే, ఈ తాజా నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. హెల్త్ వర్సిటీ చేయాల్సిన ప్రధాన విధుల్లో అడ్మిషన్లు, పరీక్షల నిర్వహణ అత్యంత కీలకం. ఆ తార్వత రిసెర్చ్, ఎన్ఎంసీ నుంచి కో-ఆర్డినేషన్ వంటి ఇతర వ్యవహారాలు చూస్తుంది. అలాంటిది కీలకమైన జవాబు పత్రాల స్కానింగ్ బాధ్యత నుంచి తప్పించుకుంటోందనే వాదన వినిపిస్తోంది. జవాబు పత్రాలను స్కానింగ్ చేసే బాధ్యత తీసుకుంటే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలేజీలు చెబుతున్నాయి. దీంతో ఆ బాధ్యత తమపై పెట్టవద్దని స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే హెల్త్ వర్సిటీ మూల్యాంకనం విషయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. విద్యార్థులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కేవలం ఈ ఒక్క విషయంపైనే కొన్ని వందల కేసులు కోర్టులో ఉన్నాయి. ఇలాంటి సమయంలో కాలేజీలపై స్కానింగ్ బాధ్యతలు పెడితే ఇక నుంచి కళాశాలల యాజమాన్యాలు కూడా కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనే భయాలు వెంటాడుతున్నాయి. పైగా మెడికల్ కాలేజీల్లో స్కానింగ్ చేసే ప్రక్రియ కూడా మంచిది కాదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కళాశాలలకే ఈ బాధ్యత అప్పగిస్తే జవాబు పత్రాలు బయటకు వెళ్లే అవకాశం లేకపోలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే మంచిదని వైద్య రంగ నిపుణులు సూచిస్తున్నారు.

నాలుగు ప్రశ్నలకు జవాబివ్వడానికి సిద్ధమా!

» సీఎం జగన్‌కు రఘువీరా సవాల్

మడకశిర, ఫిబ్రవరి, 17: సిద్ధం సభ పేరిట ఉమ్మడి అనంతపురం జిల్లాకు వస్తున్న సీఎం జగన్.. నాలుగు అంశాలపై సమాధానాలు చెప్పాలని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి సవాలు విసిరారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఉమ్మడి అనంతపురం జిల్లాకు వరప్రదాయిని అయిన హంద్రీనీవా ప్రాజెక్టును అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపు పూర్తి చేస్తామని చెప్పారు. ఐదేళ్లలో అంగుళం కూడా ముందుకు కదలలేదు. ఎందుకు పూర్తి చేయలేకపోయారు? ఇప్పటికైనా పూర్తి చేయడానికి సిద్ధమా..? ఎన్ని రోజులలో పూర్తిచేయగలరో చెప్పండి' అన్నారు. 'ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి కరువును పారదోలేందుకు ప్రాజెక్టు అనంతకు రూ.7,860 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఎన్నిరోజులలోపు కేంద్రం నుంచి ఆ నిధులను తెస్తారు..?' అని ప్రశ్నించారు. 'రాయదుర్గం వద్ద కుద్రేముఖ్ స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఒప్పందం జరిగింది. దాన్ని గత ప్రభుత్వం పూర్తి చేయలేదు. మీరెందుకు చేయలేదు? ఇప్పటికైనా చేస్తారా?' అని ప్రశ్నించారు. ఈ నాలుగు ప్రశ్నలకు సిద్ధం సభలో జగన్ సమాధానమివ్వాల్సిందేనన్నారు.

సీట్ల సర్దుబాటు దాదాపు ఖరారు!

» జనసేన నాయకుడు నాగబాబు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జనసేన, తెలుగుదేశం పార్టీల మధ్య పొత్తు నేపథ్యంలో.. దాదాపు సీట్ల సర్దుబాటు ఖరారయిందని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు వెల్లడించారు. 'పవన్, చంద్రబాబు మధ్య అవగాహన కుదిరింది. ప్రజావ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తున్న వైసీపీని గద్దె దించాలని ఇరువురూ నిర్ణయించారు. ఈ పొత్తును వైసీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారు. ఆ పార్టీకి చెందిన సోషల్‌మీడియా, పేటీఎం బ్యాచ్‌లు కుట్రలకు పాల్పడుతున్నాయి. సీట్ల సర్దుబాటు అంశం కొలిక్కి వచ్చేసింది. కొద్దిరోజుల్లో జాబితా వెల్లడవుతుంది. కచ్చితంగా కూటమి అధికారంలోకి వస్తుంది' అని స్పష్టం చేశారు.

పంట కోతకు పరికరాలేవీ?

రైతుకు రాయితీ యంత్రాలివ్వని వైసీపీ సర్కార్

» ఐదేళ్లలో ఊసేలేని వ్యక్తిగత పనిముట్లు

» వ్యవసాయ యాంత్రీకరణకు జగన్ ఝలక్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 70% రాయితీపై పంటకోత పరికరాలు అందించగా, వైసీపీ ప్రభుత్వం వ్యక్తిగత రాయితీకి మంగళం పాడేసింది! విత్తనం నుంచి విక్రయం వరకు రైతును చేయిపట్టుకుని నడిపిస్తామంటూ సీఎం జగన్ పదేపదే ప్రగల్భాలు పలికారు కానీ విత్తనం నాటేందుకు, కలుపు నిర్మూలనకు, క్రిమి సంహారక మందుల పిచికారికి, పంట కోత, నూర్పిడి, ఉత్పత్తుల శుద్ధికి అవసరమైన యంత్ర పరికరాలు మాత్రం రాయితీపై ఇవ్వడంలో విఫలమయ్యారు. వ్యవసాయ పరికరాలు లేక లక్షలాది మంది రైతులు భారమైనప్పటికీ అద్దెకు యంత్రాలను తెచ్చుకునే దుస్థితికి తీసుకొచ్చారు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లు వరుసగా రైతులకు వ్యక్తిగత పరికరాలు పంపిణీ చేయగా, వైసీపీ ప్రభుత్వం మొదటి రెండేళ్ల వ్యవసాయ యాంత్రీకరణ ఊసే ఎత్తలేదు. గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీఎస్టీ రైతులకు 70%, ఓసీ,బీసీ రైతులకు అధిక విలువైన యంత్రాలను తక్కువ ధరకు ఇప్పించింది. రైతుకు వ్యక్తిగతంగా పరికరాలు అందించగా, వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద అద్దె పరికరాలు మాత్రమే అందుబాటులోకి ఉంచింది. యూనిట్ విలువలో సగం మొత్తాన్ని రైతు గ్రూపులు బ్యాంకు రుణంగా తీసుకుని, 10% మార్జిన్ మనీ కడితే కానీ ఆర్బీకే, క్లస్టర్ స్థాయిలో యంత్రసేవా కేంద్రాల నిర్వహణకు రాయితీ చెల్లించలేదు. 2021 నుంచి ఆర్బీకే స్థాయి, క్లస్టర్ స్థాయి యంత్రసేవా కేంద్రాల ద్వారా రూ.1,052కోట్ల విలువైన పరికరాలిచ్చి, రూ.366కోట్ల రాయితీని రైతు గ్రూపులకు జమ చేసింది. రెండు విడతలుగా 6,362 ట్రాక్టర్లు, 492 హార్వెస్టర్లు, 31వేల ఇతర పరికరాలను ఇచ్చినట్లు వ్యవసాయశాఖ చెప్తోంది. ఈ యంత్రసేవా కేంద్రాల ద్వారా మొత్తంగా 3.80లక్షల రైతులకు మాత్రమే లబ్ధి చేకూరినట్లు చెప్తున్నారు. వ్యవసాయంలో కీలకమైన ట్రాక్టర్లను గత టీడీపీ ప్రభుత్వం రైతురథం పేరుతో 24వేల మంది రైతులకు ఇచ్చింది.



కానీ ఈ ప్రభుత్వం అద్దె పద్ధతిలో వినియోగించుకునేలా రైతు గ్రూపులకు మాత్రమే ట్రాక్టర్లు ఇచ్చింది.

రైతురథంలో నిరూపణ కాని అవినీతి

గత ప్రభుత్వం రైతు రథం పథకం కింద 2017-18లో పెద్ద ట్రాక్టర్లు, రోటోవేటర్ల పంపిణీ చేపట్టింది. ఒక్కో రైతుకు రూ.2.5లక్షల రాయితీతో తొలివిడత 12,217ట్రాక్టర్లు ఇచ్చారు. 2018-19లో రూ.2లక్షల రాయితీతో 11,664 ట్రాక్టర్లు ఇచ్చారు. ఈ ట్రాక్టర్లు ధనిక రైతులకే అందాయని అప్పటి ప్రతిపక్ష వైసీపీ ఆరోపించింది. 2019లో అధికారంలోకి వచ్చాక రైతు రథం పథకాన్ని రద్దు చేసింది. ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు సరఫరా చేసిన కంపెనీలకు రెండేళ్ల బిల్లులు పెండింగ్ పెట్టి వేధించింది. రైతురథం పథకంలో అవినీతి జరిగిందంటూ విచారణ జరిపించిన జగన్ సర్కార్ ఎలాంటి అవినీతినీ నిరూపించలేకపోయింది. వాస్తవంగా.. వ్యవసాయ ఖర్చులు తగ్గించి, సకాలంలో పంటల సాగు, కోతలు, మార్కెట్‌కు ఉత్పత్తుల తరలింపు కోసం గత ప్రభుత్వం యాంత్రీకరణకు పెద్ద పీట వేసింది. ప్రత్యేకంగా ఎస్సీఎస్టీ రైతులకు ఇచ్చే పరికరాలపై రాయితీని 50%నుంచి 70%కి పెంచింది. సన్నచిన్నకారు ఓసీ,బీసీ రైతులకు వ్యక్తిగతంగా అధిక విలువ గల యంత్రపరికరాలను అందించింది. సమాంతరంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కస్టమ్ హైరింగ్ సెంటర్లను నిర్వహించింది. ఉబరైజేషన్ విధానంలో మొబైల్ అప్లికేషన్ ద్వారా రైతులు తమకు కావాల్సిన పరికరాలను ఎంపిక చేసుకునే ఏర్పాట్లు చేసింది. దీనిద్వారా ఐదేళ్లలో ఎస్ఎస్‌పీ, ఎస్ఎంఏఎం, ఆర్కేవీవై పథకాల కింద ఐదేళ్లలో రూ.458కోట్లతో 11.80లక్షల మంది రైతులు లబ్ధి పొందినట్లు టీడీపీ 2019లో శ్వేతపత్రంలో పేర్కొంది.

కిసాన్ డ్రోన్లు ఏవీ?

వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను రైతులకు అందించేందుకు కిసాన్ డ్రోన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని జగన్ సర్కార్ రెండేళ్లుగా ఊదరగొడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్బీకేల్లో దశలవారీగా 10వేల డ్రోన్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అప్సర ప్రాజెక్ట్ ద్వారా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరిపి, కిసాన్ డ్రోన్ల సాంకేతికతను విస్తృతపర్చేందుకు రూ.200కోట్లు కేటాయించినట్లు 2022- 23బడ్జెట్‌లో పేర్కొంది. కిసాన్ డ్రోన్లతో 20వేల మంది యువతకు ఉపాధి లభిస్తుందని ప్రకటించింది. తొలివిడత 600 కిసాన్ డ్రోన్లు అందు బాటులోకి తెస్తామని చెప్పింది. ఇందుకోసం 380మందికి డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇచ్చామంది. అలాగే 2022-23లో రైతులకు వ్యక్తిగత రాయితీ పరికరాలు సరఫరా చేయడానికి నిర్ణయించామని అసెంబ్లీ వేదికగా బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించింది. కానీ ఇంత వరకు ఒక్క డ్రోన్ అందు బాటులోకి రాలేదు. రాయితీపై రైతులెవరికీ వ్యక్తిగత పరికరాలు అందించిన దాఖలా లేదు. రాష్ట్రంలో లక్షలాది రైతులు లక్షలాది ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు పంటలు పండిస్తున్నారు. సగానికిపైగా సన్నచిన్నకారు, కౌలు రైతులే ఉన్నారు. వారికి రాయితీపై పరికరాలు అందితే పెట్టుబడుల భారం కాకుండా ఉంటుందని రైతు సంఘాలు మొత్తుకున్నా.. ఈ ప్రభుత్వం వ్యక్తిగత రాయితీ పరికరాలను అందించే ప్రయత్నం ఏ కోశానా చేయడంలేదు. దీన్నిబట్టి రైతుల అభ్యున్నతిపై జగన్‌సర్కారు ఎంత శ్రద్ధ పెడుతోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసీపీ కుట్ర బట్టబయలు

» టీడీపీ కేడర్‌ను భయపెట్టాం.. రౌడీయిజం చేశాం

» అచ్చెన్నాయుడిని జైల్లో పెట్టించగలిగా

» తెలుగుదేశం వారిని బయటకు రానీయలేదు

» పార్టీని గెలిపించేందుకే ఇలా చేశా

» ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆడియో వైరల్

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం/టెక్కలి, ఫిబ్రవరి 17: అధికారం మదంతో వైసీపీ చేసిన కుట్ర బట్టబయలైంది. ఎన్నికల్లో గెలిచేందుకు ఎంత దుర్మార్గంగా ప్రవర్తించారో పార్టీనేతల సమావేశంలో చెప్పిన ఆడియో బయటికి రావడంతో అది ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన వైసీపీ నాయకుడు.. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడిన ఆ ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ.. వైసీపీ, టీడీపీ నాయకులు, ప్రజల సెల్‌ఫోన్లలోనూ సంచలనమైంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడిని, టీడీపీ కేడర్‌ను దువ్వాడ శ్రీనివాస్ ఎలా ఇబ్బందులు పెట్టాడో ఆ ఆడియోలో స్పష్టమైంది.

ఆడియోలో ఉన్నది ఇదీ...

'సంతబొమ్మాళి టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి పుక్కళ్ల శ్రీనివాసరావును గట్టిగా హెచ్చరించా. బయటకువస్తే అంతు చూస్తా అని హెచ్చరికతోపాటుగా అతనిపై రౌడీషీట్ కూడా తెరిపించి అరెస్ట్ చేయించాం. ఇక కోటబొమ్మాళి జడ్పీటీసీ అభ్యర్థి పూజారి శైలజ భర్త సత్యంను ఇంటిలోనే తలుపులు వేయించి బంధించగలిగాం. అదే రీతిన నందిగాం, టెక్కలి జడ్పీటీసీ అభ్యర్థులను కూడా బయటకు రానీయకుండా చేశాం. తెలుగుదేశం కేడర్ ఎవరినీ బయటకు రానీయకుండా చేయగలిగా. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలా చేయడంతోనే టెక్కలి నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలను, 119 పంచాయతీలను గెలిపించుకోగలిగాం. లేకుంటే వైసీపీకి అన్నిస్థానాలు రావు. 55 సర్పంచ్ స్థానాల్లో మాత్రమే వైసీపీకి చెందినవారు గెలుస్తారని ముందుగా తెలిసింది. మిగిలినవి టీడీపీ గెలిచే అవకాశముందని వెల్లడైంది. అప్పుడు ఏం చేయాలన్నదీ ఆలోచించి.. ఇదంతా చేశా. అచ్చెన్నాయుడు సొంతూరు నిమ్మాడలో వైసీపీకి మద్దతుగా ఉన్న కింజరాపు అప్పన్నను సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయకుండా టీడీపీ వాళ్లు ఇబ్బంది పెట్టారు. అదే అవకాశంగా ఆ ఊరిపైనే నేను దాడి చేసి.. అప్పన్నతో నామినేషన్ వేయించేశా. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు దాడి చేశారని చెప్పించి అతన్ని జైల్లో వేయించా. తెలుగుదేశం వారిని భయపెట్టగలగి రౌడీయిజం చేశాం' అని దువ్వాడ శ్రీనివాస్ ఆ ఆడియోలో వివరించారు.

వివాదాస్పద వైఖరి.. అందుకే జగన్ ఆశీస్సులు..

ప్రతిపక్షనాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంలో.. చంద్రబాబు లోకేశ్, పవన్‌కల్యాణ్, అచ్చెన్నాయుడులపై దుందుడుకుగా విమర్శలు చేయడంలో మాజీమంత్రి కొడాలి నానితో పోటీపడేలా ఎమ్మెల్సీ దువ్వాడ వ్యవహరిస్తున్నారు. ఈ తీరు నచ్చే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. అచ్చెన్నాయుడును అధికారంతో అడ్డుకునేలా దువ్వాడకు ఎమ్మెల్సీ ఇచ్చారు. అప్పట్లో అచ్చెన్నాయుడి అరెస్ట్ ఉదంతంలో అధికార పార్టీ ఏరీతిన వ్యవహరించిందో అందరికీ తెలిసిన విషయమే. అయితే స్వయంగా దువ్వాడ ఆడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో.. వాస్తవం ప్రజలకు మరింత స్పష్టంగా అర్థమైంది.

ఇదీ మన బలం.. బలగం!

» కేంద్ర నాయకత్వానికి బీజేపీ జాబితా

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీతో పొత్తుపై అధికారిక ప్రకటన వెలువడక ముందే సీట్లు, అభ్యర్థులపై బీజేపీలో కసరత్తు మొదలైంది. రాష్ట్రంలోని 20అసెంబ్లీ స్థానాలతో పాటు ఆరు పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు ఉన్నారంటూ బీజేపీ కేంద్ర నాయకత్వానికి రాష్ట్ర పార్టీ జాబితా అందజేసింది. పార్లమెంటుకు పోటీ చేసే వారిలో పురందేశ్వరి, సత్యకుమార్ తోపాటు ఆరుగురి పేర్లు పంపినట్లు తెలిసింది.

'నిజం గెలవాలి'కి ఎక్స్‌లో 2వ స్థానం

టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నిర్వహిస్తున్న 'నిజం గెలవాలి' యాత్ర శనివారం 'ఎక్స్'లో ట్రెండింగ్ అయింది. దేశవ్యాప్తంగా 2వ స్థానం దక్కించుకుంది. ఈ యాత్రకు దేశ, విదేశాల నుంచి వేలాది మంది నెటిజన్లు ఎక్స్ వేదికగా మద్దతు పలుకుతున్నారు.

'అంబేడ్కర్' కన్నా డబ్బే ఎక్కువ

» వైసీపీ నేత జూపూడి వ్యాఖ్యలు.. మండిపడ్డ ప్రజాసంఘాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 17: "అంబేడ్కర్ కన్నా విద్యార్థులకు డబ్బే ఎక్కువ" అని ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ వ్యాఖ్యానించారు. మచిలీపట్నంలో శనివారం ఆయన మాట్లాడుతూ "అంబేడ్కర్ విద్యాదీవెన పేరును జగనన్న విద్యాదీవెనగా మార్చితే తప్పేముంది. మా(ఎస్సీ) విద్యార్థులు చదువుకునేందుకు కావలసింది డబ్బే. అంబేడ్కర్ కన్నా అదే ముఖ్యం. పథకాల రూపంలో డబ్బులు ఎక్కువ ఇస్తే అంబేడ్కర్ పేరును తొలగించినా మాకేమీ అభ్యంతరం లేదు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై అంబేడ్కర్ వాదులు, ప్రజాసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్.. నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన ఆయన స్ఫూర్తి వైసీపీ నేతలకు అబ్బుతుందా? అని విమర్శలు గుప్పించారు.

ఎంబీఏ



ఐఐటీ జోధ్‌పూర్‌లో..

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజే)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఎస్ఎంఈ)- 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ని రెండు మోడ్‌లలో నిర్వహిస్తున్నారు. మొదటి మోడ్ ప్రకారం- ప్రోగ్రామ్ మొదటి ఏడాది కోర్సుని ఐఐటీజేలోను, రెండో ఏడాది కోర్సును యూఎస్ఏలోని ఎస్‌యూఎన్‌వై అల్బేనీలో చదువుకోవచ్చు. అల్బేనీ విద్యార్థులకు 5000 డాలర్ల స్కాలర్‌షిప్, మూడేళ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు అనుమతిస్తూ ఎఫ్-1 స్టూడెంట్ వీసా, అల్బేనీ అసిస్టెంట్‌షిప్ అందిస్తారు. ఈ మోడ్‌లో చదివిన వారికి ఐఐటీజే నుంచి 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' డిగ్రీ, ఎస్‌యూఎన్‌వై అల్బేనీ నుంచి 'ఎంఎస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్' డిగ్రీ లభిస్తాయి. రెండో మోడ్ ప్రకారం ప్రోగ్రామ్ రెండేళ్లూ ఐఐటీజేలోనే చదువుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఎంటెక్ అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ అభ్యర్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులందరికీ దరఖాస్తు నాటికి ఐటీ/బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్/ఇన్సూరెన్స్/సైబర్‌సెక్యూరిటీ తదితర విభాగాల్లో కనీసం రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. ఇంటర్న్‌షిప్‌లు; కోచింగ్ సెంటర్లు, స్మాల్ స్కేల్ బిజినెస్ సంస్థలు, రిటైల్ స్టోర్స్ కిరాణా స్టోర్స్, ఎన్‌జీఓ సంస్థలు, పెట్రోల్ పంప్ సంస్థలు, గ్యాస్ స్టేషన్‌లలో పనిచేయడాన్ని అనుభవం కింద పరిగణించరు.

ఎంపిక: క్యాట్ 2023/గేట్/ జీఆర్ఈ/ జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్/అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ స్కోర్, అనుభవం, జెండర్ డైవర్సిటీ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** iitj.ac.in

ఐఐటీ మండీలో..

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎస్ఓఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: రెండు కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొదటి కేటగిరీ అడ్మిషన్స్‌కు సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం మార్కులు ఉండాలి. వీరికి క్యాట్ వ్యాలిడ్ స్కోర్ అవసరం లేదు. రెండో కేటగిరీ అడ్మిషన్స్‌కు ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. రెండు కేటగిరీలకు చెందిన అభ్యర్థులూ ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారికి మొదటి కేటగిరీ కింద ప్రవేశాలు కల్పిస్తారు. ఎన్ఆర్ఐ, విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ 2023 స్కోర్ ఉండాలి.

ఎంపిక: మొదటి కేటగిరీ అభ్యర్థులను అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా; రెండో కేటగిరీ అభ్యర్థులను క్యాట్ 2023 స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సెలెక్షన్ కమిటీ నిర్ణయం ప్రకారం ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2400; దివ్యాంగులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200; సార్క్ దేశస్థులకు 100 యూఎస్‌డీలు; నాన్ సార్క్ దేశస్థులకు 200 యూఎస్‌డీలు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **పర్సనల్ ఇంటర్వ్యూ సెంటర్లు:** ఢిల్లీ, బెంగళూరు, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

Indian Institute of Technology Mandi

ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ అండ్ డిజైన్

ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ(ఏడబ్ల్యూఈఎస్) బెంగళూరులో నిర్వహిస్తున్న ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ డిజైన్(ఏఐఎఫ్‌డీ)- బీఎస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫ్యాషన్ అండ్ అప్పారెల్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకరేషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌ని ఆర్మీ విభాగాలకు చెందిన ఉద్యోగులు/విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకించారు. రిటెన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా హాస్టల్స్ ఉన్నాయి.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల్లో ఒకరికి ఆర్మీ ఉద్యోగిగా కనీసం పదేళ్ల సర్వీస్ ఉండాలి. పరమ్ వీర్ చక్ర, అశోక్ చక్ర, శౌర్య చక్ర తదితర అవార్డులు; సేవా మెడల్స్ సాధించిన వారి పిల్లలకు నిర్దేశిత వెయిటేజీ ఇస్తారు.

రిటెన్ అడ్మిషన్ టెస్ట్: దీనిని మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ టెస్ట్, జనరల్ అవేర్‌నెస్ టెస్ట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంపిటెన్సీ అండ్ కాంప్రహెన్షన్ టెస్ట్ ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** మార్చి 31
- **రిటెన్ అడ్మిషన్ టెస్ట్:** ఏప్రిల్ 14
- **ఫలితాల విడుదల:** ఏప్రిల్ 30
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 21
- **తరగతులు ప్రారంభం:** జూలై మూడో వారం నుంచి
- **వెబ్‌సైట్:** aifd.edu.in

ఐఐపీలో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్

చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ (సీపీఈ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుకు ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ (ఏపీఎఫ్) సహకారం అందిస్తోంది. ఇందులో ప్రధానాంశం 'ప్యాకేజింగ్'. ఇంజనీర్లకు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌ను జూలై నుంచి అక్టోబరు వరకు, రెండో సెమిస్టర్‌ను నవంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు, మూడో సెమిస్టర్‌ను వచ్చే ఏడాది మార్చి నుంచి జూన్ వరకు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో కాంటాక్ట్ క్లాసెస్ ఉంటాయి. ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్ నిర్వహిస్తారు. వీటికోసం అభ్యర్థులు చెన్నై సెంటర్‌లో హాజరు కావాల్సి ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ విజిట్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో నాలుగు నెలలపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రతి సెమిస్టర్ చివరలో ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం, మొత్తమ్మీద 50 శాతం మార్కులు ఉంటేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆటొమొబైల్ సంస్థలు, టెక్స్‌టైల్ హబ్‌లు, ఫైర్ వర్క్స్ ఇండస్ట్రీలు, ఎఫ్ఎంసీజీ మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రింటింగ్ టెక్నాలజీ/ప్యాకేజింగ్ టెక్నాలజీ/పాలిమర్ ఇంజనీరింగ్/పాలిమర్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/బయో టెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ టెక్నాలజీ/పేపర్ ఇంజనీరింగ్/పేపర్ టెక్నాలజీ/ప్లాస్టిక్స్ టెక్నాలజీ/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇతర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ప్యాకేజింగ్‌పై ఆసక్తి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.83,190
- **అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సిన సెమిస్టర్ ఫీజు:** రూ.35,990
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500+18% జీఎస్‌టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మే 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 5 నుంచి
- **కాంటాక్ట్ క్లాసెస్ సెంటర్లు:** ముంబై, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్
- **చిరునామా:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ప్లాట్ నెం 169, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సెకండ్ మెయిన్ రోడ్, పెరుంగుడి, చెన్నై- 600096
- **వెబ్‌సైట్:** www.iip-in.com



జాబ్ కార్నర్

ఏఆర్‌వో విశాఖపట్నం పరిధిలో అగ్నివీరులు

విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్.. అగ్నిపథ్ పథకం కింద 2024-25 సంవత్సరం నియామకాలకు సంబంధించి అగ్నివీరుల ఎంపిక కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ నియామకాలకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు.

కేటగిరీలు:

1. అగ్నివీర్ జనరల్ డ్యూటీ(ఆల్ ఆర్మ్స్)
2. అగ్నివీర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
3. అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
4. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(టెన్త్ పాస్)(ఆల్ ఆర్మ్స్)
5. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత)(ఆల్ ఆర్మ్స్)

వయోపరిమితి: 17 1/2 - 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి 2003 అక్టోబరు 1 నుంచి 2007 ఏప్రిల్ మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి/మెట్రిక్యులేషన్, 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ లేదా ఆర్ట్స్, కామర్స్, సైన్స్), సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.



ఎత్తు(సెం.మీ.లలో): అగ్నివీర్ జీడీ/ట్రేడ్స్‌మన్-166, అగ్నివీర్ టెక్నికల్-165, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్-162.

ఛాతీ కొలత: గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ విస్తరణతో 77 సెం.మీ. ఉండాలి

పరీక్ష ఫీజు: రూ.250

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రిక్రూట్‌మెంట్ ర్యాలీ(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్/ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్), వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 22

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: ఏప్రిల్ 22

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో టెక్నీషియన్స్

ఖాళీలు 100

న్యూఢిల్లీలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్... వివిధ విభాగాల్లో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(మెయింటెనెన్స్/ఓవర్‌హాల్, ఏవియానిక్స్)
2. ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(ఏవియానిక్స్ ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటల్/రేడియో)
3. టెక్నీషియన్(ఫిట్టర్/షీట్ మెటల్, కార్పెంటర్, వెల్డర్)
4. టెక్నీషియన్(ఎక్స్-రే/ఎన్‌డీటీ)

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, ఇంజనీరింగ్ సర్టిఫికెట్, బీటెక్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 35 ఏళ్లు

జీతం: నెలకు రూ.28,000

ఎంపిక ప్రక్రియ: స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్, టెక్నికల్ అసెస్‌మెంట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 23

వెబ్‌సైట్: https://www.aiesl.in/

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు



ఖాళీలు 80

ముంబయిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)... రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్): **23 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్): **51 పోస్టులు**
3. మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్): **3 పోస్టులు**
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(అప్లికేషన్ సెక్యూరిటీ): **3 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం తప్పనిసరి.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్

గరిష్ఠ వయోపరిమితి: అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 30 ఏళ్లు; డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు; మేనేజర్‌కు 38 ఏళ్లు; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 42 ఏళ్లు మించకూడదు.

పని ప్రదేశం: ముంబయి, నవీ ముంబయి


జీతభత్యాలు: అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.36,000- రూ.63,840; డిప్యూటీ మేనేజర్‌కు రూ.48,170 - రూ.69,810; మేనేజర్‌కు రూ.63,840- రూ.78,230; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.89,890 - రూ.1,00,350.

దరఖాస్తు ఫీజు: రూ.750. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది **ఎంపిక:** అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 4

వెబ్‌సైట్: https://www.sbi.co.in/

లిటిల్స్



ఒకరిని మించి మరొకరు..


అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యాన్ని కర్కల్ అనే రాజు పాలించేవాడు. అతనికి శిల్పాలంటే మహా ఇష్టం. ఆ రాజ్యంలోనే అమరుడు అనే ఓ గొప్ప శిల్పి ఉండేవాడు. అతని గొప్ప ప్రతిభ విని రాజ్యానికి పిలిపించి రాచమర్యాదలు చేశాడు. అమరుడికి అర్థం కాలేదు. ఆ తర్వాత రాజు ఇలా అన్నారు.. 'అమరుడా.. నీ శిల్ప చాతుర్యం తెలుసు. ఈశ్వరుడి విగ్రహం 25 అడుగులు కావాలి' అని అడిగాడు. 'ఓస్ అదెంతపని' అన్నాడు. ధనం ఇస్తూనే శిల్పి ఇంటికి వెళ్లిపోయి ఆ పనిలో పడ్డాడు. రాత్రిం పగలు కష్టపడ్డాడు. పరమేశ్వరుడి విగ్రహాన్ని అందంగా చెక్కాడు. కొన్ని నెలల కష్టం అతనిది. ఆ విగ్రహాన్ని చూసి రాజుగారు మురిసిపోయారు. 'ఇంతటి గొప్ప వ్యక్తి నా దేశంలో ఉండటం గర్వకారణమే' అంటూ పొగిడాడు. ఆ శిల్పాన్ని చూసి ఇంత ఎత్తు అయిన శిల్పం చెక్కడం కష్టం.. పరమశివుడు ఎంత బావున్నాడో.. అంటూ జనాలు పొంగిపోయారు. రాజుగారికి పేరు రావటంతో.. మరింత సొమ్ము బంగారు నాణేలను ఇచ్చాడు ఆ శిల్పికి. ఇక సెలవని శిల్పి బయలుదేరాడు.



శిల్పి బయలుదేరగానే రాజుగారికి దుర్బుద్ధి పుట్టింది. ఇతడు ఈ విగ్రహం కంటే పెద్దది చేస్తే ఎలా? అనుకున్నాడు. వెంటనే భటులను పంపించి అతని కుడిచేయి తీయించాడు. ఖచ్చితంగా కుడిచేయి లేకుంటే పని చేయలేడని రాజుగారి ఆలోచన. రాజుగారి ద్రోహాన్ని చూసి శిల్పికి ఒళ్లు మండింది. కోపంతో రగిలిపోయాడు. మంచికి కాలం లేదనుకున్నాడు. వెంటనే కర్కల్‌కు శత్రువు అయిన కుమారుడు అనే రాజు దగ్గరకు వెళ్లాడు. తన బాధను వెళ్లగక్కాడు. 'చేయి లేదా?' అన్నాడు రాజు. 'నా సత్తువ పోదు. ఎడమ చేయి ఉంది కదా?' అన్నాడు శిల్పి. రాజుమీద కోపం కక్కాడు. 'అయితే నాకు ముప్పయి అడుగుల కాళికాదేవి విగ్రహం కావాలి' అన్నాడు. శిల్పి 'సరే' అన్నాడు. అందుకు తగిన డబ్బును ఇచ్చాడు రాజుగారు. ఇంటికి పోయి మరింత రెట్టించిన ఉత్సాహంతో.. ఎప్పటిలానే తన తోటి శిల్పుల సహాయంతో అందంగా చెక్కాడు విగ్రహాన్ని. ఆ విగ్రహం చెక్కుతూనే అందరూ అక్కడికి వచ్చి వేనోళ్ల పొగిడారు. గొప్ప విజయంగా భావించాడు రాజు. శిల్పి ఆనందానికి అవధుల్లేవు.

ఈ కాళికా విగ్రహం చూడటానికి విదేశాల నుంచి వస్తామని కబురొచ్చింది. రాజుగారు గర్వపడ్డారు. వారం దాటిన తర్వాత రాజుగారికి కర్కల్ రాజులానే ఆలోచన వచ్చింది. ఇంతకంటే పెద్ద విగ్రహాన్ని కడితే ఎలా? అనుకున్నాడు. భటులను పంపించి.. శిల్పిగారి ఎడమ చేతిని కూడా తీయించాడు. దీంతో శిల్పికి మరింత కోపం వచ్చింది. రాజులనేమీ చేయలేడు కదా. ఏడుస్తూ కూర్చున్నాడు. నిద్రపట్టలేదు. రాజుల ద్రోహం ఇలా ఉంటుందా? ప్రతిభకు పట్టం కట్టరా? అంటూ రాత్రంతా మేల్కొన్నాడు. ఉదయాన్నే వింధ్య ప్రాంతం వైపు వెళ్లాడు. అక్కడ శేషుడు అనే రాజు ఉన్నాడు. అతని దగ్గరకు పోయి తన బాధను వెళ్లగక్కాడు. 'ఇంకేమి చేయగలవు' అన్నాడు. 'నా చేతులు పోయాయి కానీ బుర్ర ఉంది కదా..' అన్నాడు. వెంటనే శేషుడు ఇలా అన్నాడు.. 'శివపార్వతుల శిల్పాలు కావాలి. అది కూడా యాభై అడుగులు కావాలి' అన్నాడు. ఆ ఇద్దరు రాజులు చేసిన ద్రోహానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. రాజుగారి దగ్గర నుంచి అనుమతి తీసుకుని వెళ్లి నెలల పాటు శ్రమించి అద్భుతమైన శివపార్వతుల విగ్రహాలు చెక్కాడు. ఆ యాభై అడుగుల విగ్రహం చూడటానికి జనాలు తండోపతండాలుగా వస్తున్నారు. దీంతో శేషుడు కూడా మునుపటి రాజుల్లానే ఆలోచించాడు. యాభై అడుగుల విగ్రహం నా రాజ్యంలోనే ఉండాలనుకున్నాడు. వెంటనే భటులను ఆజ్ఞాపించి ఆ శిల్పి శిరస్సును ఖండించమన్నాడు. అలా శిల్పి కథ ముగిసింది.


10 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 233

	6		4					
		8		9		2		
7	1			3	8	9		
3		1	5					
5								9
					9	3		7
		3	1	7			6	2
		4		6		7		
					4		9	

సుడోకు - 232 సమాధానం

2	6	1	5	8	7	4	3	9
4	7	5	6	3	9	2	8	1
8	3	9	4	1	2	7	5	6
9	4	2	1	5	3	8	6	7
6	5	3	7	9	8	1	2	4
7	1	8	2	6	4	5	9	3
5	8	4	9	7	6	3	1	2
3	2	6	8	4	1	9	7	5
1	9	7	3	2	5	6	4	8


ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 18 ఫిబ్రవరి 2024



ఇటీవల సతీమణి సురేఖ సమేతంగా అమెరికా వెళ్లిన మెగాస్టార్ చిరంజీవి తన స్నేహితుడు కుమార్ కోనేరు కుమారుడు కిరణ్ వివాహ వేడుకలో పాల్గొన్నారు. కొత్త దంపతులు కిరణ్, శైలశ్రీలను ఆశీర్వదించారు. విక్టరీ వెంకటేశ్ దంపతులు, నిర్మాతలు అల్లు అరవింద్, డాక్టర్ కె.ఎల్.నారాయణ, నవీన్ యర్నేని తదితరులు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

పుష్ప 3 పై అల్లు అర్జున్ క్లారిటీ



అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతి పెద్ద విజయం సాధించిన చిత్రం 'పుష్ప ది రైజ్'. దీనికి కొనసాగింపుగా వస్తున్న 'పుష్ప ది రూల్' చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. దీనికి మూడో భాగం కూడా వస్తుందనే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో అల్లు అర్జున్ ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. బెర్లిన్ 74వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనడం కోసం ఆయన జర్మనీ చేరుకున్నారు. 'పుష్ప ది రైజ్' చిత్రాన్ని ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు. ఈ వేడుకలో అల్లు అర్జున్ మాట్లాడుతూ పుష్ప కథను కొనసాగించాలని అనుకుంటున్నాం. 'పుష్ప ' పార్ట్ 3 తప్పకుండా ఉంటుంది. దానిని తెరపైకి ఎక్కించేందుకు అద్భుతమైన ఆలోచనలు ఉన్నాయి' అని స్పష్టం చేశారు. 'విదేశాల్లోని ప్రేక్షకులు 'పుష్ప'చిత్రాన్ని ఎలా ఆదరిస్తారో చూడడానికే ఇక్కడకి వచ్చా. ఇక్కడి వారికి ఎలాంటి సినిమాలు కావాలో, వారి ఆలోచనలు ఎలా ఉంటాయో చూడాలి. మొదటి భాగం కంటే 'పుష్ప' రెండో భాగంలో పాత్రలు, వాటి మధ్య ఘర్షణ బలంగా ఉంటుంది. ముఖ్యంగా ఎర్రచందనం స్మగ్లర్ పుష్పరాజ్, పోలీస్ ఆఫీసర్ షెకావత్‌ల పాత్రలు, వాటి మధ్య సంఘర్షణ థ్రిల్లింగ్‌గా ఉంటాయి' అని అల్లు అర్జున్ తెలిపారు.

వాటితో మరింత గుర్తింపు

ప్రియమణి

'జవాన్', 'ది ఫ్యామిలీ మ్యాన్' చిత్రాల తర్వాత ఉత్తరాదిలో తనకు మరింత గుర్తింపు వచ్చిందని నటి ప్రియమణి చెప్పారు. గతంలో కంటే మంచి అవకాశాలు తనని వెదుక్కుంటూ వస్తున్నాయని అన్నారు. ప్రతిభకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందనీ. ఎక్కడున్నా అవకాశాలు వస్తాయనీ తన విషయంలో మరోసారి రుజువైందని ఆనందంతో చెప్పారు ప్రియమణి. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ఇంతకుముందు మణిరత్నం 'రావణ్', షారుఖ్ ఖాన్ 'చెన్నై ఎక్స్‌ప్రెస్'లో నటించాను. అయితే 'ది ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్‌తో ఉత్తరాది ప్రేక్షకులకు దగ్గర కాగలిగాను. అలాగే ఇటీవల వచ్చిన 'జవాన్' సినిమా కూడా నాకు మంచి పేరు తెచ్చింది. చాలా మంది 'నువ్వు ప్రియమణివి కదూ' అని గుర్తు పట్టడం ఆనందాన్ని కలిగిస్తోంది' అని చెప్పారు. మంచి పాత్రల ఎంపికలో జాగ్రత్త పడుతున్నాననీ, హిందీలోనే కాదు మిగిలిన భాషల్లో కూడా విభిన్న పాత్రలు పోషించాలనుకుంటున్నాననీ ప్రియమణి తెలిపారు. ప్రస్తుతం 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' సిరీస్‌తో పాటు 'ఆర్టికల్ 370', 'మైదాన్' హిందీ చిత్రాల్లో నటిస్తున్నట్లు ఆమె చెప్పారు. హీరోయిన్ యామి గౌతమ్ భర్త ఆదిత్య ధర్ నిర్మించిన 'ఆర్టికల్ 370' ఈ నెల 23న విడుదల కానుంది. అజయ్ దేవగణ్ 'మైదాన్' చిత్రం ఏప్రిల్ 10న విడుదలవుతుంది. 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' సిరీస్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందని ప్రియమణి చెప్పారు.



కొత్త కలయిక ఖాయమా?

తెర మురిసేలా కలయిక కుదిరేనా
కొత్త ఏడాదిలో కథానాయికల సినిమాల కబుర్లు చాలానే వినిపిస్తున్నాయి.
ఫలానా హీరోతో జోడీ కట్టబోతున్నారంటూ వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి.
అయితే హీరోయిన్లు మాత్రం ఈ ప్రచారంపై పెదవి విప్పడం లేదు.
అధికారిక ప్రకటన మాత్రమే రావాల్సి ఉందంటున్న కలయికలు ఇవే





డీజే టిల్లు చిత్రంతో కథానాయికగా యువతలో ఫాలోయింగ్ పెంచుకోవడతో పాటు ఘన విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు నేహాశెట్టి. ఆ తర్వాత ఆమె నటించిన రెండు సినిమాలు పెద్దగా ప్రేక్షకాదరణ పొందలేకపోయాయి. ప్రస్తుతం ఆమె ఆశలన్నీ విష్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం పైనే. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని తర్వాత ఆమె చేయబోయే సినిమాలపై ఇప్పటివరకూ స్పష్టత రాలేదు. కానీ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన 'టైసన్ నాయుడు' చిత్రంలో ఆమె



నటించబోతున్నారని టాక్. ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌లో కథానాయిక ఎవరనేది చిత్రబృందం ఇప్పటివరకూ ప్రకటించలేదు. ఈ సస్పెన్స్‌కు తెరదించుతూ నేహా హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తారా, లేదా అనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

అవకాశం అందుకున్నారా?

టాలీవుడ్‌లో ఇప్పుడు టాప్ హీరోయిన్ అంటే ముందు గుర్తుకొచ్చే పేరు రష్మిక మందన్న. అటు బాలీవుడ్‌లోనూ రాణిస్తోన్న ఈ ముద్దుగుమ్మ అగ్రహీరోలందరితో నటిస్తూ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నారు. బాలీవుడ్‌లో రష్మిక నటించిన చిత్రాలు అన్నీ బాక్సాఫీసు దగ్గర ప్రభావం చూపలేకపోయాయి. అయితే 'పుష్ప' చిత్రం ఉత్తరాదిన ఇరగదీయడంతో రష్మికకు అక్కడ కూడా మంచి గుర్తింపు దక్కింది. దానికి కొనసాగింపుగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించిన 'యానిమల్' చిత్రం సూపర్‌హిట్ అవ్వడంతో ఈ అమ్మడికి పాన్ ఇండియా హీరోయిన్‌గా మార్కెట్ ఏర్పడింది. ప్రస్తుతం 'పుష్ప 2'తో పాటు రష్మిక టాలీవుడ్‌లో 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్‌బో' అనే రెండు హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలు చేస్తున్నారు. ఇప్పుడు మరో అరుదైన అవకాశం రష్మిక చెంతకు చేరినట్లు తెలుస్తోంది. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా రష్మికను ఎంపిక చేశారనీ, ఆమె కథ కూడా విన్నారని టాక్ నడుస్తోంది. ఒకవేళ ఇది నిజమైతే రష్మిక ప్రభాస్‌తో నటించే ఛాన్స్‌ను మిస్ చేసుకునే అవకాశం దాదాపు లేనట్లే.

జేజమ్మ తెలుగు సినిమా?

గ్యాప్ తర్వాత 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో హిట్ కొట్టారు అనుష్క శెట్టి. ప్రస్తుతం 'కథనార్' అనే మలయాళ చిత్రం చేస్తున్నారు. అయితే అనుష్క తెలుగు సినిమాపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. గతంలో క్రిష్ దర్శకత్వంలో 'వేదం' చిత్రంలో అనుష్క నటించారు. ఆయన దర్శకత్వంలో జేజమ్మ ఓ హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ చేస్తున్నారనే టాక్ నడుస్తోంది. ఇప్పటికే కొంత చిత్రీకరణ పూర్తి చేశారని కూడా చెబుతున్నారు. కానీ యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.



'సామజవరగమన' చిత్రంతో టాలీవుడ్‌లో కథానాయికగా గుర్తింపు దక్కించుకున్నారు రెబా మోనికా జాన్. ప్రస్తుతం ఆమె తమిళ, మలయాళ చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'మ్యాడ్' చిత్రంతో ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు కల్యాణ్ శంకర్ - శర్వానంద్ కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో కథానాయికగా రెబా మోనికా జాన్‌ను ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే 'సామజవరగమన' చిత్ర దర్శకుడు రామ్ అబ్బరాజు, శర్వానంద్ కలయికలో ఓ చిత్రం ప్రకటించారు. ఏకే ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. ఇందులో ఇద్దరు హీరోయిన్లు శర్వాతో జంట కట్టబోతున్నారు. సంయుక్తా మీనన్, సాక్షి వైద్య పేర్లు వినిపిస్తున్నాయి. కథ నచ్చడంతో వారు కూడా ఎస్ చెప్పారని టాక్.

కోలీవుడ్‌పై కన్నేశారా?

'సీతారామం' హీరోయిన్‌గా ప్రేక్షకులకు గుర్తుండిపోయే నటన కనబరిచారు మృణాల్ ఠాకూర్. తర్వాత నాని సరసన నటించిన 'హాయ్ నాన్న' ఆమెకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. ప్రస్తుతం మృణాల్ విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీస్టార్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఆమె చేతిలో ఓ హిందీ చిత్రం ఉంది. తెలుగులో కొత్త చిత్రం ఇప్పటివరకూ ఖరారు కాలేదు. అయితే హీరోయిన్‌గా తమిళ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చేందుకు మృణాల్ సిద్ధమవుతున్నారని కోలీవుడ్ వర్గాల సమాచారం. 'అయలాన్' దర్శకుడు రవికుమార్ రాఘవ లారెన్స్‌తో ఓ చిత్రం చేస్తున్నారు. అలాగే దర్శకుడు రమేశ్ వర్మ కూడా లారెన్స్‌తో ఓ చిత్రం చేస్తున్నారు. ఈ రెండింటిలోనూ హీరోయిన్‌గా మృణాల్ పేరు బలంగా వినిపిస్తోంది. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న 'విశ్వంభర'లోనూ ఓ హీరోయిన్‌గా మృణాల్ కనిపించనున్నారని టాక్. మరి వీటిలో ఏ సినిమాకు ఆమె సై అంటారో చూడాలి.


▸▸ టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా తిరుగులేని ఆధిపత్యం చెలాయించారు పూజాహెగ్డే. ఇప్పుడు మాత్రం ఇక్కడ ఆమె పేరే పెద్దగా వినిపించడం లేదు. ఒక్కటే సినిమా ఆమె చేతిలో ఉంది. తెలుగులో ఆమె నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో బాలీవుడ్ సినిమాలపై దృష్టిపెట్టారు. అక్కడా కాలం కలసిరాలేదు. దాంతో ఇప్పుడు ఆమె చూపు మళ్లీ దక్షిణాది చిత్రాలపై పడిందని టాక్. తెలుగు, తమిళ చిత్రాల్లో నటించేందుకు పూజా కొత్త కథలు వింటున్నారట. తమిళ దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహిస్తున్న హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రంలో నటించేందుకు అంగీకరించారని టాక్. పూజా ప్రస్తుతం బాలీవుడ్‌లో షాహిద్ కపూర్ సరసన 'దేవా చిత్రంలో నటిస్తున్నారు.

▸▸ శ్రీదేవి తనయ జాన్వీకపూర్ త్వరలోనే తెలుగు తెరపై సందడి చేయనున్నారు. 'దేవర' చిత్రంతో ఎన్టీఆర్‌కు జోడీగా కనిపించనున్నారు. దీంతో పాటు ఆమె కోలీవుడ్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. రాకేశ్ ఓం ప్రకాశ్ మెహ్రా దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా 'కర్ణ' అనే చిత్రం తెరకెక్కుతోంది. మహా భారతంలోని కర్ణుణి పాత్ర ఆధారంగా రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సూర్యకు జోడీగా జాన్వీని ఎంపికచేసినట్లు తెలుస్తోంది.




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అవతార్:		
ది లాస్ట్ ఎయిర్‌బెండర్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 22
బరీడ్ ట్రూత్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 23
ఆర్టికల్ 370	హిందీ చిత్రం	ఫిబ్రవరి 23
అమెజాన్ ప్రైమ్		
అపార్ట్‌మెంట్ 404	కొరియన్ సిరీస్	ఫిబ్రవరి 23
పోచర్	తెలుగు డబ్బింగ్ సిరీస్	ఫిబ్రవరి 23
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
విల్ ట్రెంట్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 21
మలైకొట్టై వాలిబన్	మలయాళ చిత్రం	ఫిబ్రవరి 23
ఆపిల్ టీవీ ప్లస్		
ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 21





బాపు దృశ్య కావ్యం సీతా కల్యాణం

బాపు, రమణలకు శ్రీరాముడంటే ఎంత అభిమానమో! శోభన్‌బాబు నటించిన 'సంపూర్ణ రామాయణం' చిత్రంతోనే బాపు పౌరాణిక చిత్రాలకు శ్రీకారం చుట్టారు. ఆయన చివరి చిత్రం శ్రీరామ రాజ్యం కూడా రామకథే కావడం గమనార్హం. ఈ రెండు చిత్రాలకు మధ్యలో ఆయన తీసిన మరో అద్భుత చిత్రం సీతా కళ్యాణం. నిజం చెప్పాలంటే ఇదొక సాహసిక ప్రయోగం. పాత్రలను అవసరమైనంత వరకే వాడుకోవడం, సంభాషణలను అవసరమైనంత వరకే చెప్పించడం.. . ఈ సినిమా ప్రత్యేకత. ఇందులో పాటల్లోని మాటలు బాగుండడమే కాకుండా కొన్ని మాటలు పాటల్లా ఉండడం ఒక విశేషం. అందుకేనేమో మొదట్లో అంటే 1976 జూలై 11న విడుదలైన 'సీతా కల్యాణం' క్లాస్ ఆడియన్ బాగుందని మెచ్చుకున్నారు కానీ మాస్ ఆడియన్స్ మాత్రం ఆ సినిమా జోలికి పోలేదు. థియేటర్ లో సినిమా నడుస్తుంటే జనం..'సౌండ్ సౌండ్..డైలాగులు లేవు రోయ్' అని కేకలు పెట్టారు .ఎందుకంటే పౌరాణిక చిత్రం అనగానే అందరికీ అలవాటయిన సుదీర్ఘమైన సంభాషణలు ఈ చిత్రంలో లేవు. అన్నీ పాటలే. సంగీతమయమే. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదొక సంగీత రూపకం. దృశ్య కావ్యం. ఈ సినిమా కోసం రచయిత ముళ్ళపూడి వెంకట రమణ పది పన్నెండు పేజీలకు మించి డైలాగులు రాయలేదు. విదేశీయులు కళ్లకు అద్దుకున్నారు



ఆ ఏడాదే చెన్నైలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగింది. ఎమ్జీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయమది. ఈ ముఖ్యమంత్రి ఎన్నో చిత్రాల్లో హీరోగా నటించారని విని ఆశ్చర్యపోయిన విదేశీ సినీ ప్రముఖులు ఆయన సినిమా ఏదన్నా చూడాలని ముచ్చట పడ్డారు. ఎమ్జీ రామచంద్రన్ సినిమా ఏదన్నా చూపించమని ఫిల్మ్ ఫెస్టివల్ ఆర్గనైజర్‌ను అడిగారు. ఆ ఆర్గనైజర్ ఉత్తరాది వాడు. విదేశీ ప్రముఖులు రాముల వారి సినిమా చూడాలనుకుంటున్నారని పొరపడి, రాముల వారి సినిమా ఏదన్నా ఉంటే పంపించమని ఫిల్మ్ ఛాంబర్‌కు కబురు చేశారు. దాంతో ఛాంబర్ ప్రతినిధులు రామాయణ గాథను తీసిన ప్రతి ఒక్క నిర్మాతకు ఫోన్ చేశారు. కానీ ఎవరి దగ్గరా ప్రింట్లు రెడీగా లేవు. ముళ్లపూడి వెంకట రమణకు కూడా ఫోన్ వచ్చింది. ఆయన వెంటనే 'సీతా కల్యాణం' ప్రింట్ పంపించారు.

ఆ మర్నాడు విదేశీ సినీ ప్రముఖులకు 'సీతా కల్యాణం' సినిమా ప్రదర్శించారు. ఆ దృశ్య కావ్యం చూసి ప్రతి ఒక్కరికీ మతి పోయింది. 'ఇంత మంచి సినిమాను ఎందుకు చూపించలేదు' అంటూ ఆర్గనైజింగ్ కమిటీని ప్రశ్నించారు. లండన్ 'గార్డినర్' అనే పత్రికలో సినిమా సెక్షన్ ఎడిటర్‌గా డెరిక్ మాల్ కమ్ ఉండేవారు. ఆయన దర్శకుడు బాపుని కలుసుకుని 'ఆరు నెలల్లో లండన్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతుంది. మీ సినిమాను పంపించండి. మేం కూడా మీ ప్రభుత్వానికి లెటర్ రాస్తాం' అని చెప్పారు.అలా లండన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'సీతా కల్యాణం' చిత్రాన్ని ప్రదర్శించారు. సినిమా పూర్తి కాగానే థియేటర్‌లో ఉన్న వారంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో దర్శకుడు బాపుని అభినందించారు. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రవి, సీతగా జయప్రద, రావణుడిగా సత్యనారాయణ నటించారు. కె.వి మహదేవన్ తన సంగీతంతో ఈ సినిమాకు ప్రాణం పోశారు.



బెర్లిన్‌లో 'ది ఫాబల్'కు అద్భుత స్పందన

మనోజ్ వాజ్‌పేయి ప్రధాన పాత్ర పోషించిన 'ది ఫాబల్' చిత్రాన్ని బెర్లిన్‌లో జరుగుతున్న 74 వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో శుక్రవారం ప్రదర్శించినప్పుడు అద్భుతమైన స్పందన వచ్చిందని దర్శకుడు రామ్‌రెడ్డి చెప్పారు. 16 ఎం.ఎం. ఫార్మెట్‌లో ఉత్తరాఖండ్‌లో ఈ చిత్రాన్ని రూపొందించారు. 'బెర్లిన్‌లో జరిగిన ఫెస్టివల్‌లో మా చిత్ర ప్రదర్శనకు వచ్చిన స్పందన అద్భుతం. తొలి ప్రదర్శన టికెట్లు గంటలోనే అమ్ముడవగా, రెండో రోజు కూడా దాదాపు వెయ్యి టికెట్లు అమ్ముడవడం చాలా ఆనందాన్ని కలిగించింది. మా కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది' అని మీడియాకు చెప్పారు రామ్‌రెడ్డి. ఆయనకు 'ది ఫాబల్' రెండో సినిమా. మొదటి చిత్రం 'తితి' కూడా జాతీయ అవార్డ్ సాధించడమే కాకుండా అంతర్జాతీయంగా ప్రశంసలు పొందింది.